
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 39

సోమవారం
23-10-2023



SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీకి 'గాలాడటం' లేదు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆదివారం 'వెరీ పూర్' స్థాయికి పడిపోయింది.

వివరాలు 6లో ▸



హమాస్‌పై ముప్పేట దాడి

గాజా, సిరియా, వెస్ట్‌బ్యాంక్‌లోని హమాస్ మిలిటెంట్ల స్థావరాలపై ఇజ్రాయెల్ క్షిపణులతో భీకర దాడులు చేసింది.

వివరాలు 6లో ▸



ఫిలిప్పీన్స్ నౌకలను ఢీకొట్టిన చైనా

దక్షిణ చైనా సముద్రంలోని వివాదాస్పద ప్రాంతంలో ఆదివారం ఫిలిప్పీన్స్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

వివరాలు 6లో ▸



నేపాల్‌లో భూకంపం


నేపాల్ రాజధాని కాఠ్మాండును ఆదివారం భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో భూమి కంపించింది.

వివరాలు 6లో ▸

300 కిలోల బంగారం సీజ్

- ప్రొద్దుటూరులో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు
- 2 వాహనాల్లో బంగారం, డాక్యుమెంట్ల తరలింపు
- నాలుగు రోజులపాటు నాలుగు బంగారు దుకాణాల్లో తనిఖీలు

- వివరాలు 5లో



ఉత్తరం.. ఉత్తదే
చంద్రలేఖలో ఇంద్రజాలం!

పండుగ పూట పచ్చి అసత్యాలతో చంద్రబాబు 'నకిలీ' విన్యాసాలు

జైలు నుంచి ప్రజలకు తమ అధినేత లేఖ రాశారంటూ టీడీపీ ప్రచారం

- ఖండించిన రాజమహేంద్రవరం జైలు అధికారులు
- అలాంటి లేఖ ఏదీ జైలు నుంచి విడుదల కాలేదని ప్రకటన
- ప్రజా స్పందన లేకపోవడం, కార్యకర్తలు మొహం చాటేయడంతో
- కప్పిపుచ్చుకునేందుకు లేఖ పేరుతో చినబాబు డ్రామాలు
- స్కిల్ స్కామ్ కేసులో న్యాయ పరీక్షకు సిద్ధపడకుండా..
- లేఖలో మాత్రం చివరకు న్యాయమే గెలుస్తుందంటూ దబాయింపు
- సాంకేతిక సాకుతో కేసును కొట్టి వేయాలంటున్న బాబు లాయర్లు

సాక్షి, అమరావతి: 'స్కిల్' స్కామ్‌లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి, ఏసీబీ కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపి నెలన్నర అవుతోంది. ఆయన నుంచి రూ.వందల కోట్ల ఫీజులు తీసుకుంటున్న లాయర్లు మాత్రం చంద్రబాబు తప్పు చేయలేదని అప్పటి నుంచి ఇప్పటిదాకా న్యాయ స్థానాల్లో వాదించలేదు. కేవలం సీఆర్‌పీసీ సెక్షన్–17(ఏ) ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటూ సాంకేతిక అంశాల సాకుతో

మిగతా 10వ పేజీలో ▶

నేను జైల్లో లేను.. అందరి గుండెల్లో ఉన్నా

జైలు నుంచి చంద్రబాబు బహిరంగ లేఖ

చంద్రబాబు బహిరంగ లేఖ అనేది తప్పుడు ప్రచారం

ఖండించిన జైళ్ల శాఖ అధికారులు

మరో మేనిఫెస్టో.. దసరా వేషమే!

చంద్రబాబుకు మంత్రి అంబటి బహిరంగ లేఖ

పండుగపై పడగ!

రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసానికి టీడీపీ కుట్రలు

- పూర్తి వివరాలు 10లో



శ్రీదుర్గాదేవిగా దుర్గమ్మ దర్శనం

3లో

నేడు మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరీదేవి అలంకారాలు.. పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం

భారత్ 5/5



వన్డే ప్రపంచకప్‌లో భారత్ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం ధర్మశాలలో న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో షమీ(ఐదు వికెట్లు), కోహ్లి(95 పరుగులు) చెలరేగి ఆడటంతో వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ టీమిండియా గెలుపుబావుటా ఎగురవేసింది. 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది.

- వివరాలు 12లో



ఎల్‌ఏసీ వెంట మోహరింపులు

- చైనా దుందుడుకు వైఖరి
- 2022లో భారీగా నిర్మాణాలు
- విమానాశ్రయం, హెలిప్యాడ్లు
- డ్రాగన్ దేశం వద్ద 500 అణు వార్‌హెడ్లు!
- 2030 కల్లా రెట్టింపయ్యే చాన్స్
- అమెరికా రక్షణ శాఖ తాజా నివేదికలో వెల్లడి


'చైనాలో సైనిక, భద్రతాపరమైన పరిణామాలు–2023' పేరిట అమెరికా రక్షణ శాఖ తాజాగా ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది. భూటాన్ వెంబడి వివాదాస్పద ప్రాంత సమీపంలో చైనా ఏకంగా ఊళ్లనే ఏర్పాటు చేసిందని తెలిపింది. ప్రయోగానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్న అణు వార్ హెడ్లు చైనా వద్ద ఏకంగా 500 దాకా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

- వివరాలు 6లో

పత్తి రైతుకు 'ధర'హాసం

ఈ ఏడాది అక్టోబర్ 25 నుంచే కొనుగోళ్లకు శ్రీకారం

- ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో గతేడాది మాదిరిగానే ఈసారీ మంచిధర లభించే అవకాశం
- వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలు ధర పెరిగే చాన్స్
- కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020గా నిర్ణయం
- ప్రస్తుతం మార్కెట్‌లో గరిష్ట ధర రూ.7 వేల నుంచి రూ.7,400



కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్ యార్డ్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పత్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పత్తి రైతులకు మంచి ధర దక్కాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఏటా నవంబర్ మొదటి వారంలో కొనుగోళ్లకు శ్రీకారం చుడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ఏడాది పత్తి ధరల్లో హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచే కొనుగోలు కేంద్రాలు తెరవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పత్తి పండించిన ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ముందుగానే పత్తి కొనుగోలు కేంద్రాలను

మిగతా 5వ పేజీలో ▶

ఈశాన్య వర్షాలకు వాయుగుండం బ్రేక్!




- గాలిలో తేమని తనవైపు లాగేస్తున్న వాయుగుండం
- చురుకుదనం కోల్పోయిన ఈశాన్య రుతుపవనాలు
- మరో వారం వరకు వర్షాలకు కష్టమే
- ఉత్తరాంధ్రలో తేలికపాటి వానలకు అవకాశం
- బంగ్లాదేశ్ తీరంవైపు పయనిస్తున్న తీవ్ర వాయుగుండం

- వివరాలు 2లో

సెలవు

విజయదశమి సందర్భంగా నేడు (సోమవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.



గతం మర్చిపోతే ఎలా!?

ఫ్యాక్ట్ చెక్

ప్రజారోగ్యం మెరుగవుతుంటే ఎందుకంత కడుపుమంట రామోజీ?

- గతంలో ఎన్నడూ లేనట్లుగా రాష్ట్రంలో 108, 104 సేవలు అందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం
- ఏడాదికి 108, 104 నిర్వహణ కోసమే రూ. కోట్లు ఖర్చు
- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతున్నా విష ప్రచారమే

- వివరాలు 5లో

కృష్ణా తరంగాలపై ఆధ్యాత్మిక యాత్ర



- దుర్గమ్మ చెంత నుంచి అమరేశ్వరుని వద్దకు బోటు ప్రయాణం
- 3 దేవాలయాలు, 2 పర్యాటక ప్రదేశాలను కలుపుతూ ప్రాజెక్టు
- 80 కిలోమీటర్ల ప్రయాణానికి బోటు సిద్ధం చేస్తున్న ఏపీటీడీసీ
- కార్తీకమాసంలో అందుబాటులోకి తెచ్చేలా కసరత్తు

- వివరాలు 2లో

అలంకార అరటి.. ఆంధ్రా మేటి!

- ఆర్నమెంటల్ బనానా సాగుకు అనువుగా గోదావరి జోన్
- పుష్పగుచ్ఛాలు, గోడలపై అలంకరణల్లో వినియోగం
- వీటి ఆకులతో బయో ప్లేట్స్ తయారీ
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం



సాక్షి, అమరావతి : విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన అలంకార అరటి (ఆర్నమెంటల్ బనానా) సాగుకు ఆంధ్రప్రదేశ్ అనువైనదిగా గుర్తించారు. ఈ రకం అరటిని సాగు చేసేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రపంచ ఉద్యాన పరిశ్రమలో అలంకార అరటి రకాలు ఇటీవల కాలంలో విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. అలంకార అరటి రకాలు ఆహ్లాదం గొలిపేలా ఉంటాయి. అందమైన ఆకులు, పువ్వుల కోసం వీటిని పెంచుకుంటారు. అయితే.. ఇవి తినదగిన పండ్లను ఉత్పత్తి చేయలేవు.

6 నెలలకు రూ.లక్ష ఆదాయం

బ్రెజిల్, థాయ్‌లాండ్, మయన్మార్, చైనా దేశాలలో ఈ రకాలు విశేష ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటికి ఆ దేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. నాలుగు మూసా జాతులను సంకరపర్చడం ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చాలా పొట్టిగా, చిన్నగా.. చూసేందుకు అందంగా కనిపిస్తాయి. ఇంటి పెరట్లోనూ, కుండీలలోను ఈ రకాలను పెంచుకోవచ్చు. ఈ మొక్కలను కనీసం ఒకటిన్నర మీటర్ దూరంలో నాటుకోవచ్చు. నేల స్వభావాన్ని, తోటలోని అనువును బట్టి ఇంకా దగ్గరగా కూడా నాటుకోవచ్చు. వీటికి సోకే ఆకుమచ్చ, గొంగళి పురుగుల నివారణ కోసం కనీస సంరక్షణ చర్యలు చేపడితే చాలు. కుండీ మొక్కలు, ఇంటి ముంగిట, పెరటి తోటల్లో అందం కోసం నాటుకోవడానికి పిలకల్ని ఉత్పత్తి చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి 6 నెలలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. వీటి ఆకులను పుష్పగుచ్ఛాల్లో విరివిగా ఉపయోగిస్తుంటారు. గోడలపై అలంకరణలకు, బయో ప్లేట్స్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. విదేశాల్లో మాత్రమే సాగవుతున్న ఈ రకాల సాగుకు రాష్ట్రంలోని గోదావరి జోన్‌లోని ఉష్ణ మండల ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించే దిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది.

సత్ఫలితాలిచ్చాయి

గోదావరి మండలంలో ప్రధాన పండ్ల అరటిలో ఆర్నమెంటల్ అరటి జాతుల సాగుపై చేసిన పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయి. మన ప్రాంత వాతావరణానికి అనువుగా, వీటి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పరిశోధన దోహదపడుతుందని గుర్తించాం.

– డి.బేబి శ్రీదివ్య, విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సత్ఫలితాలిస్తున్న పరిశోధనలు

పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయి. మన ప్రాంతం వీటి సాగుకు అనువైనదిగా గుర్తించాం. రైతులకు పరిశోధనా ఫలాలు అందించేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి.

– డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

ఇదండీ సంగతి



...ఓటర్లను ఆకర్షించడానికట!

కాల్‌చేస్తే 'సరి'..

- దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న 'సమీకృత రైతు సమాచార కేంద్రం'
- ఒక్క ఫోన్‌తో రైతుల సాగు ఇబ్బందులు పరిష్కారం
- విశేష అనుభవం కలిగిన ఆరుగురు శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందం.. కాల్ సెంటర్‌లో 54 మంది సిబ్బంది
- రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో సేవలు.. సగటున రోజుకు 649 కాల్స్..
- సమస్యకు సంబంధించిన ఫొటోలు వాట్సప్ నెంబర్లకు పంపితే చాలు

2లో

క్లుప్తంగా...

గోదావరికి పెరుగుతున్న వరద

కుక్కునూరు: గోదావరి నదిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మరమ్మతుల నిమిత్తం ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు నుంచి ఐదు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో సాయంత్రం నుంచి గోదావరికి వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. దీనిపై అధికారులు అప్రమత్తమయ్యారు. వరద విషయాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి విలీన మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు. పెరిగిన వరద భద్రాచలం వద్ద 25 నుంచి 30 అడుగుల వరకు ఉంటుందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

శ్రీవారికి స్వర్ణ తాపడంతో రజత సింహాసనం


సింహాసనాన్ని ఈవోకు అందజేస్తున్న బొత్స ఝాన్సీ, కుటుంబసభ్యులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమల ఆలయంలో శ్రీవారికి మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబం రూ.20 లక్షల విలువైన బంగారు తాపడంతో తయారు చేసిన రజత సింహాసనాన్ని ఆదివారం బహూకరించింది. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో సింహాసనానికి అర్చకులు పూజలు చేశారు. సింహాసనాన్ని బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీ, కుటుంబ సభ్యులు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావుకు అందజేశారు. వీరికి అర్చకులు వేదాశీర్వచనాన్ని అందించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో అన్మిష్ వర్మ ప్రపంచ రికార్డు



సాక్షి, అమరావతి: ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖ యువకుడు భూపతి రాజు అన్మిష్ వర్మ రికార్డు సృష్టించాడు. ఈ చాంపియన్ షిప్‌లో వరుసగా మూడుసార్లు స్వర్ణ పతకాన్ని గెలిచిన క్రీడాకారుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆదివారం కెనడాలో జరిగిన ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్–2023లో 75 కేజీల విభాగంలో విజేతగా నిలవడం ద్వారా ఈ ఘనత సాధించాడు. ఇంతకుముందు 2018 ఏథేన్స్, 2019 ఆస్ట్రియాలలో జరిగిన పోటీల్లోనూ అన్మిష్ వర్మ విజేతగా నిలిచాడు.

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక వద్ద గౌతమి గోదావరిలో శనివారం గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఏడుగురు యువకులు పుట్టిన రోజు వేడుకకు యానాం రావడం, వారిలో గోపులంక వద్ద గోదావరిలో నలుగురు గల్లంతవడం తెలిసిందే. వీరిలో హనుమకొండ కార్తీక్, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. చేతికి అందివచ్చే సమయంలో ఆ యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యువకుల మృతదేహాలను వెలికితీయడంలో కొవ్వూరు ఫైర్‌స్టేషన్ స్కూబా డైవింగ్ నిపుణుడు ఆక్సిజన్ సాయంతో సుమారు 70 అడుగుల లోతులో మూడు గంటల పాటు శ్రమించి, కార్తీక్, రవితేజ మృతదేహాల ఆచూకీ కనుగొన్నారు.

కాల్‌చేస్తే ‘సరి’..

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ‘సమీకృత రైతు సమాచార కేంద్రం’

ఒక్క ఫోన్‌తో రైతుల సాగు ఇబ్బందులు పరిష్కారం

- విశేష అనుభవం కల్గిన ఆరుగురు శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందం
- కాల్ సెంటర్‌లో 54 మంది సిబ్బంది.. రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో సేవలు
- సగటున రోజుకు 649 కాల్స్..
- సమస్యకు సంబంధించిన ఫొటోలు వాట్సప్ నెంబర్లకు పంపితే చాలు
- తీవ్రతను బట్టి 24 గంటల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- 40 నెలల్లో 7.79 లక్షల కాల్స్.. 11,725 వాట్సప్ మెసేజ్‌లు
- 90 శాతానికి పైగా రైతు సమస్యలు పరిష్కారం
- ఏపీ స్ఫూర్తితో తెలంగాణాలోనూ కాల్ సెంటర్ ఏర్పాటు
- రాజస్థాన్‌తో పాటు ఇథియోపియాలోనూ ఆ దిశగా అడుగులు


గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం భవనం


ఐసీసీ కాల్ సెంటర్‌లో విధుల్లో ఉన్న సిబ్బంది

24 గంటల్లో క్షేత్రస్థాయి పరిశీలన..

ఇక సమస్య తీవ్రతను బట్టి సంబంధిత జిల్లాల్లోని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) దృష్టికి తీసుకెళ్తారు. దగ్గరలోని పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలతో కలిసి డీఆర్సీ సిబ్బంది 24 గంటల్లో ఆ రైతు పొలాన్ని సందర్శిస్తారు. అప్పటివరకు వాడిన ఎరువులు, మందుల వివరాలు, సాగు పద్ధతులు తెలుసుకుంటారు. అవసరమనుకుంటే గ్రామంలోని రైతులందరినీ సమీపంలోని ఆర్బీకే వద్ద సమావేశపరిచి సామూహికంగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఇలా ఒక్క ఫోన్‌కాల్‌తో సాగు సమస్యలే కాదు సరికొత్త సాగు విధానాలు, చీడపీడల నియంత్రణ, నివారణోపాయాలు, అధిక దిగుబడికి సలహాలు అందిస్తున్నారు.

ఐసీసీ టోల్ ఫ్రీ నంబర్: 155251 వాట్సప్ నంబర్లు: 8331056028, 8331056149, 8331056150, 8331056152, 8331056153, 8331056154

సాక్షి, అమరావతి: క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఎదుర్కొనే ప్రతీ సమస్యకు చిటికెలో పరిష్కారం చూపిస్తోంది ‘సమీకృత రైతు సమాచార కేంద్రం’. రైతు సమస్యల పరిష్కారం కోసం మూడున్నరేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ కేంద్రం ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఒక్క ఫోన్‌కాల్ లేదా వాట్సప్ మెసేజ్ చేస్తే చాలు.. ఎలాంటి సమస్యకైనా వెంటనే సమాధానం దొరుకుతోంది. జాతీయ అంతర్జాతీయ ప్రశంసలు దక్కడమే కాదు అవార్డులు, రివార్డులు కూడా దక్కాయి. ఏపీ స్ఫూర్తితో ఇప్పటికే తెలంగాణలో కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేయగా, రాజస్థాన్‌లో ఆచరణలోకి రాబోతోంది. మరికొన్ని రాష్ట్రాలు ఏపీ బాటలోనే సొంతంగా కాల్ సెంటర్ ఏర్పాటుచేసుకునేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయి. చివరికి.. ఆఫ్రికన్ దేశం ఇథియోపియాలో కూడా ఏపీ తరహాలో కాల్ సెంటర్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు.

కార్పొరేట్ సంస్థలకు ధీటుగా నిర్వహణ

గతంలో జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన కిసాన్ కాల్ సెంటర్లు పలు రాష్ట్రాల్లో మొక్కుబడిగా పనిచేసేవి. ఈ కాల్ సెంటర్‌కు ఫోన్ కలవడమే గగనంగా ఉండేది. ఒకవేళ కలిసినా రికార్డు వాయిస్ ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వడమే తప్ప రైతుల వెతలు వినే పరిస్థితి ఉండేది కాదు. దీంతో రైతులు పడరాని పాట్లు పడేవారు. ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం పూర్తిస్థాయిలో కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని సంకల్పించారు. దీంతో.. ఆర్బీకేలతో పాటు విజయవాడ సమీపంలోని గన్నవరం వద్ద ఏర్పాటుచేసిన సమీకృత రైతు సమాచార కేంద్రం–ఐసీసీ కాల్ సెంటర్‌కు 2020 మే 30న శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ స్టైల్‌లో తీర్చిదిద్దిన ఈ కాల్ సెంటర్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన 54 మందిని నియమించారు. వీరు ఉ.7 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు రెండు షిఫ్ట్‌లలో సేవలందిస్తున్నారు. ఫోన్ చేయగానే రైతులు చెప్పిన సమస్యలను ఓపిగ్గా వినడమే కాదు.. అత్యంత గౌరవంగా, మర్యాదపూర్వకంగా బదులిస్తున్నారు. తమకు తెలిసినదైతే వెంటనే సమాచారం చెబుతారు. లేదంటే అక్కడే ఉన్న వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన నిపుణులు, శాస్త్రవేత్తలతో మాట్లాడిస్తారు. పంటకు సోకిన పురుగులు, తెగుళ్లకు చెందిన ఫొటోలను వాట్సప్‌లో పంపితే చాలు తగిన పరిష్కారం చూపుతున్నారు.

రికార్డు స్థాయిలో సమస్యల పరిష్కారం

ఇక కాల్ సెంటర్‌కు సగటున ప్రతీరోజూ 649 ఫోన్ కాల్స్, 10 మెసేజ్‌లు చొప్పున ఇప్పటివరకు 7,78,878 ఫోన్‌కాల్స్, 11,725 వాట్సప్ మెసేజ్‌లు వచ్చాయి. వచ్చే ఫోన్ కాల్స్‌లో 80 శాతం వ్యవసాయ శాఖ, 17 శాతం ఉద్యాన శాఖకు సంబంధించిన సమస్యలు ఉంటుండగా, మిగిలిన 3 శాతం మత్స్య, పట్టు, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖలకు సంబంధించినవి ఉంటున్నాయి. ఫోన్‌చేసిన వారిలో 90 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బ్రిటీష్ హై కమిషనర్ గారేత్ వైన్ ఓవర్, నీతి ఆయోగ్ మెంబర్ రమేష్ చంద్, సీఏసీపీ కమిషన్ చైర్మన్ ప్రొ. విజయపాల్ శర్మ, ఐక్యరాజ్య సమితి అనుభంధ సంస్థయిన ఎఫ్ఏఓ కంట్రీ హెడ్ చిభోరి, ఇథియోపియా దేశ వ్యవసాయ శాఖమంత్రి మెలెస్ మెకోనెన్ ఐమెర్ వంటి ఎంతోమంది ప్రముఖులు కాల్‌సెంటర్ నిర్వహణా తీరును ప్రశంసించారు.

ఊరంతా మేలు జరిగింది



నాలుగెకరాల్లో పత్తి వేశా. పంటకు సోకిన తలమాడు తెగులు గుర్తించి సెప్టెంబర్ 5న ఫోన్‌చేశా. ఆ మర్నాడే అధికారులు, శాస్త్రవేత్తలు మా ఊరొచ్చారు. ఊరంతా ఈ తెగులు ఉందని గమనించి ఆర్బీకే వద్ద రైతులందరిని సమావేశపరిచి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను చెప్పారు. నా పొలంలో గుర్తించిన గులాబి రంగు పురుగు నివారణకు సిఫార్సులు చేశారు. మందులు వాడడంవల్ల రైతులందరికీ మేలు జరిగింది. ఎకరానికి 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.
– జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దమ్మాలపాడు, పల్నాడు జిల్లా

ఒక్క ఫోన్‌కాల్‌తో సమస్య దూరం



మా గ్రామంలో దాదాపు వంద ఎకరాల్లో వరి సాగు చేశాం. పైరులో ఉల్లికోడు ఆశించింది. సెప్టెంబర్ 20న నేను గన్నవరం కాల్ సెంటర్‌కు ఫోన్‌చేశాను. వెంటనే కాకినాడ నుంచి డీఆర్సీ సిబ్బంది, శాస్త్రవేత్తలు గ్రామానికి వచ్చి పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు సూచించారు. ఉల్లికోడును తట్టుకునే సురేఖ, దివ్య, శ్రీకాకుళం సన్నాలు వంటి రకాలను సాగుచేస్తే మంచిదని సూచించారు. ఒక్క ఫోన్‌తో మా సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో సంతోషం.
– శీలం చినబాబు, కోరంగి, కాకినాడ జిల్లా

మంచి స్పందన వస్తోంది



కాల్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలకు రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కాల్‌చేసిన వారిలో నూటికి 90 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సంతృప్తి ఈ స్థాయిలో ఉండడం నిజంగా గొప్ప విషయం. కాల్ సెంటర్ సిబ్బంది కూడా చాలా ఓపిగ్గా వింటూ మర్యాదపూర్వకంగా సమాధానాలు చెబుతున్నారు.
– వై. అనురాధ, నోడల్ ఆఫీసర్, ఐసీసీ కాల్ సెంటర్

కాల్ సెంటర్ బలోపేతానికి చర్యలు



దేశంలో మరెక్కడా లేని విధంగా మన రైతు సమాచార కేంద్రం అద్భుతంగా పనిచేస్తోంది. కాల్ సెంటర్‌ను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బ్రేన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఫోన్ రాగానే రైతుల సమస్యలన్నీ ఆటోమెటిక్‌గా సంబంధిత డీఆర్సీతో పాటు జిల్లా, మండల వ్యవసాయ శాఖాధికారులకు క్షణాల్లో చేరిపోతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను కూడా డిజైన్ చేస్తున్నాం.
– వల్లూరి శ్రీధర్, స్టేట్ కోఆర్డినేటర్, ఐసీసీ కాల్ సెంటర్

కృష్ణా తరంగాలపై ఆధ్యాత్మిక యాత్ర

సాక్షి, అమరావతి: జీవన వాహిని కృష్ణవేణి ప్రవాహ మార్గంలో ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక ప్రదేశాలు ఎన్నో.. అటువంటి కృష్ణమ్మ ఒడిలో పడవపై ఆధ్యాత్మిక యాత్రకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)శ్రీకారం చుడుతోంది. ప్రకృతి రమణీయత, ఆధ్యాత్మిక శోభ కలయికగా ప్రాజెక్టును రూపొందిస్తోంది. విజయవాడ నుంచి అమరావతి వరకు కృష్ణానదిపై ప్రత్యేక బోటు తిప్పేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని మూడు దేవాలయాలు, 2 పర్యాటక ప్రాంతాలను ఒక్క రోజులో చుట్టివచ్చేలా ప్రయాణ మార్గాన్ని రూపొందిస్తోంది.

80 కిలోమీటర్ల ప్రయాణం

ఎకో–ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా ఏపీటీడీసీ కృష్ణానదిలో రానుపోనూ సుమారు 80 కిలోమీటర్ల బోటు ప్రయాణాన్ని అందుబాటులోకి తేనుంది. విజయవాడలోని బెరంపార్కులో బయలుదేరే బోటు తొలుత కనకదుర్గమ్మ ఘాట్‌కు చేరుకుంటుంది. అమ్మవారి దర్శనం తరువాత అనంతవరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం, అక్కడి నుంచి పంచారామాల్లో ఒకటైన అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి దర్శనం చేయిస్తారు. మధ్యాహ్నం భోజనం తరువాత తిరుగు ప్రయాణంలో పవిత్ర సంగమం, భవానీద్వీపంలో ప్యాకేజీలు సిద్ధం చేస్తోంది. ఈ యాత్రలో ఆలయాల దర్శనంతో పాటు భోజన సదుపాయాలను ఏపీటీడీసీ ఏర్పా టు చేస్తుంది. బోటులో గైడ్‌ను అందుబాటులో ఉంచనుంది. నాగార్జున సాగర్ నుంచి తీసుకొచ్చిన డబుల్ ఇంజిన్ బోటును ఏపీటీడీసీ ఈ ప్రాజెక్టు కోసం సిద్ధం చేస్తోంది. 40–45 మంది పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా ఈ బోటులో సౌకర్యాలు ఏర్పాటు చేస్తు న్నారు. ప్రయాణ సమయంలో పర్యాటకులకు బో టులోనే ఆహారం అందుబాటులో ఉంచడంతో పాటు ఆలయాలు, పర్యాటక ప్రదేశాల్లోనూ అమృత్ కియోస్క్‌లను ఏపీటీడీసీ ఏర్పాటు చేయనుంది. అధికారుల బృందం అమరావతి వరకు ట్రయల్ రన్ పూర్తి చేసింది. బోటు సిద్ధమైన తరువాత అధికారికంగా మరోసారి ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం ప్రాజెక్టును ప్రారంభిస్తారు. టికెట్ రేట్లు నిర్ణయించేందుకు ఏపీటీడీసీ ప్రత్యేక కమిటీని నియమించనుంది. తొలుత వారాంతాల్లో ఒకసారే ఈ యాత్రను చేపట్టాలని భావిస్తోంది. పర్యాటకుల ఆసక్తి మేరకు నెమ్మదిగా యాత్రల సంఖ్యను పెంచనుంది. 4 వారాల్లోగా బోటును సిద్ధం చేసి కార్తీకమాసంలో యాత్రకు పచ్చజెండా ఊపేలా కసరత్తు చేస్తోంది.

ఈ ప్యాకేజీలో స్పెషల్ దర్శనం



పర్యాటకులకు దైవ దర్శనంతో పాటు ఆహ్లాదాన్ని పంచేలా కృష్ణానదిపై బోటు యాత్రను తీసుకొస్తున్నాం. పటిష్ట భద్రత మధ్య ప్రయాణం సంతోషంగా సాగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వాటర్ సర్క్యూట్ టూరిజం కచ్చితంగా పర్యాటకులను ఆకట్టుకుంటుంది. బస్సులో వెళ్లి దైవ దర్శనం చేసుకోవడంతో పోల్చితే ఇది ఎంతో సులభంగా ఉంటుంది. ఈ ప్యాకేజీలో స్పెషల్ దర్శనం కల్పించడంతో పాటు ప్రసాదం అందజేస్తాం. ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడంతో పాటు సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలకు మరింత వెలుగులు అద్దడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. – కె.కన్నబాబు, ఎండీ, పర్యాటకాభివృద్ధి సంస్థ

అచ్యుతాపురం సెజ్‌లో ఉద్యోగాలే ఉద్యోగాలు

- ఇప్పటికే 1.20 లక్షల మందికి ఉద్యోగాలు
- నిర్మాణంలో ఉన్న కంపెనీలకు మరో 1.80 లక్షల మంది అవసరం

అచ్యుతాపురం (అనకాపల్లి): రాష్ట్రంలోని యువతకు మంచిరోజులొచ్చాయి. ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతను ఇప్పటికే అక్కున చేర్చుకున్న అచ్యుతాపురం సెజ్‌లో మరిన్ని ఉద్యోగాలు రానున్నాయి. రానున్న రోజుల్లో కనీసం 1.80 లక్షల మందికి ఉద్యోగాలు/ఉపాధి కల్పించేందుకు ఇక్కడి ఎస్ఈజెడ్ జోన్‌లో కర్మాగారాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో 5,400 ఎకరాల భూమి సెజ్, నాన్ సెజ్ కింద సేకరించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన బ్రాండిక్స్, ఏషియన్ పెయింట్స్, లారస్, యకోహహతో పలు బ్రాండెడ్ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి. వివిధ రకాల కోర్సులు పూర్తి చేసిన వారికి అచ్యుతాపురం సెజ్‌లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. సిఫారసులు లేకుండా క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేస్తూ ఉద్యోగాలు ఇస్తున్నారు. లారస్ విస్తరణలో భాగంగా 1,800 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. కొద్ది నెలల్లో మరో 2 కంపెనీలకు శంకుస్థాపన జరగనుంది. వీటిలో 1,800 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో నిర్మాణాలు పూర్తయి కార్యకలాపాలు జరుగుతున్న కంపెనీలు 450 కాగా.. వీటిలో 1.20 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. మరో 223 కంపెనీలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిద్వారా అదనంగా మరో లక్షల 80 వేల ఉద్యోగాలు రానున్నాయి. డిప్లమో, డిగ్రీ స్థాయి విద్యార్థులకు ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు కార్మికులకు వైద్య సేవలందించే ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయింపు జరిగింది.

నిరుద్యోగులకు బాసటగా ఎస్ఈజెడ్

నిరుద్యోగులకు అచ్యుతాపురం క్లస్టర్ సెజ్ బాసటగా నిలవనుంది. ఇప్పటికే వివిధ కంపెనీల్లో 1.20 లక్షల మంది పనిచేస్తున్నారు. మరో 1.80 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. 223 కంపెనీలు నిర్మాణ దశలో ఉన్నాయి.
– త్రినాథరావు, అచ్యుతాపురం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

ఈశాన్య వర్షాలకు వాయుగుండం బ్రేక్!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల చురుకుదనానికి వాయుగుండం బ్రేకులు వేసింది. మళ్లీ ఇవి చురుకుదనం సంతరించుకోవడానికి మరికొన్ని రోజుల సమయం పట్టనుంది. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని వాయుగుండం బలపడి మరో మూడు, నాలుగు రోజులు ఉత్తర ఈశాన్య దిశగా బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు ప్రయాణించనుంది. ఈ వాయుగుండం గాలిలోని తేమను అటువైపు లాక్కుని పోతుండటంతో ఈశాన్య రుతుపవనాలు మన రాష్ట్రంపై ప్రభావం చూపలేకపోతున్నాయి. ఈ వాయుగుండం తీరాన్ని దాటే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుంది. వాయుగుండం బెంగాల్ తీరాన్ని దాటడానికి ఇంకా నాలుగైదు రోజులు పడుతుంది. ఆ తర్వాత మరో రెండు మూడు రోజులకు గాని ఈశాన్య గాలుల్లో తేమ ఏర్పడే పరిస్థితి ఉండదు. అందువల్ల ఈశాన్య రుతుపవనాలు బలం పుంజుకోవడానికి కనీసం వారం రోజులైనా పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏపీలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవాలంటే అప్పటివరకు వేచి ఉండాల్సిందేనని చెబుతున్నారు.

తీరానికి దూరంగా వాయుగుండం

సాధారణంగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం గాని, వాయుగుండం గాని ఏర్పడితే ఏపీలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. కానీ ప్రస్తుత వాయుగుండం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోనే ఏర్పడినప్పటికీ అది తీరానికి దూరంగా ఉంది. పైగా ఈ వాయుగుండం ఆంధ్ర తీరం వైపు కాకుండా బెంగాల్ వైపు పయనిస్తూ పునరావృతం) చెందుతుంది. ఫలితంగా ఏపీలో వర్షాలు కురవడం లేదని వాతావరణ నిపుణులు అంటున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలకు వారమైనా పట్టవచ్చని చెబుతున్నారు.

బలపడిన వాయుగుండం..

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం సాయంత్రానికి తీవ్రవాయుగుండంగా బలపడింది. ఇది ఒడిశాలోని పారాదీప్‌కు దక్షిణంగా 550, పశ్చిమ బెంగాల్‌లోని దిఘాకు దక్షిణంగా 710 కి.మీల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తీవ్రవాయుగుండం సోమవారం వరకు ఉత్తర దిశగా కదులుతుంది. ఉత్తర ఈశాన్యంగా దిశ మార్చుకుంటూ రీకర్వ్ తీసుకుని బంగ్లాదేశ్ తీరం వైపు పయనిస్తుందని ఐఎండీ తెలిపింది.

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



ప్రముఖ పర్యాటక కేంద్రం పాపికొండలకు పర్యాటకులు పోటెత్తారు. దసరా సెలవులు, ఆదివారం కావడంతో పోచవరం బోట్ పాయింట్ వద్ద క్యూ కట్టారు. 13 బోట్లలో 951 మందికిపైగా పాపికొండలకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో బోటింగ్ పాయింట్, పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాలు రద్దీగా మారాయి. –వీఆర్‌పురం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పోర్టుల చుట్టూ పారిశ్రామిక ప్రగతి

- ‘రామాయపట్నం’ చెంత 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు
- తొలి దశలో 4,850 ఎకరాల భూ సమీకరణ
- చేవూరులో 1312.58 ఎకరాలు, రావూరులో 951.77 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీ
- డిసెంబర్ నాటికి సిద్ధం కానున్న రామాయపట్నం పోర్టు



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ సముద్ర తీరాన్ని వెలకట్టలేని సంపదగా భావిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాన్ని పూర్తి అనుకూలతగా మార్చుకోవడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి నాలుగు పోర్టుల నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు ఆ పోర్టులను ఆధారంగా చేసుకుని చుట్టుపక్కలా పారిశ్రామిక ప్రగతిని వెదచల్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. కొత్తగా ఏర్పాటుచేస్తున్న పోర్టుల పక్కన పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయడంపై దృష్టిసారించింది. ముందుగా రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేసి కొత్త సంవత్సరంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే విధంగా ఏపీ మారిటైమ్ బోర్డు ప్రణాళిక సిద్ధం చేసింది. త్వరలో పోర్టు అందుబాటులోకి రానుండటంతో రామాయపట్నం పోర్టుకు సమీపంలో సుమారు 8,000 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కును ఏపీమారిటైమ్ బోర్డు అభివృద్ధి చేస్తోంది. పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రగతిపై దృష్టిసారించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకోసం భూ సేకరణ ప్రక్రియ మొదలు పెట్టినట్లు ఏపీ మారిటైమ్ బోర్డు ఎండీ, సీఈవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. తొలి దశలో 4,850 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు అభివృద్ధి చేయనుండగా దీనికోసం గుడ్లూరు మండలం చేవూరులో 1312.58 ఎకరాలు, రావూరు గ్రామంలో 951.77 ఎకరాల భూ సేకరణకు సంబంధించి నెల్లూరు జిల్లా కలెక్టర్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. రూ.3,736 కోట్లతో 850.79 ఎకరాల వీస్తీర్ణంలో ఏడాదికి 34.04 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రామాయపట్నం తొలి దశ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. రూ.2,634.65 కోట్ల విలువైన పోర్టు నిర్మాణ కాంట్రాక్టును నవయుగ–అరబిందో భాగస్వామ్య కంపెనీ చేపట్టింది. జూన్, 2022లో నిర్మాణ పనులు ప్రారంభించిన ఈ సంస్థ ఈ ఏడాది చివరినాటికి బల్క్ కార్గో బెర్త్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తం 4 బెర్తులు నిర్మిస్తుండగా అందులో 2 మల్టీపర్పస్ బెర్తులు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా, ఒక మల్టీపర్పస్ బెర్తు ఇండోసోల్ క్యాపిటివ్ (సొంత) అవసరాలకు ప్రభుత్వం కేటాయించింది. బల్క్ కార్గో బెర్త్‌ను ఏపీ మారిటైమ్ బోర్డు నిర్వహించనుంది.

పోర్టు పక్కనే కార్గో ఎయిర్ పోర్ట్

కేవలం పోర్టులను నిర్మించడమే కాకుండా పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రగతిపై దృష్టిసారించాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది అక్టోబర్ నెలలో జరిగిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల వద్ద భారీ పారిశ్రామిక పార్కుల నిర్మాణానికి సంబంధించి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీ వేయాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రామాయపట్నం పోర్టు సమీపంలో కార్గో ఆధారిత ఎయిర్‌పోర్టు నిర్మాణంపైన కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా గతంలో ప్రతిపాదించిన దగదర్తి స్థానంలో కార్గో ఆధారిత విమానాశ్రయాన్ని రామాయపట్నం పోర్టుకు సమీపంలోని తెట్టు వద్ద అభివృద్ధి చేయనున్నారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్ 16కి తూర్పువైపు పోర్టు ఉంటే, పడమర వైపు ఎయిర్‌పోర్టు ఉండే విధంగా డిజైన్ చేశారు.

నేటి భవితలో..

- యూపీఎస్సీ ఎగ్జామ్స్: ఐఎఫ్ఎస్.. మెయిన్స్‌లో మెరిసేలా! ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్).. సివిల్ సర్వీసెస్ తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న సర్వీస్‌గా గుర్తింపు! ఇది సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథ్స్ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు పోటీ పడే పరీక్ష! ఇందులో విజయం సాధిస్తే.. అటవీ శాఖలో ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించే అద్భుత అవకాశం లభిస్తుంది! ఇంతటి కీలకమైన సర్వీసులోకి అభ్యర్థుల ఎంపికకు సంబంధించి యూపీఎస్సీ ప్రతి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది! ఐఎఫ్ఎస్–2023కు సంబంధించి ఎంపిక ప్రక్రియలో రెండో దశ.. మెయిన్ పరీక్షలు నవంబర్ 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్ష విధానం, విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం.
- గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్,బ్యాంక్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం

మూడు విడతలుగా సామాజిక న్యాయ బస్సుయాత్ర

- ఉత్తరాంధ్రలో 26 నుంచి ప్రారంభం
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స


మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. పక్కన వైవీ సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: సామాజిక న్యాయం అంటే ఏమిటో నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్లు వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకూ ఉత్తరాంధ్రలో తొలి విడత 'సామాజిక బస్సు యాత్ర' జరుగుతుందని తెలిపారు. తమ పాలనలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమాన్ని బస్సుయాత్ర సందర్భంగా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఆదివారం విశాఖలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి మీడియాతో వారు మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సామాజిక బస్సుయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సామాజిక న్యాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీల్లో 99 శాతం అమలు చేశామని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని వివరించారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు ఇచ్ఛాపురంలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 27న విజయనగరం జిల్లా గజపతినగరం, 28న భీమిలి, 30న పాడేరు, 31న ఆముదాలవలస, నవంబర్ 1న పార్వతీపురం, 2న మాడుగుల, 3న నరసన్నపేట, 4న ఎస్.కోట, 6న గాజువాక, 7న రాజాం, 8న సాలూరు, 9న అనకాపల్లిలో బస్సు యాత్ర జరుగుతుందని వివరించారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర మంత్రులతో పాటు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు హాజరవుతారని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. టీడీపీ హయాంలో జరిగిన అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు.

175 నియోజకవర్గాల్లోనూ యాత్ర

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ కేబినెట్ కూర్పు నుంచి రాజ్యసభ, స్థానిక, నామినేటెడ్, ఎన్నికల్లో ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వచ్చారని చెప్పారు. ఈ విషయాలను 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర ద్వారా తెలియజేస్తామన్నారు. మీడియా అడిగిన ప్రశ్నలకు బొత్స సమాధానమిస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 8వ తరగతి పిల్లలకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తున్నామని, దీనిపై పవన్‌కళ్యాణ్‌కు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పవన్‌కళ్యాణ్ ఏదైనా అంశంపై మాట్లాడాలనుకుంటే దాని పూర్వాపరాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కె.భాగ్యలక్ష్మి, ఎంపీలు బీశెట్టి సత్యవతి, బెల్లాన చంద్ర శేఖర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అన్నిరంగాల్లో పెద్దపీట

నవంబర్ 2న చిత్తూరు జిల్లాలో సామాజిక సాధికార బస్సు యాత్ర: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, చిత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బలహీన వర్గాలకు పదవులు, సంక్షేమ పథకాలతో పాటు అన్నిరంగాల్లో పెద్దపీట వేసిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చిత్తూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 70 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు జరిగిన మేలును సామాజిక సాధికార బస్సు యాత్రలో వివరిస్తామని చెప్పారు. గతంలో టీడీపీ ఆయా సామాజిక వర్గాలను కేవలం ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసిందని గుర్తు చేశారు. వారి వెనుకబాటును గుర్తించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 99 శాతం హామీలు అమలు చేయడంతోపాటు అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికే మేలు చేశారని వివరించారు. కానీ.. టీడీపీ, ఎల్లోమీడియా కలసికట్టుగా అడుగడుగునా విషాన్ని చిమ్ముతున్నాయని విమర్శించారు. ఈ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. బలహీనవర్గాలకు జరిగిన మేలును, భవిష్యత్‌లో చేయబోయే మేలును కూడా ఈనెల 26వ తేదీ నుంచి 'సామాజిక సాధికార బస్సుయాత్ర' ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రాయలసీమలోని ఏడు జిల్లాల్లో ఏడు నియోజకవర్గాలు ఎంపిక చేసి బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. చిత్తూరులో నవంబర్ 2వ తేదీన యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో కలసి ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే 'సామాజిక న్యాయ బస్సుయాత్ర–ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకట్ గౌడ, ఎంఎస్ బాబు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

తెలంగాణ

రామయ్య భూముల్లో రగడ

భద్రాచలం: ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ భూముల రగడ ఆదివారం మళ్లీ ఉద్రిక్తతకు దారితీసింది. ఆ భూమి తమదంటే తమదంటూ రైతులు, ఆలయ సిబ్బంది, అర్చకులు ఆందోళనకు దిగారు. ఇరువర్గాల నడుమ తోపులాట జరగడంతో దేవస్థానం సిబ్బందిలో కొందరి చొక్కాలు చిరగగా, మరికొందరికి గాయాలయ్యాయి.

వివాదం రాజుకుందిలా..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 1,350 ఎకరాల భూమి ఉందని దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి. ఇందులో 889 ఎకరాలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పురుషోత్తపట్నంలో ఉంది. అయితే ఇందులో దాదాపు 750 ఎకరాల భూమి ఆక్రమణకు గురయిందని అధికారులు అంటున్నారు. ఇది పోగా మిగిలిన భూమి ప్రస్తుతం దేవస్థానం ఆధ్వర్యంలో ఉంది. ఇందులో 104 ఎకరాల్లో గోశాల, చెరువు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మిగిలిన భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టడం, వాటిని సిబ్బంది కూల్చివేయడం గత ఏడాదిన్నర కాలంగా నడుస్తోంది. కాగా, ఆ భూములను దేవస్థానానికి అప్పగించాలని ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని అమలు చేయాలంటూ భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి, పాడేరు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులను పలుమార్లు కలిశారు. రైతులతోనూ యటపాకలో చర్చలు జరిపారు. ఇదిలాఉండగా, ఆదివారం ఆలయ సిబ్బంది, అర్చకులు, ఈఓ, ఏఈఓ తదితరులు పురుషోత్తపట్నం భూముల్లో ఉండగా వారిని కొందరు రైతులు అడ్డుకున్నారు. ఇరువర్గాల నడుమ తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ భూముల్లో వేసిన జామాయిల్ తోటను ఆలయ సిబ్బంది నరికారని రైతులు ఆరోపించగా, గోశాలలో పూజలతో పాటు, హరితహారం చేపట్టామని, దీనిని రైతులు అడ్డుకుని తమపై దాడి చేశారని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఇలా పరస్పర ఆరోపణలు, తీవ్ర వాగ్వాదంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు ఆహ్వానం పలికారు. అనంతరం అర్చక బృందం 'ఇస్తికఫాల్' ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం చేశారు. తీర్థ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని చైర్మన్, ఈవో అందించారు.


గవర్నర్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న భూమన, ధర్మారెడ్డి

మేము చాక్లెట్ తినం.. పండిస్తాం

దేశంలో చాక్లెట్లు తినేవాళ్లు చాలా తక్కువ

- సగటు చాక్లెట్ వినియోగం 0.14 కిలోలే
- స్విట్జర్లాండ్, ఆస్ట్రియా వంటి దేశాల్లో ఏడాదికి 8 కేజీల పైన వినియోగం
- ప్రస్తుతం దేశంలో చాక్లెట్ పరిశ్రమ విలువ రూ.19,440 కోట్లు
- ఐదేళ్లలో రూ.33,210 కోట్లకు చేరుతుందని అంచనా
- దేశంలో సాగవుతున్న కోకో ఉత్పత్తిలో 40 శాతం మన రాష్ట్రం నుంచే
- రాష్ట్రంలో 41,870 హెక్టార్లల్లో సాగు.. 11,450 టన్నుల కోకో ఉత్పత్తి
- ఏటా 2.2 లక్షల టన్నుల కోకో వినియోగించేలా శ్రీసిటీలో మాండలీజ్ భారీ విస్తరణ



సాక్షి, అమరావతి: పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతగానో ఇష్టపడే చాక్లెట్ తలసరి వినియోగం మన దేశంలో ఎంతో తెలుసా.. 140 గ్రాములు మాత్రమే. అంటే ఒక మనిషి ఏడాది మొత్తం మీద సరాసరిన తినే చాక్లెట్ 0.14 కిలోలే. అదే విదేశీయులు.. ముఖ్యంగా పాశ్చాత్య దేశీయులు కిలోలకొద్దీ చప్పరించేస్తున్నారు. పలు దేశాల్లో చాక్లెట్ వినియోగం ఏకంగా 8 కిలోలుగా లెక్కగట్టారు. అంటే ఒక మనిషి ఏడాదిలో 8 కిలోల చాక్లెట్లు తినేస్తాడు. స్విట్జర్లాండ్‌లో ప్రతి మనిషి సగటున 8.8 కిలోల చాక్లెట్లు తింటూ ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్నారు. ఆస్ట్రియాలో 8.1 కిలోలు, జర్మనీలో 7.9 కిలోలు, ఐర్లాండ్‌లో 7.9 కిలోలు, బ్రిటన్‌లో 7.6 కిలోలు, స్వీడన్‌లో 6.6 కిలోలు వినియోగిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దేశంలో ఆది నుంచి చాక్లెట్ల వినియోగం తక్కువే. నిన్న మొన్నటి వరకు కూడా విదేశాల నుంచి బంధువులో, స్నేహితులో వస్తే వారు అక్కడి నుంచి తెచ్చే కానుకల్లో చాక్లెట్లదే ప్రథమ స్థానం. అమెరికా, సింగపూర్ నుంచో, సౌదీ నుంచో వచ్చే వారు ఇక్కడి పిల్లల కోసం రక రకాల చాక్లెట్లు పాకెట్లకొద్దీ తెచ్చి పంచేవారు. క్రమంగా భారత దేశంలోనూ చాక్లెట్ల పరిశ్రమ ఊపందుకొంది. ఇప్పుడు అవే రకం చాక్లెట్లు దేశంలోనూ దొరుకుతున్నాయి. దీంతో వినియోగమూ పెరుగుతోంది. వీటి తయారీ పరిశ్రమలూ వస్తున్నాయి. మాండలీజ్, నెస్లే వంటి సంస్థలు రకరకాల చాక్లెట్స్‌ను దేశంలోనే తయారు చేస్తున్నాయి. ఏటా దేశంలో చాక్లెట్ పరిశ్రమ 8 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. ప్రస్తుతం రూ, 19,440 కోట్లుగా ఉన్న దేశీయ చాక్లెట్ పరిశ్రమ 2027–28 నాటికి రూ.33,210 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో మాండలీజ్ భారీ విస్తరణ

దేశీయ చాక్లెట్ పరిశ్రమలో క్యాడ్‌బరీ, ఓరియో, బోర్న్‌విటా వంటి బ్రాండ్లను ఉత్పత్తి చేస్తున్న మాండలీజ్ 50 శాతంపైగా మార్కెట్ వాటాను కలిగి ఉంది. ఆ తర్వాత నెస్లే, ఫెర్రెరో వంటి సంస్థలున్నాయి. శ్రీసిటీలో ఉన్న మాండలీజ్ యూనిట్ నుంచి ఉత్పత్తి అవుతున్న చాక్లెట్లు పలు దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చాక్లెట్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తుండటంతో ఇప్పటికే రూ.2,078 కోట్లు వ్యయం చేసిన మాండలీజ్ తాజాగా రూ.1,600 కోట్లతో చేపట్టిన విస్తరణ చేపట్టింది. విస్తరణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల భూమి పూజ చేశారు.

దేశాల వారీగా సగటు చాక్లెట్ వినియోగం

దేశం	వినియోగం (కిలోల్లో)
స్విట్జర్లాండ్	8.8
ఆస్ట్రియా	8.1
జర్మనీ	7.9
ఐర్లాండ్	7.9
బ్రిటన్	7.6
స్వీడన్	6.6
ఎస్టోనియా	6.5
నార్వే	5.8
పోలాండ్	5.7
బెల్జియం	5.6
ఇండియా	0.14

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న కోకో సాగు

చాక్లెట్ల తయారీలో అత్యంత ప్రధానమైన ముడిసరుకు కోకో. ఈ పంట సాగు దేశంలో చాలా తక్కువ. దీంతో పరిశ్రమలు ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి. దేశంలో కేవలం దక్షిణాదిలో.. అదీ 4 రాష్ట్రాల్లోనే కోకో సాగవుతోంది. దేశీయంగా చాక్లెట్ల తయారీ పెరుగుతుండటంతో కోకో సాగు కూడా క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో మరింత వేగంగా పెరుగుతోంది. దేశీయ సగటు దిగుబడిలో 40 శాతం పైగా రాష్ట్రం నుంచే ఉంది. 2016–17లో దేశవ్యాప్తంగా 82,940 హెక్టార్లలో కోకోను సాగు చేయగా, 2021–22 నాటికి సాగు విస్తీర్ణం 1,05,980 హెక్టార్లకు చేరినట్లు కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే కోకో ఉత్పత్తి 18,920 టన్నుల నుంచి 28,430 టన్నులకు చేరింది. రాష్ట్రంలో 2016–17లో 24,160 హెక్టార్లుగా ఉన్న కోకో సాగు విస్తీర్ణం 2021–22 నాటికి ఏకంగా 41,870 హెక్టార్లుకు చేరుకుంది. అలాగే కోకో ఉత్పత్తి 7,700 టన్నుల నుంచి 11,450 టన్నులకు చేరింది. అంటే గడిచిన ఐదేళ్లలోసాగు విస్తీర్ణం 73% పెరిగితే, ఉత్పత్తిలో 48.7% వృద్ధి నమోదయ్యింది.

రాష్ట్రంలో సాగు విస్తరణకు అవకాశం

శ్రీ సిటీలోని మాండలీజ్ కంపెనీ విస్తరణ పూర్తయితే ఏటా 2.2 లక్షల టన్నుల కోకో అవసరమవుతుందని ఆ సంస్థ చెబుతోంది. దీని ద్వారా 18,000 మంది కోకో రైతులకు ప్రయోజనం లభిస్తుందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో రైతులు కోకో సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

శ్రీదుర్గాదేవిగా దుర్గమ్మ దర్శనం

నేడు మహిషాసుర మర్దినీ, రాజరాజేశ్వరిదేవి అలంకారాలు.. నేటి పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతోన్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా నుంచి 1.20 లక్షల మందికి పైగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపంలో జరిగిన వేద విద్వత్ సభలో వేద పండితులను సత్కరించారు. అనంతరం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని ప్రధాన వీధుల్లో ఆదిదంపతులను పల్లకీపై ఊరేగించారు. కాగా, ఇంద్రకీలాద్రికి ఆదివారం నుంచి భవానీల రద్దీ పెరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి నుంచి భవానీలు దర్శనానికి వస్తున్నారు. కాగా, అమ్మవారిని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ ఎస్.విజయ్ దర్శించుకున్నారు.


వైభవంగా అమ్మవారి నగరోత్సవం

నేడు రెండు అలంకారాలు

ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం దుర్గమ్మ 2 అలంకారాల్లో దర్శనమిస్తారు. తెల్లవారు జామున 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిషాసుర మర్దినీదేవిగా, ఒంటి గంట నుంచి శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. ఉదయం 11 గంటలకు మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. సాయంత్రం 5 గంటలకు కృష్ణా నదిలో హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తారు.


అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న జస్టిస్ చక్రవర్తి


జస్టిస్ భానుమతిని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకుడు


ఈవో రామారావు నుంచి అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న జస్టిస్ విజయ్


అమ్మవారి ప్రసాదం అందుకుంటున్న జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు

మహాగౌరిగా శ్రీశైల భ్రామరి


గ్రామోత్సవానికి తరలివస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీశైలంలో భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో దర్శనమిచ్చారు. నవదుర్గ అలంకారాల్లో ఎనిమిదవ రూపమైన మహాగౌరి అలంకారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. అలాగే, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు నంది వాహనంపై అలంకరించి అలంకార మండపంలో ఆశీనులు చేశారు. ప్రత్యేక అలంకీకృతులైన మహాగౌరి అమ్మవారికి, నందివాహనాధీశులైన ఆదిదంపతులకు వేదమంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. ఆలయ ఉత్సవం, ఆలయ పురవీధుల్లో కళాకారుల నృత్యప్రదర్శనలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

– శ్రీశైలం టెంపుల్

మహాకాళిగా రాజశ్యామల


అమ్మవారికి నమస్కరిస్తున్న స్వరూపానందేంద్ర

పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు ఆదివారం శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు మహాకాళిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. లోక కల్యాణార్థం పీఠంలో చేపట్టిన రాజశ్యామల యాగం దిగ్విజయంగా కొనసాగుతోంది.

స్వర్ణరథంపై శ్రీనివాసుడి వైభవం

నేడు చక్రస్నానంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి బంగారు తేరులో విహరిస్తూ భక్తుల్ని అనుగ్రహించాడు. మంగళవాయిద్యాల నడుమ తిరుమాడవీధులలో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం సాగింది. రాత్రి మలయప్ప స్వామి అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులను పరవశింపజేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్న జీయర్‌స్వామి, చైర్మన్ భూమన దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, బోర్డు సభ్యులు, జేఈవో సదా భార్గవి ఇతర అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో 9వ రోజు సోమవారం ఉదయం 3 గంటల నుంచి పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్నపన తిరుమంజనం వరాహస్వామి ఆలయంలో నిర్వహిస్తారు. ఇది ముగిశాక శ్రీవారి శంఖు, చక్రాలను పుష్కర జలాల్లో ముంచి చక్రస్నానం చేపడతారు. రాత్రి ధ్వజావరోహణం నిర్వహిస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కాగా, టీటీడీ ముద్రించిన 6 పేజీల ప్రత్యేక కేలండర్‌ను చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి అశ్వ వాహనం ఎదుట ఆవిష్కరించారు. రూ.450 విలువైన ఈ కేలండర్‌ను 50 వేల కాపీలను టీటీడీ ముద్రించింది.





ప్రతి దేశ పునాది దాని యువత చదువుకోవడంలో ఉంది.
– డైయోజినీజ్

సాక్షి

సోమవారం, 23 అక్టోబర్ 2023

నిదురించని తోటలోకి

ఒక రాత్రి గజదొంగ ఒక ఇంట్లో ప్రవేశించాడు. అలికిడికి ఇంట్లో ఉన్న ముసలామె లేచింది. 'ఎవరూ?' అని గద్దించింది. 'నేను దొంగని' అన్నాడు దొంగ. 'ఆరి బడవా... నువ్వు రీతి జాతి ఉన్న దొంగవైతే ఇలా ఒంటరి ముసల్ది ఉన్న ఇంట్లో జొరబడతావా? నా కొడుకు పహిల్వాను. పక్క ఊరికి కుస్తీకి వెళ్లాడు. నీకు దమ్ముంటే రేపు నా కొడుకున్నప్పుడు వచ్చి దొంగతనం చెయ్యి' అంది. దొంగకు పౌరుషం వచ్చింది. 'అలాగే. నా రోషం నువ్వెరగవు. కాచుకో' అని వెళ్లిపోయాడు. మరుసటి రోజు కొడుకు వచ్చాడు. తల్లి భోజనం పెడుతూ జరిగింది చెప్పింది. కొడుకు తింటున్న వాడల్లా ముద్ద విడిచి విచారంగా కూచున్నాడు. 'ఏమి నాయనా?' అంది ముసలామె. 'అది కాదమ్మా... నువ్వెలా అలా సవాలు విసిరావు. వాడు దొంగ. ముందు దెబ్బ తీస్తాడో, వెనుక దెబ్బ తీస్తాడో, మత్తుమందు జల్లుతాడో, కొంపకు నిప్పెడతాడో ఎలా తెలుసు? నేరుగా వస్తే పోరాడి గెలుస్తానుగాని దొంగదెబ్బ తీస్తే ఏం చేయను? అవన్నీ కాదు. నిద్రనేది ఒకటి ఉంది కదా... నేను గుర్రు పెట్టి నిద్రపోతున్నప్పుడు వాడు బండరాయి తెచ్చి నెత్తినేస్తే ఏం చేయను' అన్నాడు. ముసలామె తెల్లముఖం వేసింది. మనిషికి నిద్ర ముంచుకొచ్చే రోజుల్లో పుట్టిన కథ ఇది.

ప్రేమ్‌చంద్ రాసిన 'పూస్ కీ రాత్' అనే కథ ఉంది. అందులో ఒక నిరుపేద రైతు తన పొలానికి గడ్డకట్టే చలికాలంలో కాపలా కాయాల్సి వస్తుంది. అతనికి కంబళి ఉండదు. పెళ్లాం, అతను కలిసి కంబళి కోసం మూడు రూపాయలు జమ చేస్తారు కాని ఎవరో అప్పులోడు వచ్చి ఆ డబ్బు పట్టుకెళతాడు. పేదరైతు ప్రతి రాత్రి చలిలో వణుకుతూ నిద్ర పట్టక పొలంలో నానా అవస్థలు పడతాడు. రోజంతా నిద్ర అతడి కనురెప్పల మీదే ఉంటుంది. నిద్ర కావాలి! ఆ రోజు పొలానికి వెళ్లి చలిమంట వేసుకుంటాడు. పక్కనే నడుము వాలుస్తాడు. ఎన్నాళ్లుగా ఆగి ఉందో నిద్ర... కమ్ముకుంది. ఒళ్లెరక్క నిద్ర పోయాడు. మంచును లెక్క చేయక నిద్ర పోయాడు. చలిమంట వ్యాపించి పంటంతా తగలబడినా అలాగే పడి నిద్ర పోయాడు. తెల్లారి భార్య వచ్చి గుండెలు బాదుకుంటూ 'పొలం తగలబడింది' అంటే రైతు లేచి చూసి 'దరిద్రం వదిలింది. ఇప్పుడైనా నిద్రపోని' అని నిద్ర పోతాడు. కష్టం చేసే వాడు నిదురకు పడే కష్టం గురించి ప్రేమ్‌చంద్ రాసిన కథ అది.

నిద్రంటే మనకు చప్పున గుర్తుకొచ్చే జంట ఊర్మిళ, లక్ష్మణస్వామి. అన్నతో పాటు లక్ష్మణుడు అడవికి పోతే పద్నాలుగేళ్లు ఊర్మిళ నిద్ర పోయింది. నిద్ర ఆమెను తన ఒడిలోకి తీసుకుంది. నిద్ర ఆమెను వాస్తవ కలతల నుంచి, భర్త ఎడబాటు దుఃఖం నుంచి, పోచికోలు కబుర్ల నుంచి, ఆరాల నుంచి కాపాడింది. ఊర్మిళకు నిద్ర పట్టకపోయి ఉంటే ఏమై ఉండేదో! శ్రీరాముడి పట్టాభిషేకఘట్టంలో లక్ష్మణుడు హఠాత్తుగా నవ్వడం చూసి ఎవరి వ్యాఖ్యానాలు వారు చేశారు. 'ఎందుకు నవ్వావు లక్ష్మణా' అనంటే 'పద్నాలుగేళ్లు కంటికి రెప్పలా అన్నా వదినలను కాచుకున్నప్పుడు ఒక్కసారి కూడా నిద్ర రాలేదు. తీరా ఇప్పుడు ఇంత గొప్పగా పట్టాభిషేకం జరుగుతుంటే ఈ మోసకారి నిద్ర ముంచుకొస్తున్నదే అని నవ్వాను' అంటాడు.

'కలలు కూడా దోచుకునే దొరలు ఎందుకు?' అంటాడు ఆత్రేయ ఏదో పాటలో. పేదవాడికి ఐశ్వర్యం, వైభోగం లేకపోవచ్చు. ఆరు రకాలుగా తినే వీలు లేకపోవచ్చు. కాని వాడు తుండు తల కింద పెట్టుకున్నాడంటే నిద్రలోకి జారుకుంటాడు. కలల్లో మునిగిపోతాడు. విన్సెంట్ వాన్ గో గీసిన 'నూన్– రెస్ట్ ఫ్రమ్ వర్క్' అనే ప్రఖ్యాత చిత్రం ఉంటుంది. కూలిపని చేసి మధ్యాహ్నం భోజన వేళ గడ్డివాములో కునుకు తీస్తున్న జంటను వేస్తాడు. ఆ క్షణంలో ఆ జంటను చూస్తే వారికి మించిన ఐశ్వర్యవంతులు లేరనిపిస్తుంది. విశ్రాంతినిచ్చే నిద్ర ఎంత పెద్ద లగ్జరీ. కుంభకర్ణుడొక్కడే జీవితమంటే ఉరుకులు పరుగులు కాదని మొదట గ్రహించినవాడు. అతడు ఆరునెలలు నిద్ర పోయేవాడంటే అర్థం– వెకేషన్‌లో ఉండేవాడని! తింటూ నిద్రపోతూ. ఆర్నెల్లు మాత్రమే పని. నెలలో రెండు వారాలు పని చేసి రెండు వారాలు విశ్రాంతి తీసుకునే నాగరిక సమాజం ఎప్పుడో వచ్చే తీరుతుంది.

'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది' అని రాశాడు శేషేంద్ర. ఇప్పుడు మొక్కలు, పూలు ప్రతి ఇంటా ఉన్నా నిదురకు బీడువారిన కళ్లే చాలా ఇళ్లల్లో. కుక్కి మంచంలో సుఖంగా నిద్రపోయే కాలం నుంచి వేల రూపాయల పరుపు మీద కూడా సరిగా నిద్ర పట్టని మనుషుల సంఖ్య చాప కింద నీరులా పెరుగుతోంది. నిద్ర పట్టక, నిద్ర పోలేక, రాత్రి ఎంతకీ గడవక, నిద్ర మాత్రలు మింగలేక, మింగినా నిద్ర రాక... ఒక గొప్ప వైభోగమయ జీవన క్రియను కోల్పోయిన తాజా నిరుపేదలు. ప్రపంచంలో జపాన్ తర్వాత నిద్ర పట్టని వాళ్లు ఎక్కువ ఉన్న దేశం మనదే.

నిదుర ఎందుకు పట్టదు? లక్ష కారణాలు. కాని ఏది నిశ్చింత బతుకు అనేది ఎవరికి వారు వ్యాఖ్యానించుకుని అంతకు సంతప్తి పడటం నేర్చుకుంటే అదిగో బెడ్‌లైట్ స్విచ్చంత దూరంలో నిద్ర కాచుకుని ఉంటుంది. మీ జీవనంలోనే నిద్ర మాత్ర ఉంటుంది. వెతకండి. గాఢనిద్ర ప్రాప్తిరస్తు!

చేరువ కానివ్వని విరోధం!

కామెంట్



కరణ్ థాపర్

ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ కూడా వేటికవి తామే బాధితులమని సంకేత పరచుకునే ప్రభామండలాన్ని తమ శిరస్సుల వెనుక నేడు ధరించి ఉన్నాయి. ఆ ఇద్దరు ప్రత్యర్థులు రాజీ పడటానికి సిద్ధపడకపోవడం మాత్రమే కాదు, రాజీకి ప్రయత్నించినప్పుడు వారి వారి కరడుగట్టిన సమూహాలు వారిని పూర్తిగా వెనక్కు లాగిపడేయటం కూడా జరిగింది. ఇంకా అధ్వాన్నమైన సంగతి ఏమిటంటే... వారి స్నేహితులు, మిత్ర పక్షాలు.. వారిని చెలిమి వైపు ప్రోత్సహించేందుకు ఇష్టపడే అవకాశం కనిపించకపోవడం! వాషింగ్టన్ లేదా లండన్ గానీ, అరబ్ కేంద్రంగా ఉన్న దేశాలు గానీ నిజమైన రాజీకి వారిని ముందుకు నెట్టే ప్రయత్నం చేయడం లేదు.

ఇజ్రాయెల్–పాలస్తీనా వ్యవహారాలు నాకు ఏ విధంగానూ అంతుబట్టనివి. నిజానికి ఆ రెండు దేశాల మధ్య వివాదం గురించి నాకు తెలిసిన రవ్వంత కూడా నేను ఈ రెండు మూడు వారాలుగా తెలుసుకుంటూ వచ్చినదే. అయితే ఆ తెలివిడి నాకు ప్రశ్నలు అడిగేందుకు సరిపోయేదే తప్ప, జవాబులు ఇవ్వగలిగేటంతటిది కాదు. అయినప్పటికీ ఆ మాత్రపు జ్ఞానం నాలో ఒక అభిప్రాయాన్ని ఏర్పరచి దానిని నేను పూర్తిగా విశ్వసించేలా క్రమంగా నాలో నమ్మకాన్ని పెంచుతూ వచ్చింది. ఈ ఉదయం నేను మీతో పంచుకోవాలని అనుకుంటున్నది ఇదే.

ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ కూడా వేటికవి తామే బాధితులమని సంకేత పరచుకునే ప్రభామండలాన్ని తమ శిరస్సుల వెనుక నేడు ధరించి ఉన్నాయి. అయితే బాధ కంటే కూడా గర్వమే తరచూ ఆ ప్రభామండలం చుట్టూతా కాంతిలా ప్రకాశిస్తూ కనిపిస్తోంది. చరిత్రపై తమ దృష్టికోణమే సరైనదనే నమ్మకంతో, ఎవరికివారు స్వీయ నైతిక వర్తనను కలిగి ఉన్నామన్న విశ్వాసాన్ని సమానంగా కలిగి ఉన్నారు. వారు వర్తమానాన్ని ఎలా చూస్తున్నారన్న విషయంలోనూ ఇదే నిజం. 'అవతలి' దేశం తమ పట్ల ఘోరమైన తప్పిదాలకు ఒడిగట్టిందని ఆ రెండు దేశాలు ప్రగాఢంగా విశ్వసిస్తున్నాయి. అయితే వారు అంగీకరించలేని విషయం ఏమిటంటే... శత్రువు పట్ల తాము వ్యవహరిస్తున్న తీరులో ఇద్దరూ కూడా సరి సమానంగా దోషులేనన్నది!

తమకేదైతే జరిగిందో సరిగ్గా అదే తమ ప్రత్యర్థికీ జరిగిందని వారు అంగీకరించరు, అంగీకరించబోరు. ఆ విధమైన 'సమానత్వాన్నే' వారు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు.

అందుకే చాలా తక్కువ మినహాయింపులతో – వాస్తవానికి మీరు వాటిని బహుశా చేతి వేళ్లపైన కూడా లెక్కించవచ్చు – ఇంటర్వ్యూలన్నీ భయానకమైన ఏకపక్ష ధోరణితో ఉన్నాయి. మీరు ఏ విధంగా ప్రశ్న వేసినా మీకు ఇంటర్వ్యూ ఇస్తున్న ఆహ్వానిత పాలస్తీనీయుడు ఆ ప్రశ్నకు జవాబుగా ఇజ్రాయెల్‌ను తీవ్రంగా విమర్శిస్తూ తామెంత ధర్మ బద్ధులో, రుజు ప్రవర్తన కలిగినవారో చెప్పుకుంటారు. ఒక ఇజ్రాయెలీని ఇంటర్వ్యూ చేసినప్పుడు కూడా కచ్చితంగా ఇదే విధమైన స్వీయ సమర్థన వైఖరి వ్యక్తం అవుతుంది. ప్రతి ఒక్క విషయంలోనూ!

ఇజ్రాయెల్, పాలస్తీనా సంక్షోభంపై పద్నాలుగు రోజులలో పది ఇంటర్వ్యూల తర్వాత... ఈ రెండు వర్గాల వారు ఒకే భూమిపై – నిస్సందేహంగా ఒకరితో ఒకరు ఘర్షణ పడుతూనే, గాయాల రక్తం



ఓడుతూనే – కలిసి ఉంటూ కూడా భిన్న ప్రపంచాలలో జీవిస్తున్నారని నేను గ్రహించాను. పర్యవసానంగా తమ భిన్న చరిత్రల నుంచి మాత్రమే కాకుండా తాము పంచుకున్న చరిత్రల నుంచి కూడా వారు అంగీకరించిన కఠిన సత్యాలతో వారికొక జగమొండి ప్రాపంచిక దృష్టి కోణం ఏర్పడింది. తర్వాత అది వర్తమానంలోని విరుద్ధ కోణాలతో బలోపేతం అయింది. వాస్తవాలు ఒకేలా ఉన్నప్పటికీ వాటి అర్థ, వివరణలు పూర్తిగా భిన్నమైనవి.

విచారకరమైన వాస్తవం ఏంటంటే – ఈ రెండు దేశాల స్నేహితులు, మిత్రపక్షాలు దేనికి దానిని విడిగా చూడటం అనే ఏక వైఖరి దృష్టి కోణానికి లోబడి ఉండటం. 'ఏంటిది?!' అని పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌ను ఏమాత్రం నిలదీయకుండా భూత వర్తమానాలపై ఆ దేశపు దృష్టి కోణాన్ని అంగీకరిస్తుండగా, మధ్యప్రాచ్యంలోని అరబ్, ముస్లిం దేశాలు పాలస్తీనా పట్ల తమ తమ అవగాహనలపై ఒకే విధమైన నిబద్ధతతో నిలబడి ఉన్నాయి. పర్యవసానంగా మీరు ఎవరికి మద్దతు ఇస్తున్నారనేది మీరెలాంటి ఆలోచనను కలిగి వున్నారన్న దానిని మాత్రమే కాక, జరుగుతున్న పరిణామాల పట్ల మీ స్పందనను కూడా నిర్ధారణగా తెలియజేస్తుంది. ఈ విధంగా ఇజ్రాయెల్ తోక పశ్చిమ కుక్కను ఊపుతుంది, అదే సమయంలో పాలస్తీనా తోక మధ్యప్రాచ్య కుక్కల్ని గుర్రుమని చూసేలా, మొరిగేలా ప్రేరేపించి వాటిని రెచ్చగొడుతుంది.

బహుశా అందుకే పాలస్తీనా–ఇజ్రాయెల్ వివాదం నేడు మనం ఎదుర్కొంటున్న వాటన్నింటిలోనూ కొంచెమైనా కొరుకుడు పడని అత్యంత కఠినమైన పరిస్థితిగా పరిణమించింది. ఆ ఇద్దరు ప్రత్యర్థులు రాజీ పడటానికి సిద్ధపడకపోవడం మాత్రమే కాదు, రాజీకి ప్రయత్నించినప్పుడు కూడా వారి వారి కరడుగట్టిన సమూహాలు ఆ సంశయాత్మక ప్రారంభ ఉద్దేశాన్ని పూర్తిగా వెనక్కు లాగిపడేయటం కూడా జరిగింది. బహుశా అధ్వాన్నమైన విషయం ఏమిటంటే వారి స్నేహితులు, మిత్ర పక్షాలు... వారిని చెలిమి వైపు ప్రోత్సహించేందుకు ఇష్టపడే అవకాశం కనిపించకపోవడం! వాషింగ్టన్ లేదా లండన్ గానీ, అరబ్ కేంద్రంగా ఉన్న దేశాలు గానీ నిజమైన రాజీకి వారిని ముందుకు నెట్టే ప్రయత్నం చేయడం లేదు. శత్రుత్వ విరమణ కోసం, స్వల్పకాలిక అర్భక ఒప్పందాల కోసమైతేనే నెడతాయి. కానీ ఏదైనా – అసలు స్వరూపాలకు భిన్నంగా నిజాయితీతో అడుగు వేసినప్పుడు మాత్రమే సాధ్యం అయ్యే – దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం మాత్రం నెట్టవు.

అందుకే నేను చేసిన గత రెండు వారాల ఇంటర్వ్యూలు ఆసక్తికరంగా ఉన్నాయి తప్పితే, ఆశాజనకంగా ఏమీ లేవు. పైగా నిస్పృహను కలిగించేలా ఉన్నాయి. నిజానికి, చెరగని విధంగా వారు వేసిన ముద్రే ఇక ఎటువంటి ఆశల్నీ పెట్టుకోలేని మనఃస్థితికి కారణం అయింది. ఇజ్రాయెల్–పాలస్తీనా ఊబిని బాగు చేయడం, ఆ సమస్యను పరిష్కరించడం అసాధ్యంలా కనిపిస్తోంది. నా భయం ఏంటంటే అనంతంగా అది నిరంతరం సాగిపోతూనే ఉంటుందని! రేపన్నది మిగతా ప్రపంచానికి మరొక రోజు కావచ్చు కానీ ఇజ్రాయెల్–పాలస్తీనాలకు మార్పును వాగ్దానం చేయని రోజూ ఉండే ఒక రోజే!

కాబట్టి మనం ఎదుర్కొంటున్న పరిస్థితి గురించి ఆలోచించండి. భీకరమైన హమాస్ దాడి ఇజ్రాయెల్ ఆత్మవిశ్వాసాన్ని ఛిద్రం చేసి, ఆ దాడిని తిప్పి కొట్టాలన్న ఆగ్రహ జ్వాలల్ని రగిల్చినందువల్ల – సాధ్య మైతే – ఏకంగా హమాస్‌ను తుడిచిపెట్టాలన్న ఇజ్రాయెల్ ప్రతీకారం వల్ల తీవ్రమైన మనోవేదన, ఎంతకూ తరగని బాధ మాత్రమే మిగిలి అనివార్యంగా అది భవిష్యత్తులో అధ్వాన్న పరిస్థితికి పునాదులు వేస్తుంది. ఇది దేనిని సూచిస్తోంది? అత్యంత విచారకరమైన, శోచనీయమైన ముగింపు ఏమిటంటే ఈ అంతులేని కథలో మరొక విషాద అధ్యాయానికి పునాది పడబోతుండటం! భవిష్యత్తు ప్రతిసారీ కూడా తిరిగి మనల్ని గతంలోకే తీసుకెళుతున్నట్లుగా కనిపిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనందరిది



జెరూసలేం మన అందరికీ చెందినది... పిల్లలు, అనుచరులు, అబ్రహాం కుటుంబం (యూదులు, క్రైస్తవులు, ముస్లింలు) అందరికీ. అది విద్రోహులకు, తీవ్రవాద మూకలకు మాత్రం చెందదు.

– మహమ్మద్ తాహిది, పీస్ యాక్టివిస్ట్

అది కదా గొప్ప!



ఇప్పుడు ఐఫోన్ ఇండియాలో తయారవుతోందని భారతీయులు ఎందుకంత గొప్పగా ఫీలవుతున్నారు? అది అమెరికా సృజన. చాలా ఏళ్లు చైనాలో తయారైంది. ఇప్పుడు ఇండియాలో అవుతోంది. అయితే మాత్రం ఏమిటట? ఇండియా ఒక యాపిల్ లాంటి కంపెనీని రూపొందించినప్పుడు కదా అసలైన సంబరం?

– సలీల్ త్రిపాఠీ, కాలమిస్ట్

భర్తీ పని



చాలా పనిచేసే ప్రతి ఒక్కరూ నిజంగానే తమ పని మీద అంతులేని ప్రేమతో చేస్తారని ఏమీ అనుకోనక్కర లేదు. చాలామంది తమ గుండెల్లో ఉన్న నిరర్థకతను, జీవితంలోని శూన్యాన్ని అలా 'పని'తో భర్తీ చేసుకుంటూ ఉంటారు.

– రేణూ ధడ్‌వాల్, అకడెమిక్

అద్భుత మినరల్



మెగ్నీషియం మీ నిద్రను మెరుగుపరుస్తుంది. మీ కండరాలను విశ్రమింపజేస్తుంది. మీ ఒత్తిడిని పోగొడుతుంది. మీ ఎముకలను దృఢపరుస్తుంది. మీ రక్తంలోని చక్కెరను స్థిరపరుస్తుంది. మీ విసర్జనను సాఫీగా ఉంచుతుంది. మెగ్నీషియం అనేది మీ మాంత్రిక ఖనిజ లవణం.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

వెనకుండి నడిపేది...



ప్రతి ఒక్క విజయవంతమైన యూఎస్ రాజకీయ నాయకుడి వెనుక ఒక జియోనిస్ట్ (యూదు సంబంధ) బిలియనీర్ ఉంటాడు. కాబట్టి జియోనిస్ట్ లాబీ ప్రభావాన్ని తొలగించలేనంతవరకూ మీరు యూఎస్ విదేశాంగ విధానాన్ని మార్చలేరు.

– ని మింగ్డా, భౌగోళికాంశాల విశ్లేషకుడు

మెరుగైన దారి




యూదు స్నేహితులు, మిత్రపక్షాలకు నేను చెప్పాలనుకుంటున్నది ఏమంటే – మీ బాధ, నిస్పృహలను నేను అర్థం చేసుకుంటున్నాను. 1,300 ఇజ్రాయిలీలను చంపేశారు. ఇంటికి సురక్షితంగా రావాల్సిన సుమారు 200 మంది ఇంకా బందీలుగా ఉన్నారు. గతవారం చాలామంది బాధ, ఆగ్రహానికి గురయ్యారు. ఇన్షా అల్లా! మన ఉమ్మడి మానవీయత మనకో మెరుగైన దారి చూపాలి.

– వజాహత్ అలీ, రచయిత

బడుగు జన బాంధవుడు

జీవితమంతా పీడిత ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసే అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. 'హరిజన సంక్షేమ' శాఖను 'సాంఘిక సంక్షేమ' శాఖగా మార్చడంలో, 'సమీకృత ఆదివాసీ అభివృద్ధి సంస్థ' (ఐటీడీఏ)లను ఏర్పాటు చేయడంలో, 'గిరిజన ఉప ప్రణాళిక'లను ప్రవేశపెట్టడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. 1984లో 'సాంఘిక సంక్షేమ పాఠశాల'లను ఏర్పాటు చేయడానికి కారకులయ్యారు.

తమిళనాడులోని తంజావూరులో 1934 అక్టోబర్ 22న మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శంకరన్ ఐఏఎస్ అధికారి అయ్యారు. 1959లో కర్నూలు జిల్లా నంద్యాల సబ్‌కలెక్టర్‌గా, తర్వాత నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు.



ఎస్ఆర్ శంకరన్

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి (కుమార మంగళం) స్పెషల్ అసిస్టెంట్ సెక్రటరీగా బొగ్గు గనులను జాతీయం చేయటంలో కీలకపాత్ర పోషించారు. 1976లో వచ్చిన 'వెట్టిచాకిరీ నిషేధ చట్టం' అయన కృషి ఫలితమే. త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసినప్పుడు అక్కడ కేంద్ర పారామిలటరీ దళాల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తన శక్తి మేరకు ప్రయత్నం చేశారు. భారత ప్రభుత్వం శంకరన్ సేవలను గుర్తించి 2005లో 'పద్మ భూషణ్' అవార్డును ప్రకటించగా సున్నితంగా తిరస్కరించారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నప్పుడు ఆయనను బదిలీ చేయగా దానికి నిరసనగా ప్రజలు ఆందోళనకు దిగడం... వారికి ఆయనపై ఉన్న అచంచల విశ్వాసానికీ, నమ్మకానికీ నిదర్శనం. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నప్పుడు అక్కడి మహిళా కళాశాలలో సరియైన వసతులు లేవని తెలిసి కలెక్టర్ బంగ్లాను వాడు కోమని ఇచ్చిన ఘనత శంకరన్‌కే దక్కింది.

పదవీ విరమణ అనంతరం తనకు వచ్చిన పెన్షన్ కూడా పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెట్టేవారు. ప్రభుత్వానికీ, నక్సలైట్లకూ మధ్య చర్చలు జరగడంలో ముఖ్యమైన భూమిక పోషించారు. దళిత మానవహక్కుల కార్యకర్త బెజవాడ విల్సన్‌తో కలిసి 'సఫాయి కర్మచారీ అందోళన్' అనే సంస్థను స్థాపించి పాకీ పనివారి విముక్తి కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి ప్రభుత్వం వారి సంక్షేమం మీద దృష్టి సారించేలా చేశారు. 1985లో 'కారంచేడు ఘటన' అనంతరం బాధితులకు పునరావాసం కల్పించడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. 2010 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో మరణించిన ఆయన జీవితం నేటి తరం అధికారులకూ, సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్న వారందరికీ స్ఫూర్తిదాయకం.

– ఎస్. సీతారామయ్య; ఏపీ గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగి, పాడేరు

ఇప్పటికీ ఆశావాదంతోనే ఉన్నాను!

అభిప్రాయం



దూతీ చంద్

స్వలింగ వివాహాన్ని చట్టబద్ధం చేయడానికి సుప్రీం కోర్టు మార్గం సుగమం చేస్తుందని దేశంలోని చాలా మంది ఇతరుల లాగే, నా భాగస్వామి మోనాలిసా, నేను కూడా ఆశించాము. మన దేశంలో గతంలోనూ పాతబడిన, కాలం చెల్లిన చట్టాలను కొట్టివేశారు. కొన్ని సానుకూల వార్తల కోసం మేమిద్దరం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. సుప్రీంకోర్టు తీర్పుతో నేను నిరుత్సాహానికి గురయ్యాను కానీ ఇప్పటికీ ఆశావాదంతోనే ఉన్నాను. స్వలింగ వివాహాలను అనుమతించే చట్టాన్ని త్వరలోనే పార్లమెంటు ఆమోదిస్తుందని నేను నమ్ముతున్నాను. భారతదేశం ప్రజాస్వామ్య దేశం. స్వలింగ వివాహాలను అనుమతించడమనేది ఎక్కువ మందికి ఆనందాన్ని ఇస్తుంది.

కొన్ని సంవత్సరాల క్రితం భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 (ప్రకృతికి విరుద్ధంగా ఏ పురుషుడితోనైనా, స్త్రీతో అయినా శారీరక సంబంధం పెట్టుకోవడంపై శిక్ష విధించడం)ను సుప్రీం కోర్టు నేరంగా పరిగణించనప్పుడే స్వలింగ సంపర్కం గురించి మాట్లాడే ధైర్యం వచ్చింది. స్వలింగ వివాహానికి మార్గం సుగమం చేయడమే ఇక తదుపరి చర్య అవుతుంది.

మా కేసే తీసుకోండి. సుప్రీం కోర్టు స్వలింగ వివాహాలను అనుమతిస్తుందన్న నమ్మకంతోనే వచ్చే ఏడాది మేము పెళ్లి చేసుకోబోతున్నాం. ఆ కోణంలో చూస్తే ప్రస్తుత తీర్పు ఎదురుదెబ్బే. మేము వచ్చే ఏడాది వివాహం చేసుకోవచ్చుగాక, ఓ సంబరాన్నీ జరుపుకోవచ్చుగాక. కానీ, దాన్ని సమాజం గుర్తించవలసినంతగా గుర్తించదు. పరిస్థితులు మారనప్పటికీ మేము కచ్చితంగా వివాహ వేడుకను నిర్వహిస్తాం. మేమూ వివాహానికి సంబంధించిన ఆచార సంప్రదాయాలను అనుభూతి చెందాలనుకుంటున్నాము.

ప్రజలు ఏమంటారన్నది నాకు ముఖ్యం కాదు, కానీ ఇతర దేశాలు స్వలింగ వివాహాలను అనుమతించినప్పుడు, భారతదేశంలో కూడా అదే జరుగుతుందని ఎవరైనా ఆశిస్తారు. ఇప్పుడు, మేము బయటకు వెళ్ళినప్పుడు కొన్నిసార్లు ప్రజలు మోనాలిసా ఎవరు అని నన్ను అడుగుతారు. ఈ ప్రశ్న నన్ను కలవరపెడుతుందని కాదు కానీ ఆమె నా భార్య అని చెబితే బాగుంటుంది. ప్రశ్నలు ముగుస్తాయి, ప్రజలు ఇతర జంటల లాగే మమ్మల్నీ చూస్తారు. ఈ అంశంపై పార్లమెంటే నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు కోరడానికి దాని



సహచరితో వ్యాసకర్త

కారణాలు దానికి ఉన్నాయి. నేను ఆ విషయం జోలికి వెళ్లదలచడం లేదు. అయితే స్వలింగ వివాహాలకు అనుమతిస్తే స్వలింగ జంటలపై విమర్శలు ఆగిపోతాయి. ఈ జంటల్లో కొందరికి నిరంతరం ఎవరో ఒకరి నిఘాలో ఉండటం, లేదా అసౌకర్యం కలిగించే ప్రశ్నలు ఎదుర్కోవడం కష్టంగా ఉంటుంది.

ఆరోగ్యం, బ్యాంక్ ఖాతాలు, చివరకు వీసా కోసం డాక్యుమెంటేషన్, రాతపని తదితర విషయాలకు వస్తే... స్వలింగ జంటలు ఎదుర్కొనే ఆచరణాత్మక సమస్యలు కూడా ఉన్నాయి. నేను భవిష్యత్తులో నా ఆస్తిని నా భాగస్వామికి బదిలీ చేయాలనుకుంటే అది సంక్లిష్టంగా మారవచ్చు. వయసు మీదపడిన తర్వాత మరిన్ని చిక్కులు వస్తాయి. మోనాలిసా, నేను 2018 నుండి భువనేశ్వర్‌లో కలిసి ఉంటున్నాము. మేము మొదట ఒక పూజా కార్యక్రమంలో కలుసుకున్నాము. అప్పటి నుండి కలిసి ఉంటున్నాం. మొదట్లో, మేము స్వలింగ జంట అని తెలిసినప్పుడు, వారు ఇది మంచిది కాదన్నారు. కానీ మేమిద్దరమూ ధైర్యవంతులమే కాబట్టి మెల్లగా వాళ్ల ఆలోచనా తీరు మారిపోయింది. కఠినమైన సమయాలు ఉండేవి. కానీ మేము వాటిని మా ప్రేమ మార్గంలోకి రానివ్వలేదు. ప్రజలు అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, మేము ఒకరితో ఒకరం ప్రేమలో ఉన్నాము. పైగా నేను ఆమెను నాతో ఉండమని కానీ, ఆమె నన్ను ఆమెతో ఉండమని కానీ ఎప్పుడూ బలవంతం చేయడం జరగలేదు.

ఒకే ఇంట్లో ఉండే అన్ని జంటల మాదిరిగానే మేము కూడా మా జీవితంలో ఎగుడు దిగుడులను ఎదుర్కొన్నాము. అయితే మేం ఏం ఎదుర్కోవలసి వచ్చినా ప్రేమ ఒక బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. పైగా మమ్మల్ని సంతోషపరుస్తుంది కూడా! ప్రజలు తాము కోరుకునే ఎవరితోనైనా జీవితాలను పంచుకొని జీవించగలగాలని నేను ఎప్పుడూ నమ్ముతూ వచ్చాను. ప్రేమ కంటే గొప్ప భావోద్వేగం ఏదీ లేదు. అంతే కాదు, సమ్మతితో ఉండే ఇద్దరు వ్యక్తుల ఆనందానికి ఏదీ అడ్డు రాకూడదు.

ఈ మధ్య ప్రజలు మరింత అవగాహనతో వ్యవహరిస్తున్నారు. దాదాపు పరిహాసాస్పదంగా చేసే వ్యాఖ్యలు ఆగిపోయాయి. పైగా 'మీరిద్దరూ పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారు' అనే ప్రశ్న మాకు ఇప్పుడు ఎదురవుతోంది. స్వలింగ సంపర్కులకు సుప్రీం కోర్టు రక్షణలు, హక్కులను కల్పించింది. ఇటువంటి వాటిని మరిన్ని కల్పించాలని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు హోల్డర్, ఆసియా క్రీడల రజత పతక విజేత

పండుగ సందేశం

ఆదిశక్తి అయిన దేవి... దుష్ట శిక్షణ చేసి శిష్టులను రక్షించేందుకు తొమ్మిది సార్లు అవతరించింది అని మార్కండేయ పురాణం.

వర్షాలు వెనకపట్టి శరదృతువు ఆరంభమవుతూనే, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి దాకా, ఆస్తికులు అమ్మవారిని వివిధ నామ రూపాలలో, వివిధ అవతారాలలో, వివిధ పూజా విధులతో ఆరాధిస్తూ వైభవంగా దేవీ నవరాత్ర ఉత్సవాలు జరుపుతారు. శ్రీరాముడూ, శ్రీకృష్ణుడూ, ధర్మరాజు లాంటి మహనీయులు కూడా దేవీ నవరాత్రి వ్రతాలు జరపడం ద్వారానే వాళ్ళు తలపెట్టిన మహత్కార్యాలలో విజయం సాధించారని దేవీ భాగవతంలో కనిపిస్తుంది. నవరాత్రి పూజలతో దేవి అనుగ్రహం పొంది, దశమి నాడు ఆరంభించే కార్యాలలో, యత్నాలలో,



యుద్ధాలలో అఖండ విజయం తథ్యమని పురాణాలు బోధిస్తాయి. శ్రవణా నక్షత్రంతో కలిసి వచ్చే ఆశ్వయుజ శుద్ధ దశమి శుభప్రదం కనుక అది 'విజయ'దశమి. ఏ కార్యాన్ని ఆరంభించేందుకయినా అది మంచి రోజే!

దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన తరువాత, దేవతలు ఆమెను అపరాజితగా ఆరాధిస్తూ విజయోత్సవాలు జరుపుకొన్నది విజయదశమి నాడు. నారదుడి ఆధ్వర్యంలో నవరాత్ర వ్రతం పూర్తిచేసిన తరవాత రాముడు రావణుడిని వధించాడు. రావణ వధ నవమి నాడు జరిగిందన్న ప్రతీతి వల్ల, ఆ మరుసటి దినమైన దశమి నాడు, నాటినుంచి నేటిదాకా, శ్రీరామ జయాన్ని కీర్తిస్తూ రామ లీల ఉత్సవాలు చేసే ఆనవాయితీ వస్తున్నది. విరటుడి గోవులను కౌరవులు పట్టి తీసుకుపోతుండగా విజయుడు అడ్డుపడి, ఒంటిచేత్తో కురు వీరులందరినీ ఓడించి తరిమింది కూడా విజయదశమి నాడే!

మామూలు పండుగ సరదాలన్నిటితో పాటు, విజయదశమి నాడు ఈ నాటికీ పాటించే విశేష విధులు కొన్ని ఉన్నాయి. దేవిని 'అపరాజిత'గా పూజించడం ఒకటి. పవిత్రమైన శమీ వృక్షాలకు నమస్కరించి, ప్రదక్షిణం చేయడం మరొకటి. ఆ జమ్మి ఆకులు బంగారంగా భావించి తెచ్చి పంచుకోవడమూ, వాటిని పెద్దలకిచ్చి ఆశీస్సులు పొందడమూ ఇంకొకటి. పొలాలలోకి వెళ్ళి పాలపిట్టల మంగళప్రదమైన దర్శనం చేయడం మరొకటి.

అనువైన కాలం రాగానే, ముందు దేవీ అనుగ్రహం సమకూర్చుకొని, ఆ వెంటనే పురుషకారానికి శ్రీకారం చుట్టే వాళ్ళను విజయం వరించక మానదని విజయదశమి సందేశం. సకల జనుల సమస్త సత్సంకల్పాలను కరుణామయురాలైన కనకదుర్గమ్మ తల్లి సంపూర్ణంగా సిద్ధింప జేయాలని విజయదశమి సందర్భంగా శుభాకాంక్షలు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.నవమి ప.3.07 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** శ్రవణం ప.3.43 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.7.26 నుండి 8.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.07 నుండి 12.54 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** తె.4.23 నుండి 5.55 వరకు, మహానవమి, విజయ దశమి.; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.41.

క్లుప్తంగా...

పెన్షనర్లకు డీఆర్ విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు (పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు) డీయర్నెస్ రిలీఫ్ (డీఆర్)ను విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. పెన్షన్‌దారులు, కుటుంబ పెన్షన్‌దారులకు 01.07.2022 నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్

సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ కేడర్‌కు చెందిన లవ్ అగర్వాల్ ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. డిప్యుటేషన్ పూర్తయి కేంద్ర సర్వీసు నుంచి రాష్ట్ర కేడర్‌కు ఆయన తిరిగి రావడంతో ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. దీంతో ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను రెసిడెంట్ కమిషనర్ అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

మళ్లీ అధికారం బీఆర్ఎస్‌కే..!


- తమ సర్వేలో తేలిందన్న మిషన్ చాణక్య సంస్థ
- బీఆర్ఎస్‌కు 76, కాంగ్రెస్‌కు 25, బీజేపీకి 9 వరకు సీట్లు వస్తాయని అంచనా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ పూర్తిస్థాయి మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మిషన్ చాణక్య సంస్థ సర్వే పేర్కొంది. రైతులతోపాటు మహిళలు, మైనారిటీలు ఆ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ ఓట్లశాతం పెరిగినా సీట్లు పెద్దగా పెరగవని తేలిందని పేర్కొంది. ఈ మేరకు మిషన్ చాణక్య వ్యవస్థాపక చైర్మన్ అముక శివకేశవ్ ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. మిషన్ చాణక్యకు చెందిన 6,500 మంది ఉద్యోగులు రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల పరిధిలో సుమారు 14 లక్షల మంది నుంచి రహస్యంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించినట్టు తెలిపారు. తమ సర్వే ప్రకారం బీఆర్ఎస్ 44.62 శాతం ఓట్లతో సుమారు 76 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటుందని.. కాంగ్రెస్‌కు 32.71 శాతం ఓట్లతో 25 సీట్లకు అటూఇటూగా వస్తాయని పేర్కొన్నారు. ఇక బీజేపీ 17.6 శాతం ఓట్లతో 9 స్థానాల వరకు గెలుచుకుంటుందన్నారు.

గతం మర్చిపోతే ఎలా!?

ప్రజారోగ్యం మెరుగవుతుంటే ఎందుకంత కడుపుమంట రామోజీ?

సాక్షి, అమరావతి: ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు బుకాయించడంలో రామోజీ దిట్ట. అలా చేయకపోతే ఆయన కంటి మీద కునుకు పట్టదు. ఇలా బుకాయించడంలో ఆయన గిన్నీస్‌బుక్ రికార్డు కూడా ఇప్పటికే నెలకొల్పి ఉంటారు. ఎందుకంటే.. రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం ఆయన విషం కక్కడమే లక్ష్యంగా పెట్టుకున్నారు కాబట్టి. తాజాగా.. సీఎం జగన్ ప్రభుత్వంపై ఎప్పటిలాగే ఆయన మరో మారు తన కడుపుమంటను చాటుకున్నారు. గతంలో తన ఆత్మబంధువు చంద్రబాబు పాలన ఎంతో ఘనంగా ఉండేదని, ఇప్పుడే ఏమీ జరగడం లేదన్నట్లుగా 'మొహం చాటేసిన సీఎం' అంటూ ఈనాడులో ఆదివారం ఓ అబద్ధాల మాలికను అల్లారు. అప్పట్లో ప్రభుత్వాసుపత్రుల్లో అందే సేవలకూ, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో అందుతున్న సేవలకూ మధ్య తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుండడంతో దిక్కుతోచని స్థితిలోనే తాజా కథనం రాసినట్లు దానిని చదివిన వారికి ఇట్టే అర్థమవుతుంది.



విప్లవాత్మక మార్పులపై విషం..

నిజానికి.. సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తుండగా, అందులో ఐదు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరోవైపు.. పీహెచ్‌సీల నుంచి బోధనా సుపత్రుల వరకూ నాడు–నేడు కింద అభివృద్ధి పరచడంతోపాటు ఎక్కడా ఖాళీల్లేకుండా 53,126 సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖలో కొత్తగా నియమించారు. గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన విలేజ్ క్లినిక్ వ్యవస్థ, దేశంలోనే పలువురి ప్రశంసలు అందుకున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, కొత్త వైద్య కళాశాలలుం ఇలా ప్రజారోగ్య రంగంలో ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి విప్లవాత్మక మార్పు పైనా రాజగురువు వరుసగా తప్పుడు కథనాలు రాస్తున్నారు. తాజా కథనం కూడా ఈ కోవకు చెందినదే.

నిత్యం 2,204 వాహనాల పరుగులు..

గతంలో ఎన్నడూ లేనట్లుగా రాష్ట్రంలో '108' వాహనాలు 768 ఉన్నాయి. మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ) '104'లు 936, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కింద 500 వాహనాలు నిత్యం పరుగులు పెడుతున్నాయి. ఇలా మొత్తం 2,204 వాహనాల ద్వారా వేగవంతమైన, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదు. ఇది చూసి ప్రభుత్వానికి ప్రజల్లో ఎక్కడ మంచి పేరు వస్తుందోనని తొలి నుంచీ ఈ సేవలపై రామోజీ విషం కక్కుతూనే ఉన్నారు. ఆదివారం నాటి కథనంలోనూ ఆయన అలాగే తన అక్కసును వెళ్లగక్కారు.

నాడు దైన్యం.. నేడు ధైర్యం..

గత టీడీపీ ప్రభుత్వంలో 108, 104 సేవలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. అత్యవసర సమయంలో ఫోన్‌చేస్తే 108 అంబులెన్సు వస్తుందో రాదో తెలియని దుస్థితి. అయితే, అప్పట్లో సీఎం కుర్చీలో తమ బాబు ఉన్నాడు కాబట్టి రామోజీకి సహజంగా ఇవేమీ కనపడేవి కావు. టీడీపీ ప్రభుత్వంలో దైన్యంగా మారిన ఈ సేవలను సీఎం జగన్ పట్టాలెక్కించి ప్రజల్లో ధైర్యం నింపారు. మరోవైపు.. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేనాటికి 108 అంబులెన్సులు 531 ఉండగా వీటిలో 336 వాహనాలు అరకొరగా రోడ్లపై కనిపించేవి. అంటే.. అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని పరిస్థితి. ఈ నేపథ్యంలో.. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించిన సీఎం జగన్ 2020 జూలై 1న 412 కొత్త 108 అంబులెన్సులను ప్రారంభించారు. 26 నియోనాటల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందుకోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చుచేశారు. 2022 అక్టోబరులో అదనంగా మరో 20 అంబులెన్సులను (108 వాహనాలు) గిరిజన ప్రాంతాలకు కేటాయించారు. వీటి కోసం రూ.4.76 కోట్లు వెచ్చించారు. దీంతో 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. అంతేకాక.. ఈ ఏడాదే 2.5 లక్షల కిలో మీటర్లకుపైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో 146 కొత్త అంబులెన్సులను ప్రవేశపెట్టారు. వీటి కోసం రూ.34.79 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేసింది. ఈ లెక్కన 2020 నుంచి ఇప్పటివరకు కొత్త అంబులెన్సుల కొనుగోలుకు రూ.135.05 కోట్లు ఖర్చుచేసినట్లయింది.

'108'ల కోసం ఏటా రూ.188 కోట్ల ఖర్చు

ఇక ఈ అంబులెన్సు నిర్వహణ కోసం నెలకు రూ.14.39 కోట్లు చొప్పున ఏడాదికి రూ.172.68 కోట్లు కేవలం 108 అంబులెన్సుల నిర్వహణ కోసం కేటాయిస్తోంది. వీటికి తోడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు వెచ్చిస్తోంది. అంటే మొత్తంగా ఒక ఏడాదిలో 108 వాహనాలు కోసం చేస్తున్న ఖర్చు రూ.188.56 కోట్లు. ఇదంతా పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో భాగంగానే జరుగుతోంది. ఇంత చిత్తశుద్ధితో 108 సేవలు అమలుచేస్తుంటే రామోజీరావు బురద జల్లే రాతలు రాయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అర్బన్ ప్రాంతాల్లో నిర్దేశించుకున్న 15 నిమిషాలు, రూరల్ ప్రాంతాల్లో నిర్దేశించుకున్న 20 నిమిషాల్లోపే 108 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ఆపన్న హస్తం అందిస్తున్నాయి. ఇదీ 108 సేవల సమర్థతకు నిదర్శనం.

'తల్లీబిడ్డ' సేవల్లోనూ ఎంతో మార్పు

- గతంలో కేవలం 279 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వాటి సంఖ్య 500కు పెరిగింది.
- అప్పట్లో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరిట ఓమ్నీ వాహనాలను వినియోగించేవారు. ఒక్కో దానిలో ఇద్దరు గర్భిణులను తరలించేవారు. ఏసీ సదుపాయం కూడా లేదు.
- కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో విశాలమైన ఎకో మోడల్ ఏసీ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో దాంట్లో ఒకరిని మాత్రమే తరలిస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో ఒక ట్రిప్పునకు కేవలం రూ.499లు మాత్రమే ఖర్చుచేయగా.. ఈ ప్రభుత్వం రూ.895లు వెచ్చిస్తోంది.

సొంత ఊర్లలోనే '104' సేవలు..

ఇక సీఎం జగన్ ప్రభుత్వంలో 104 సర్వీసుల స్వరూపానికి పూర్తిగా మార్పులు చేశారు. జూలై 2020లో 656 ఎంఎంయూ (104)లను సీఎం జగన్ ప్రారంభించారు. ఇందుకు రూ.108 కోట్లు ఖర్చు చేశారు. రూ.4 కోట్లతో మరో 20 వాహనాలను గిరిజన ప్రాంతాల్లో సేవల కోసం కొనుగోలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలుచేయడానికి వీలుగా అదనంగా 260 (104) వాహనాలను ప్రవేశపెట్టారు. వీటికోసం రూ.58 కోట్లు వెచ్చించారు. ఈ మొత్తం 936 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా కోట్లాది మంది ప్రజలు తమ సొంత ఊర్లలోనే వైద్యసేవలు పొందారు.

ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నా..

108, 104 సిబ్బందికి ఒప్పందం ప్రకారం సర్వీస్ ప్రొవైడర్ నుంచి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిని కూడా రామోజీ తట్టుకోలేకపోతున్నారు. గత సంవత్సరం ఉద్యోగులకు నిర్దేశించిన బేసిక్ పే పై 8 శాతం ఇంక్రిమెంట్‌తో జీతాలు పెంచేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఈ ఏడాది కూడా ఇంక్రిమెంట్ ఇచ్చి, ఆ ఇంక్రిమెంట్ ఎరియర్స్‌ను చెల్లించేలా ఆదేశాలిచ్చారు. ఉద్యోగులకు ప్రతినెలా జీతాలను జమచేయడంలో ఎప్పుడన్నా జాప్యం జరిగినా వెంటనే వేతనాలు అందేలా చర్యలు ఉంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే సెప్టెంబరు వరకూ వేతనాలు పూర్తిగా చెల్లించారు. అయినా జీతాలు ఇవ్వలేదని ఈనాడు పెడబొబ్బలు పెడుతోంది. అలాగే, అక్టోబరు నెల వేతనం నవంబరులో ఇస్తారు. ఇవన్నీ ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా రామోజీ రోత రాతలు లేనిపోని సమస్యలను సృష్టించేందుకు తప్ప మరొకటి కాదు.

పత్తి రైతుకు 'ధర'హాసం

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయిస్తోంది.

12.85 లక్షల టన్నుల దిగుబడులు

రాష్ట్రంలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 14.13 లక్షల ఎకరాలు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 13.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా.. 12.85 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా. ఇటీవలే కనీస మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించింది. ఏటా క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు పెంచుతుండగా, తొలిసారి ఏకంగా రూ.640 మేర పెంచింది. పొడుగు పింజ రకానికి క్వింటాల్‌కు రూ.7,020, మీడియం రకానికి రూ.6,620 చొప్పున కనీస మద్దతు ధర నిర్ణయించింది. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌కు రోజుకు 3 నుంచి 5 వేల క్వింటాళ్ల పత్తి వస్తుండగా.. క్వింటాల్‌కు రూ.7 వేల నుంచి రూ.7,400 వరకు పలుకుతోంది.

అప్రమత్తమైన ప్రభుత్వం

కనీస మద్దతు ధరకు కాస్త అటూ ఇటుగా మార్కెట్ ధరలు ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసింది. 34 ఏఎంసీలతో పాటు 50 జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా క్వింటాల్‌కు రూ.13 వేల వరకు ధర లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

నిబంధనలు ఇవీ

తేమ 8 లేదా అంతకంటే తక్కువ శాతం ఉండాలి. 8 శాతం కంటే పెరిగిన ప్రతి ఒక్క శాతం తేమకు ఒక శాతం చొప్పున మద్దతు ధరలో రూ.70.20 చొప్పున తగ్గిస్తారు. 12 శాతానికి మించి తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయరు. పత్తి పింజ పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండవచ్చు. మైక్రో నైర్ విలువ నిర్ణీత పరిధి కంటే తక్కువ లేదా ఎక్కువ ఉంటే ప్రతి 0.2 విలువకు క్వింటాల్‌కు రూ.25 తగ్గిస్తారు. పత్తిలో దుమ్ము, ధూళి, చెత్తా, చెదారం లేకుండా చూసుకోవాలి. గుడ్డు పత్తికాయలు, రంగుమారిన, పురుగు పట్టిన కాయలను వేరు చేసి శుభ్రమైన పత్తిని మాత్రమే తీసుకురావాలి. నీళ్లు జల్లిన పత్తిని



ఆదోని మార్కెట్ యార్డ్ లో పత్తి నిల్వలు

కొనుగోలు చేయరు. కొడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలపరాదు. గోనె సంచుల్లో కానీ లేదా లూజు రూపంలో మాత్రమే తీసుకు రావాలి. ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొస్తే కొనుగోలుకు అనుమతించరు.

ఆర్బీకేల్లో నమోదుకు శ్రీకారం

ఈ–పంట నమోదు ఆధారంగా సీఎం యాప్ ద్వారా వాస్తవ సాగుదారుల నుంచి నేరుగా పత్తి కొనుగోలు చేయనున్నారు. రైతులు తమ సమీపంలోని ఆర్బీకే కేంద్రంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాల నకలుతో పేరు నమోదు చేసుకొని టోకెన్ తీసుకోవాలి. ఆ టోకెన్‌లో పేర్కొన్న తేదీన పత్తిని నిర్దేశించిన యార్డు లేదా జిన్నింగ్ మిల్లుకు తీసుకెళితే.. నిర్దేశిత గడువులోగా రైతు ఖాతాలకు నగదు జమ చేస్తారు.

తొందరపడి అమ్ముకోవద్దు

మార్కెట్‌లో ధరలు ఎమ్మెస్పీకి కాస్త అటూ ఇటుగా ఉండడంతో ముందుజాగ్రత్త చర్యగా ఈ నెల 25 నుంచి కొనుగోలు కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పంట నమోదు ప్రామాణికంగా ఆర్బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు కొనుగోలు చేస్తాం. ధరలు పెరిగే అవకాశం ఉన్నందున తొందరపడి రైతులెవరూ అమ్ముకోవద్దని చెబుతున్నాం. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మంచి ధరలు వచ్చే అవకాశాలున్నాయి.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

'గైస్'కు ఐఎస్‌వో గుర్తింపు

రాష్ట్రంలో ఐఎస్‌వో సర్టిఫికెట్ పొందిన పాలిటెక్నిక్ కాలేజీగా గుర్తింపు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): విశాఖలోని కంచరపాలెంలో ఉన్న గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ (గైస్) కాలేజీ మరో ఘనత సాధించింది. రాష్ట్రస్థాయిలో అత్యధిక ఉద్యోగాలు సాధించిన కాలేజీగా ఇటీవల అవార్డు పొందిన ఈ కళాశాల అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సౌకర్యాలు, విద్యా విధానాన్ని అమలు జరుపుతున్నట్లు ఐఎస్‌వో గుర్తించింది. దీనిపై గతంలో కాలేజీని ఐఎస్‌వో బృందం సందర్శించి విద్యా ప్రమాణాలు, ఉద్యోగాల సాధన, సిబ్బంది పనితీరు, మౌలిక సదుపాయాలను పరిశీలించింది. టీయూవీ ఎస్‌యూడీ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సర్టిఫికేషన్ బాడీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రపరిశీలన చేసి గైస్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఈ మేరకు 'గైస్'కు ఐఎస్‌వో 21001:2018 సర్టిఫికెట్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు ఆన్‌లైన్‌లో పంపించింది. 19 అక్టోబరు 2026 వరకు ఈ సర్టిఫికెట్ చెల్లుతుంది. రాష్ట్రంలోనే ఐఎస్‌వో సర్టిఫికెట్ పొందిన తొలి పాలిటెక్నిక్ కాలేజీగా 'గైస్' గుర్తింపు పొందింది.

ఔననదు.. కాదనదు!

- పోలవరం నావిగేషన్ కెనాల్ నిధులపై ఐడబ్ల్యూఏఐ మౌనం
- తొలుత సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకు 90% పనులు పూర్తి
- 2016లో భద్రాచలం–ధవళేశ్వరంను జాతీయ జల మార్గం–4గా ప్రకటించిన ఐడబ్ల్యూఏఐ
- క్లాస్–3 ప్రమాణాల మేరకు నావిగేషన్ కెనాల్ నిర్మించాలని నిర్దేశం.. ఇందుకు రూ.876 కోట్లు అవసరమన్న రాష్ట్ర అధికారులు
- ఈ వ్యయాన్ని ఐడబ్ల్యూఏఐ భరించాలని కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టీకరణ.. అయినా నిధుల మంజూరుపై స్పందించని ఐడబ్ల్యూఏఐ



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నావిగేషన్ కెనాల్‌ను జాతీయ జలమార్గం క్లాస్–3 ప్రమాణాల మేరకు నిర్మించాలని సూచించిన ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ).. ఆ పనులకయ్యే నిధులపై మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికే పోలవరం స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి.. వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌పై దృష్టి పెట్టింది. జలాశయం పూర్తయితే నావిగేషన్ కెనాల్, టన్నెల్ నిర్మాణం చేపట్టడం అతి పెద్ద సవాల్‌గా మారుతుంది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కేంద్ర నౌకాయాన శాఖ, ఐడబ్ల్యూఏఐ దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఆ రెండు సంస్థలు మాత్రం నిధుల మంజూరుపై స్పష్టత ఇవ్వట్లేదు.

90 శాతం పనులు పూర్తి..

వాస్తవానికి పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను 2004–05లోనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్ మేరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిపై ఎగువకు, దిగువకు నౌకయానానికి వీలుగా 36.6 మీటర్ల వెడల్పు.. 9.6 మీటర్ల పూర్తి ప్రవాహ లోతు(ఎఫ్ఎస్‌డీ)తో 1.423 కి.మీ.ల పొడవుతో అప్రోచ్ ఛానల్.. దానికి కొనసాగింపుగా 40 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తు గేటుతో మూడు నావిగేషన్ లాక్‌లు, 12 మీటర్ల వెడల్పు, 3.81 మీటర్ల ఎఫ్ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 12 మీటర్ల వెడల్పు, 3.66 మీటర్ల ఎఫ్ఎస్‌డీ, 2.34 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టింది. ఇందులో 2014 నాటికే నావిగేషన్ లాక్‌ల పనులను దాదాపుగా పూర్తిచేసింది. నావిగేషన్ టన్నెల్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. అలాగే.. 2013–14 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన వ్యయం మేరకు నావిగేషన్ కెనాల్ పనుల అంచనా వ్యయం రూ.261.62 కోట్లు. ఇందులో రూ.137.93 కోట్ల విలువైన పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది.

జాతీయ జల మార్గంలో స్థానం..

ధవళేశ్వరం–భద్రచాలం స్ట్రెచ్(అఖండ గోదావరి)ను జాతీయ జలమార్గం–4లో అంతర్భాగంగా 2016లో ఐడబ్ల్యూఏఐ ప్రకటించింది. ఈ జల మార్గాన్ని క్లాస్–3 ప్రమాణాలతో చేపట్టాలని నిర్ణయించింది. క్లాస్–3 ప్రమాణాలతో పోలవరం నావిగేషన్ కెనాల్‌ను నిర్మించాలంటే.. 1.423 కి.మీ.ల పొడవున అప్రోచ్ ఛానల్‌ను 40 మీటర్ల వెడల్పు, 2.20 ఎఫ్ఎస్‌డీతోనూ.. దానికి కొనసాగింపుగా 70 మీటర్ల వెడల్పు, 15 మీటర్ల ఎత్తు గేటుతో 3 నావిగేషన్ లాక్‌లు, 40 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 20 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్ఎస్‌డీ, 7 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టాలి. ఈ పనులకు రూ.876.38 కోట్ల వ్యయమవుతుంది.

ఉలుకూపలుకు లేని ఐడబ్ల్యూఏఐ..

నిధులిస్తే పనులు చేపడతామని ఐడబ్ల్యూఏఐకి అనేకసార్లు రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ప్రతిపాదించారు. ఈ వ్యయాన్ని ఐడబ్ల్యూఏఐ భరించాలని సీడబ్ల్యూసీ, కేంద్ర జల్ శక్తి శాఖలు కూడా స్పష్టం చేశాయి. ఐడబ్ల్యూఏఐ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర నౌకాయాన శాఖ, సీడబ్ల్యూసీ, రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి సమావేశాలు నిర్వహించి.. నిధులు మంజూరు చేయాలని ఐడబ్ల్యూఏఐకి తేల్చిచెప్పారు. అయినా కూడా ప్రతి సమావేశంలోనూ జాతీయ ప్రమాణాల మేరకు పోలవరం నావిగేషన్ కెనాల్ పనులు చేయాలని ఐడబ్ల్యూఏఐ ఉన్నతాధికారులు నిర్దేశిస్తారేగానీ.. నిధులిచ్చే అంశాన్ని మాత్రం ఎటూ తేల్చడం లేదు.

రైతులే కీలకం



అన్నదాతల కోసం ఎన్నో పథకాలు తెచ్చాం

అసెంబ్లీ ఎన్నికల్లో 75పైగా సీట్లు ఖాయం

పీటీఐ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో రైతులదే నిర్ణాయక పాత్ర అని సీఎం భూపేశ్ బఘేల్ చెప్పారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకువచ్చిందని, వారి మద్దతుతో అసెంబ్లీలోని 90 సీట్లకుగాను 75కు పైగా స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం బఘేల్ తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. 'మేం ప్రవేశపెట్టిన పథకాలతో రైతులు, యువ లబ్ధిదారులు ఆర్థికంగా బలపడ్డారు. రైతులకు, తునికాకు సేకరణదారులకు ఇచ్చిన హామీలను గత అయిదేళ్లలో అమలు చేశాం. విద్య, ఆరోగ్యం, మౌలిక రంగాల కోసం ఎంతో ఖర్చు చేశాం. ప్రజల జీవితాల్లో ముఖ్యంగా ఆర్థికపరంగా ఎంతగానో మార్పు వచ్చింది'అని సీఎం బఘేల్ చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మద్య నిషేధం హామీలుకు ఎంతగానో ప్రయత్నించామన్నారు. అయితే, కొందరు కల్తీ మద్యం వాడకం మొదలుపెట్టి మృత్యువాత పడటంతో నిషేధం యోచనను విరమించుకున్నట్లు వివరించారు. '15 ఏళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్యంపై నిషేధం మాటే ఎత్తలేదు. దేశవ్యాప్తంగా మద్య నిషేధం అమలు చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేస్తున్నా'అని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. 'గిరిజనులకు ఎంతో కీలకమైన జల్, జంగల్, జమీన్ హక్కుల సమస్యను పరిష్కరించాం. ఒకప్పుడు రణరంగాన్ని తలపించిన బస్తర్‌లో నేడు ప్రశాంతత నెలకొంది. ఇవన్నీ మాకు ఎన్నికల్లో కలిసొచ్చే అంశాలే'అని ఆయన తెలిపారు. 'రైతుల నుంచి ఎకరానికి 20 క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా కేంద్రం మాకు సాయం చేయడం లేదు. అందుకే మేం సొంతంగా గృహ నిర్మాణ పథకం ప్రారంభించాం. కుల గణన చేపడతామని మా నేత ప్రియాంకా గాంధీ ప్రకటించారు. ప్రధానంగా వీటిని మేం ప్రకటించినా ప్రతిపక్ష బీజేపీ మాత్రం వీటిపై మౌనంగా ఉంది. పైపెచ్చు మాపై విమర్శలు మాత్రం చేస్తోంది'అని ఆయన అన్నారు.

- ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7, 17వ తేదీల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

పంచతంత్రం

రాజస్తాన్‌లో 43 మందితో కాంగ్రెస్ మరో జాబితా

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఆదివారం 43 మంది అభ్యర్థుల పేర్లతో మరో జాబితా విడుదల చేసింది. మాజీ చీఫ్ సెక్రటరీ నిరంజన్ ఆర్యకు ఎస్సీ రిజర్వుడు స్థానం సోజత్‌ను కేటాయించింది. మంత్రులు రాజేంద్ర సింగ్ యాదవ్‌ను కొట్‌పుత్లి నుంచి, ప్రతాప్ సింగ్‌ను సివిల్ లేన్స్, శకుంతలా రావత్‌ను బన్సూర్ నుంచి బరిలోకి దించనుంది.

ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ తుది జాబితా విడుదల

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఏడుగురు అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో అంబికా దేవ్‌కు బైకుంత్ సీటును, చతురి నంద్‌కు సరాయ్‌పాలి, రశ్మీ చంద్రశేఖర్‌కు మహాసముంద్‌ను, సందీప్ సాహుకు కస్డోల్‌ను, కుల్దీప్ జునేజాకు రాయ్‌పూర్ సిటీ నార్త్, అంబికా మార్కమ్‌కు సిహావా సీట్లను కేటాయించింది.

ప్రొద్దుటూరులో 300 కిలోల బంగారం సీజ్

- పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు
- రెండు వాహనాల్లో బంగారం, డాక్యుమెంట్ల తరలింపు
- నాలుగు రోజులపాటు నాలుగు బంగారు దుకాణాల్లో తనిఖీలు



బంగారు దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తరలిస్తున్న ఐటీశాఖ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఐటీ అధికారులు సోదాలు జరిపి సుమారు 300 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. బంగారు నగలతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని రెండు వాహనాల్లో తిరుపతికి తరలించారు. ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19 నుంచి ఆదాయపన్నుశాఖ అధికారులు జరిపిన తనిఖీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అధికారులు బంగారం దుకాణాలతో పాటు యజమానులు, వారి బంధువుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఒక దుకాణంలో సుమారు 200 కిలోలు, మరో రెండు దుకాణాల్లో 100 కిలోల వరకు లెక్కలు చూపని బంగారం లభించడంతో దాన్ని సీజ్ చేశారు. కాగా ఐటీ అధికారులు ఈ వివరాలను అధికారికంగా ధ్రువీకరించలేదు.

పండుగ సమయంలో స్తంభించిన వ్యాపారం

కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వకుండా బంగారు నగలు విక్రయించడంతో పాటు అక్రమంగా బంగారం దిగుమతి చేసుకుంటున్నారని ఫిర్యాదులు వెల్లటంతో ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19న సుమారు 40 మంది ఇన్‌కం ట్యాక్స్ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్దమొత్తంలో లెక్కలు లేని బంగారం లభించడంతో పట్టణంలోని బంగారం దుకాణాల్లో జీరో వ్యాపారం జరుగుతోందన్న విషయం బయటపడిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలా సుదీర్ఘంగా సోదాలు జరగలేదని వ్యాపారులు పేర్కొన్నారు. వేలాది బంగారం దుకాణాలున్న ప్రొద్దుటూరులో ఐటీ అధికారుల దాడుల నేపథ్యంలో ఒక్కసారిగా వ్యాపారాలు స్తంభించిపోయాయి. తనిఖీలు తమవరకు ఎక్కడ వస్తాయో అనే భయంతో వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. పండుగ నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు దుకాణాలు మూసివేయడంతో నిరాశ చెందారు.

ఎన్‌డీఏను ఓడించేది పీడీఏనే

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ • ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పేరెత్తకుండా వ్యాఖ్యలు • కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో తాజా పరిణామం



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తమకు ఒక్క సీటూ కేటాయించకపోవడంపై గుర్రుగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తాజాగా 'పీడీఏ'బాంబు పేల్చారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో ఇందుకు సంబంధించి చేసిన పలు వ్యాఖ్యలు ఇండియా కూటమి ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏను పీడీఏ ఓడిస్తుంది. ఆ ఎన్నికల్లో పీడీఏ విప్లవం తెస్తుంది' అని అందులో పేర్కొన్నారు. పీడీఏ అంటే పిఛ్డే(వెనుకబడిన కులాలు), దళితులు, మైనారిటీలని వివరించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ప్రతిపక్షాలతో ఏర్పాటైన 'ఇండియా'కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ కీలక భాగస్వామి. నవంబర్ 17న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు గాను 18 నియోజకవర్గాల్లో ఎస్పీ అభ్యర్థులను నిలిపింది. తమకు ఆ సీట్లను కేటాయించాలంటూ కాంగ్రెస్ పార్టీని కోరింది. కాంగ్రెస్ ఎస్పీ వినతిని పట్టించుకోలేదు. ఆయా స్థానాలకు సైతం అభ్యర్థులను ప్రకటించింది. ఈ పరిణామం రుచించని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఎదురు దాడికి దిగారు. 'కాంగ్రెస్ ఇతర పార్టీలను ఫూల్ చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో పొత్తులు పని చేయవని తెలిసుంటే, ఇండియా కూటమిలో చేరి ఉండేవాళ్లం కాదు. కాంగ్రెస్‌తో మాట్లాడేవాళ్లమే కాదు'అని గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ తీరు ఇలాగే కొనసాగితే, ఆ పార్టీతో కలిసుండే దెవరని ప్రశ్నించారు. తమతో పొత్తు కొనసాగిస్తారా లేదా కాంగ్రెస్ తేల్చాలని పట్టుబట్టారు. ఇండియా కూటమి లోకసభ ఎన్నికలే లక్ష్యంగా కేంద్ర స్థాయిలో ఏర్పాటైందంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. మూడు రోజులుగా వారి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్న వేళ..ఆదివారం తాజాగా అఖిలేశ్ 'పీడీఏ'అస్త్రం బయటకు తీశారు. 2024 ఎన్నికల్లో పీడీఏ విప్లవం సృష్టించనుందని పేర్కొన్నారు. అందులో ఇండియా కూటమి గురించి అందులో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

'మాపై కుట్రలు, ద్రోహం చేయవద్దు. సమాజ్‌వాదీలు అవసరం లేదని వారు మాకు సూటిగా చెప్పాలి. పొత్తుపై ఒక్కసారి కూడా మాట్లాడబోమని, బీజేపీని ఓడించడానికి సొంతంగా మా ప్రయత్నాల్లో ఉంటామని'అన్నారు. గతంలో కుల గణన అంటే మండిపడిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దానిని కోరుకోవడం విడ్డూరంగా ఉందని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. గతంలో చేపట్టిన కులగణన వివరాలను ఆ పార్టీ వెల్లడించనేలేదు. బీసీల మద్దతు లేకుండా గెలుపు సాధ్యం కాదని ఇప్పుడు అందరూ గ్రహించారు. బీసీలు తమతో లేరని కాంగ్రెస్ తెలుసుకుంది కాబట్టే, ఇప్పుడు కులగణన హామీలిస్తోందని వివరించారు.

క్లుప్తంగా...

గగన్‌యాన్‌లో మహిళా పైలట్లకు ప్రాధాన్యం

ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడి

తిరువనంతపురం: గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా చేపట్టే మానవసహిత అంతరిక్ష కార్యక్రమంలో మహిళా పైలట్లు, మహిళా శాస్త్రవేత్తలకే ఇస్రో ప్రాధాన్యం ఇస్తుందని, భవిష్యత్తులో మహిళా వ్యోమగాములనే అంతరిక్షంలోకి పంపుతామని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. వచ్చే ఏడాది ప్రయోగించే మానవ రహిత గగన్‌యాన్ అంతరిక్ష నౌకలో మనిషిని పోలిన మహిళా హ్యూమనాయిడ్‌ను ఇస్రో పంపుతుందని తెలిపారు. 2025 నాటికి మానవ సహిత మిషన్‌ను భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని దిగువ కక్ష్యలోకి పంపుతామని, అది మూడు రోజుల తర్వాత సురక్షితంగా భూమికి తిరిగి చేరుకుంటుందని వివరించారు. ప్రస్తుతానికి మహిళా ఫైటర్ టెస్ట్ పైలట్లు దొరకనందున ఎయిర్ ఫోర్స్ ఫైటర్ టెస్ట్ పైలట్లనే అంతరిక్ష యాత్రకు ఎంపిక చేస్తున్నాం. మహిళా పైలట్లు అందుబాటులోకి వస్తే వారినే ఎంపిక చేసుకుంటాం. ఆ తర్వాత మహిళా సైంటిస్టుల వంతు. అప్పుడిక మహిళలకు ఎక్కువ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి' అని సోమనాథ్ చెప్పారు. 2035 నాటికి పూర్తి స్థాయిలో అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. శనివారం గగన్‌యాన్ యాత్రలో సన్నాహక పరీక్షల్లో భాగమైన క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.

ఫిలిప్పీన్స్ నౌకలను ఢీకొట్టిన చైనా కోస్ట్‌గార్డ్ షిప్

మనీలా: దక్షిణ చైనా సముద్రంలోని వివాదాస్పద ప్రాంతంలో ఆదివారం ఫిలిప్పీన్స్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తమ కోస్ట్ గార్డ్ నౌక, మిలటరీ రవాణా బోటులను చైనా కోస్ట్‌గార్డ్ షిప్, దానితోపాటే వచ్చిన చైనా నౌక ఢీకొట్టాయని ఫిలిప్పీన్స్ అధికారులు తెలిపారు. ఘటనలో తమ సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని, నౌకలకు వాటిల్లిన నష్టంపై అంచనా వేస్తున్నామన్నారు. తమ నౌకలు వేగంగా ప్రయాణించకపోయుంటే చైనా నౌకల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లేదని చెప్పారు. థామస్ షోల్ వద్ద ఉన్న ఫిలిప్పీన్స్ మెరైన్ పోస్టుకు సమీపంలో ఈ నెలలో చోటుచేసుకున్న రెండో ఘటన ఇది అని చెప్పారు. ఫిలిప్పీన్స్ అంతర్జాతీయ నిబంధలను ఉల్లంఘిస్తూ తమ నౌకల ప్రమాదాలకు కారణమవుతోందని చైనా ఆరోపించింది.

ఇరాన్‌లో మహిళా జర్నలిస్టులకు ఏడేళ్ల జైలు

దుబాయ్: ఇద్దరు మహిళా జర్నలిస్టులకు ఇరాన్ ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గతేడాది ఇరానీ మహిళ మహసా అమినీ కస్టడీ మరణం పెను సంచలనం సృష్టించడం, దాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగడం తెలిసిందే. ఆ కస్టడీ మరణంపై రిపోర్టింగ్ చేసినందుకు సదరు మహిళా జర్నలిస్టులు ఆలాహే మొహమ్మది (36), నిలోఫర్ హమెదీ (31)లను దోషులుగా న్యాయ శాఖ నిర్ధారించింది. అలాహేకు ఆరు సంవత్సరాలు, హమెదీకి ఏడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. వారిద్దరూ 2022 సెప్టెంబర్ నుంచీ టెహ్రాన్‌లోని ఎవిన్ జైలులో మగ్గిపోతున్నారు. గత మే నెలలో వారిపై విచారణ మొదలైంది. తాజా తీర్పుపై వారు అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించామని న్యాయ శాఖ పేర్కొంది.

దుర్గా మండపంలో అమెరికా రాయబారి గార్సెట్టి డ్యాన్స్



న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ఆదివారం హల్‌చల్ చేశారు. ఢిల్లీలోని సీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన దుర్గా మండపానికి వెళ్లిన ఆయన..సంప్రదాయ ధునుచి డ్యాన్స్ చేసి, అందరినీ వినోద పరిచారు. ఇందుకు సంబంధించిన వీడియోను గార్సెట్టి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బెంగాలీ స్ట్రీట్ ఫుడ్ ఝుల్మురితోపాటు కొన్ని రకాల బెంగాలీ స్వీట్లను రుచి చూసిన ఆయన 'ధునుచి నాచ్'లో పాల్గొన్నారు. ఉత్సవంలో పాలుపంచుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందంటూ అందులో పేర్కొన్నారు. దుర్గా మాత మండపాల్లో సాధారణంగా చేసే నాట్యాన్ని ధునుచి నాచ్ అని పిలుస్తుంటారు. దేవతకు హారతి ఇచ్చేందుకు వాడే మట్టి పాత్రనే ధునుచి అంటారు.

ఢిల్లీకి 'గాలాడటం' లేదు

'వెరీ పూర్' స్థాయికి వాయు నాణ్యత

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు నాణ్యత ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆదివారం 'వెరీ పూర్' స్థాయికి పడిపోయింది. శనివారం 248గా ఉన్న సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 24 గంటల వ్యవధిలో 313కు పడిపోయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. దాంతో ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్‌రాయ్ సోమవారం సంబంధిత శాఖలతో సమీక్ష జరపనున్నారు. ప్రైవేటు వాహనాల రాకపోకలను వీలైనంతగా తగ్గించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పార్కింగ్ ఫీజులు పెంచడం వంటి చర్యలు చేపట్టింది. హోటళ్లలో తందూరీ పొయ్యిలపై నిషేధం విధించింది. సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని, మెట్రో రైలు సర్వీసుల సంఖ్యను పెంచాలని కోరింది. ఢిల్లీకి 300 కిలోమీటర్ల పరిధిలోపల ఉన్న కాలుష్య కారక పారిశ్రామిక యూనిట్లు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణాలు జరుగుతున్న, కూల్చివేత ప్రాజెక్టులు చేపట్టిన చోట్ల దుమ్ము రేగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

హమాస్‌పై ముప్పేట దాడి

గాజా, సిరియా, వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్ల స్థావరాలపై క్షిపణుల వర్షం

- ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలు మరింత ఉధృతం
- గాజాపై భూతల దాడులకు ఇజ్రాయెల్ ఏర్పాట్లు
- సానుకూల పరిస్థితులు ఏర్పడగానే గాజాలోకి ప్రవేశిస్తామన్న సైన్యం

రఫా(గాజాస్ట్రిప్)/జెరూసలేం/న్యూఢిల్లీ/టెల్ అవీవ్: పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య ఘర్షణలు మరింత ఉధృతం అవుతున్నాయి. ఇజ్రాయెల్ భీకర యుద్ధం ప్రారంభించింది. ఇప్పటిదాకా గాజాలో వైమానిక దాడులు నిర్వహించగా, ఇక సిరియా, వెస్ట్‌బ్యాంక్‌లోని హమాస్ స్థావరాలపైనా దృష్టి పెట్టింది. గాజాతోపాటు సిరియాలో రెండు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు, వెస్ట్‌బ్యాంక్‌లో ఒక మసీదుపై క్షిపణులు ప్రయోగించింది. శనివారం రాత్రి మొదలైన ఈ దాడుల ఆదివారం కూడా కొనసాగాయి. మూడు ప్రాంతాల్లోని టార్గెట్లపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు నిప్పుల వర్షం కురిపించాయి. సిరియాలోని ఎయిర్‌పోర్టులు, వెస్ట్‌బ్యాంక్ మసీదును హమాస్ మిలిటెంట్లు అడ్డాగా మార్చుకున్నారని, అక్కడి నుంచే తమపై దాడులకు సన్నాహాలు చేస్తున్నారని, అందుకే ముందుగానే ఎదురుదాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సిరియా ఎయిర్‌పోర్టులపై జరిగిన దాడిలో ఒకరు మరణించారు. రన్‌వేలు దెబ్బతిన్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లో కనీసం ఐదుగురు మరణించారు. మరోవైపు లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ ఇజ్రాయెల్ భూభాగంపై రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. ఇజ్రాయెల్ దళాలు సైతం ప్రతిదాడి చేస్తున్నాయి. దీంతో ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

సైన్యం సన్నద్ధతపై నెతన్యాహూ సమీక్ష

ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలై రెండు వారాలు దాటింది. ఇప్పటివరకు గాజాలో 4,385 మంది జనం మృత్యువాతపడ్డారు. ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా మరణించారు. గాజాపై భూతల దాడులకు ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ శనివారం రాత్రి మంత్రివర్గ సహచరులతో సమావేశమయ్యారు. ఉత్తర గాజాపై భూతల దాడుల విషయంలో సైన్యం సన్నద్ధతపై ఈ భేటీలో సమీక్ష సమాచారం. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లో వేలాదిగా ఇజ్రాయెల్ సైనికులు మోహరించారు. ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి ఇప్పటికే 7 లక్షల మంది జనం దక్షిణ గాజాకు వెళ్లిపోయినట్లు అంచనా.

అనూహ్య స్థాయిలో 'తదుపరి దాడి'

గాజాపై జరుగుతున్న వైమానిక దాడులు 'యుద్ధంలో తదుపరి దశ'కు రంగం సిద్ధం చేయడానికేనని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ చెప్పారు. తదుపరి దాడి అనూహ్య స్థాయిలో ఉంటుందని అన్నారు. తమ పదాతి దళాలు గాజా భూభాగంలోకి అడుగుపెట్టడానికి వీలుగా సానుకూల పరిస్థితులు సృష్టించడానికి వైమానిక దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సానుకూల పరిస్థితులు ఉన్నప్పుడే తదుపరి దశ యుద్ధంలోకి ప్రవేశించాల్సి ఉంటుందని అన్నారు. హమాస్‌ను అంతం చేయడానికి గాజాలో అడుగుపెడతామని ఇజ్రాయెల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ హెర్జీ హలేవీ చెప్పారు. మిలిటెంట్ల సన్నద్ధతను తక్కువ అంచనా వేయొద్దని తమ సైన్యానికి సూచించారు. ఆయన తాజాగా ఇజ్రాయెల్ సైనికాధికారులతో సమావేశయ్యారు. గాజాలో ప్రవేశించిన తర్వాత ఊహించని పరిణామాలకు సైతం సిద్ధంగా ఉండాలని అన్నారు. కిక్కిరిసిన జనాభాతో గాజా స్ట్రిప్ చాలా సంక్లిష్టంగా ఉంటుందని తెలిపారు. శత్రువులు మన కోసం అక్కడ ఎన్నో యుద్ధ రీతులను సిద్ధం చేసి పెట్టారని, మన ప్రతిస్పందన అత్యంత చురుగ్గా, వేగంగా ఉండాలని సూచించారు.

ఇజ్రాయెల్ తాజా హెచ్చరిక

గాజా ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం మరోసారి అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర గాజా నుంచి దక్షిణం గాజాకు వెంటనే వెళ్లిపోవాలని ఆదేశించింది. అలా వెళ్లనివారిని హమాస్ మిలిటెంట్ల సానుభూతిపరులుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) పేరు, లోగోతో ఉన్న కరపత్రాలను గాజా సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే మొబైల్ ఫోన్ ఆడియో సందేశాలను కూడా గాజా స్ట్రిప్‌లోని ప్రజలకు చేరవేశారు. ''ఉత్తర గాజాలో మీకు ముప్పు పొంచి ఉంది. దక్షిణ గాజాకు వెళ్లకుండా ఉత్తర గాజాలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నవారిని హమాస్ సానుభూతిపరులుగా పరిగణిస్తాం'' అని అందులో పేర్కొన్నారు.

పాలస్తీనియన్లకు భారత్ ఆపన్న హస్తం

గాజాలోని పాలస్తీనియన్లకు భారత్ ఆపన్న హస్తం అందిస్తోంది. 6.5 టన్నుల ఔషధాలు, 32 టన్నుల విపత్తు సహాయక సామగ్రిని పంపించింది. ఔషధాలు, సామగ్రితో భారత వైమానిక దళానికి చెందిన సి–17 రవాణా విమానం ఆదివారం భారత్ నుంచి నుంచి బయలుదేరింది. ఇది ఈజిప్టులోని ఎల్–అరిష్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనుంది. మానవతా సాయాన్ని అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో గాజాకు చేరవేయనున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అత్యవసర ప్రాణ రక్షక ఔషధాలు, సర్జికల్ సామగ్రి, టెంట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, శానిటరీ వస్తువులు, నీటి శుద్ధి మాత్రలు తదితర సామగ్రిని గాజాకు పంపించినట్లు తెలియజేశారు. పాలస్తీనియన్లకు మరింత సాయం పంపిస్తామని వెల్లడించారు. గాజాలో సామన్య ప్రజల మరణం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొమమ్మద్‌కు అబ్బాస్‌కు ఫోన్ చేసి, సంతాపం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈజిప్టు నుంచి గాజాకు రెండో షిప్‌మెంట్

ఇజ్రాయెల్ సైన్యం దాడులతో అల్లాడిపోతున్న గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం ఇప్పుడిప్పుడే చేరుతోంది. నిత్యావసరాలు, ఇతర సహాయక సామగ్రితో కూడిన 17 వాహనాలు ఆదివారం ఈజిప్టు నుంచి గాజాలో అడుగుపెట్టాయి. గత రెండు రోజుల వ్యవధిలో ఇది రెండో షిప్‌మెంట్. శనివారం 20 వాహనాలు ఈజిప్టు నుంచి గాజాకు చేరుకున్నాయి.









గాజాలో గాయపడిన చిన్నారులను ఆస్పత్రులకు తరలిస్తున్న దృశ్యాలు



ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన శిశువుకు యూనిస్ ఖాన్‌లోని ఆస్పత్రిలో వైద్యుల చికిత్స

చిన్నారులే సమిధలు

గాజాలో ప్రతి 15 నిమిషాలకు ఒకరి మృతి | ఇప్పటికే 1,000కిపైగా బాలల మరణాలు

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో గాజాలో పెద్దసంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గాజాలోని 23 లక్షల జనాభాలో దాదాపు సగం మంది 18 ఏళ్లలోపువారే ఉన్నారు. ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో గాజాలో ప్రతి 15 నిమిషాలకు ఒక చిన్నారి బలైపోతున్నట్లు పాలస్తీనియన్ స్వచ్ఛంద సంస్థ ఒకటి వెల్లడించింది. నిత్యం 100 మందికిపైగా చనిపోతున్నారని తెలియజేసింది. ఈ నెల 7న ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలైంది. ఇప్పటిదాకా గాజాలో 3,400 మందికిపైగా జనం మరణించారు. వీరిలో 1,000 మందికిపైగా బాలలు ఉన్నట్లు అంచనా. అంటే ప్రతి ముగ్గురు మృతుల్లో ఒకరు చిన్నపిల్లలే కావడం గమనార్హం. గాజాలో అచ్చంగా నరమేధమే సాగుతోందని డిఫెన్స్ ఫర్ చిల్డ్రన్ ఇంటర్నేషనల్–పాలస్తీనా(డీసీఐపీ) అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. గాజాతో పోలిస్తే ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టం తక్కువ. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో ఇప్పటివరకు 1,400 మంది మృతిచెందగా, వీరిలో 14 మంది బాలలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

- గాజాను ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించింది. ఆహారం, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెబుతున్నా అవి చాలామందికి అందడం లేదు.
- తగినంత ఆహారం, నీరు లేక గాజాలో పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుధ్య వసతులు లేకపోవడంతో డయేరియా వంటి వ్యాధులు ప్రబులుతున్నాయని పేర్కొంటున్నారు.
- యుద్ధం కారణంగా పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక అధికారులు చెప్పారు. అకారణంగా భయపడడం, రోదించడం వంటివి చేస్తున్నారని తెలియజేశారు.
- రణక్షేత్రంలో దాడులు, ప్రతిదాడులు చూస్తూ పెరిగిన పిల్లల్లో హింసాత్మక ధోరణి పెరుగుతుందని, భవిష్యత్తులో వారు అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉందని మానసిక శాస్త్ర నిపుణులు అంటున్నారు.
- యుద్ధాల సమయంలో బాలలకు హక్కులుంటాయి. వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఇరుపక్షాలకూ ఉంటుంది.
- చిన్నారుల ప్రాణాలను రక్షించాలంటూ 1949లో జెనీవాలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని 1951లో ఇజ్రాయెల్ ఆమోదించింది.

గాజాలో జరిగిన యుద్ధాల్లో మృత్యుఘోష

యుద్ధం	మృతి చెందిన మైనర్లు
2008-09	341
2012	35
2014	532
2021	66
2023	ఇప్పటికే 1,000కిపైగా

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్–హమాస్ ముఖాముఖి పోరు

ఇజ్రాయెల్ బుల్డోజర్లు, యుద్ధట్యాంకును ధ్వంసం చేశామన్న హమాస్

గాజా: ఇన్నాళ్లూ పరస్పరం వైమానిక దాడులకు, రాకెట్ దాడులకే పరిమితమైన ఇజ్రాయెల్ సైనికులు, హమస్ మిలిటెంట్లు తొలిసారిగా ప్రత్యక్షంగా తలపడ్డారు. గాజా భూభాగంలో ఇరుపక్షాల మధ్య ముఖాముఖి పోరు సాగిందని హమాస్ సైనిక విభాగం అల్–ఖసమ్ బ్రిగేడ్స్ ఆదివారం వెల్లడించింది. ఈ నెల 7న యుద్ధం మొదలైన తర్వాత భూభాగంపైన ఇజ్రాయెల్, హమాస్ మధ్య ప్రత్యక్షంగా ఘర్షణ జరగడం ఇదే మొదటిసారి. తమ భూభాగంలోకి దూసుకొచ్చిన ఇజ్రాయెల్ మిలటరీకి చెందిన రెండు బుల్డోజర్లను, ఒక యుద్ధ ట్యాంక్‌ను ధ్వంసం చేశామని హమాస్ మిలిటెంట్లు ప్రకటించారు. తమ ఎదురు దాడిని తట్టుకోలేక ఇజ్రాయెల్ సైన్యం వాహనాలు వదిలేసి కాలినడకన వారి సరిహద్దు వైపు పలాయనం చిత్తగించిందని స్పష్టం చేసింది. ఈ మేరకు అల్–ఖసమ్ బ్రిగేడ్స్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఖాన్ యూనిస్ సిటీలో ఇజ్రాయెల్ సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొన్నామని తెలియజేసింది. అల్–ఖసమ్ బ్రిగేడ్స్ ప్రకటనపై ఇజ్రాయెల్ సైన్యం ప్రతిస్పందించింది. దక్షిణ గాజాలో సెక్యూరిటీ ఫెన్స్ వద్ద విధి నిర్వహణలో ఉన్న తమ బలగాలపై స్వల్పంగా కాల్పులు జరిగాయని స్పష్టంచేసింది. కాల్పులు జరిపిన మిలిటెంట్లపై తమ యుద్ధ ట్యాంకు నుంచి ప్రతిదాడి చేశామని పేర్కొంది. దాంతో వారంతా చెల్లాచెదురు అయ్యారని వెల్లడించింది. గాజా భూభాగంలో తమ సేనలు మకాం వేసిన మాట వాస్తవమేనని ఇజ్రాయెల్ మరోసారి అంగీకరించింది. ఈ నెల 13న కూడా ఇదే మాట చెప్పింది. కానీ, హమాస్‌తో ముఖాముఖి ఘర్షణ జరిగినట్లు వెల్లడించడం మాత్రం ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హమాస్ ప్రముఖ నేత ముహమ్మద్ కటామాష్ హతమయ్యాడు.

ఎల్‌ఏసీ వెంట చైనా మోహరింపులు

- 2022లో భారీగా నిర్మాణాలు
- విమానాశ్రయం, హెలిపాడ్లు
- అమెరికా రక్షణ శాఖ నివేదికలో వెల్లడి

వాషింగ్టన్: అది 2022 సంవత్సరం. చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ. ఆ సమయంలో చైనా చడీచప్పుడూ లేకుండా వాస్తవాధీన రేఖ వెంబడి అన్నిరకాలుగా బలపడే ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. ముఖ్యంగా అరుణాచల్‌ప్రదేశ్ వెంబడి సైనిక మోహరింపులను విపరీతంగా పెంచేసింది. డోక్లాం వెంబడి భూగర్భ నిల్వ వసతులను పటిష్టపరుచుకుంది. మరెన్నో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంది. పాంగాంగ్ లేక్ మీదుగా రెండో వంతెనతో పాటు డ్యుయల్ పర్పస్ ఎయిర్‌పోర్టు, మల్టిపుల్ హెలిపాడ్లను నిర్మించుకుంది. తూర్పు లద్దాఖ్ వెంబడి పలుచోట్ల కొన్నేళ్లుగా చైనా సైన్యం కయ్యానికి కాలుదువ్వడం, మన సైన్యం దీటుగా బదులివ్వడం తెలిసిందే. ముఖ్యంగా మూడేళ్లుగా అక్కడ ఇరు సైన్యాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'చైనాలో సైనిక, భద్రతాపరమైన పరిణామాలు–2023' పేరిట అమెరికా రక్షణ శాఖ తాజాగా ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది. '2020 మే నుంచే భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలు తీవ్ర ఉద్రిక్త స్థాయికి చేరడం మొదలైంది. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి రెండు డివిజన్ల జిన్‌జియాంగ్, టిబెట్ మిలిటరీ డిస్ట్రిక్ట్స్‌ దన్నుతో ఒక బోర్డర్ రెజిమెంట్‌నే ఏర్పాటు చేసింది. నాలుగు కంబైన్డ్ ఆర్మీ బ్రిగేడ్ (సీఏబీ) తదితరాలను 2022లో వాస్తవాధీన రేఖ వెంబడి రిజర్వులో ఉంచింది. మరో మూడు సీఏబీలను ఇతర కమాండ్‌ల నుంచి తూర్పు సెక్టార్‌కు తరలించి సిద్ధంగా ఉంచింది. తర్వాత వీటిలో కొన్నింటిని వెనక్కు పిలిపించినా మెజారిటీ సేనలు ఇప్పటికీ వాస్తవాధీన రేఖ వెంబడే మోహరించే ఉన్నాయి' అని ఆ నివేదిక స్పష్టంచేసింది. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరు సైన్యాలు తీవ్ర ఘర్షణకు దిగడం తెలిసిందే. ఆ నేపథ్యంలో చైనా ఈ చర్యలకు దిగిందని నివేదిక వెల్లడించింది. ఈ మోహరింపులు ఇలాగే కొనసాగవచ్చని అభిప్రాయపడింది. ఇక భూటాన్ వెంబడి వివాదాస్పద ప్రాంత సమీపంలో చైనా ఏకంగా ఊళ్లనే ఏర్పాటు చేసిందని తెలిపింది.

చైనా వద్ద 500 అణు వార్‌హెడ్లు!

ప్రయోగానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్న అణు వార్ హెడ్లు చైనా వద్ద ఏకంగా 500 దాకా ఉన్నట్టు పెంటగాన్ నివేదిక పేర్కొంది. 'గత రెండేళ్లలోనే ఏకంగా 100 వార్‌హెడ్లను తయారు చేసుకుంది. 2030 కల్లా వీటిని కనీసం 1,000కి పెంచడమే డ్రాగన్ దేశం లక్ష్యంగా పెట్టుకుంది' అని నివేదిక వివరించింది. 300కు పైగా ఖండాంతర బాలిస్టిక్ మిసైళ్లు తదితరాలు ఇప్పటికే చైనా అమ్ములపొదిలో చేరినట్టు వివరించింది. వాటిని దేశవ్యాప్తంగా మూడు చోట్ల అండర్‌గ్రౌండ్ వసతుల్లో అతి సురక్షితంగా ఉంచింది. 'వీటితో పాటు సంప్రదాయ ఖండాంతర బాలిస్టిక్ మిసైళ్ల తయారీని మరోసారి వేగవంతం చేసింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నావికా దళం ఇప్పటికే చైనా సొంతం. ఏడాదిలోనే 30 యుద్ధ నౌకలను నిర్మించుకుంది. దాంతో చైనా వద్ద మొత్తం యుద్ధ నౌకలు ఏకంగా 370కి చేరాయి. వీటిని 2025 కల్లా 400కు, 2030 కల్లా 450కి పెంచే యోచనలో ఉంది' అని పేర్కొంది. 'విదేశాల్లో సైనిక స్థావరాలను పెంచుకునేందుకు చైనా ముమ్మర ప్రయత్నాలు చేసింది. నైజీరియా, నమీబియా, మొజాంబిక్, బంగ్లాదేశ్, బర్మా, సాల్మన్ దీవులు, థాయ్‌లాండ్, తజకిస్థాన్, ఇండొనేసియా, పపువా న్యూ గినియా వంటి దేశాల్లో వ్యూహాత్మక సైనిక స్థావరాలను పెంచుకునేలా కనిపిస్తోంది' అని నివేదిక తెలిపింది.



చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

హార్వర్డ్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్న సీజేఐ

మసాచుసెట్స్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శనివారం అమెరికాలో హార్వర్డ్ లా స్కూల్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఆయన హార్వర్డ్ లా స్కూల్‌లోనే 1982–83లో ఎల్ఎల్ఎం డిగ్రీ చేశారు. 1983–86 మధ్య జ్యుడీషియల్ సైన్సెస్‌లో డాక్టరేట్ పూర్తి చేశారు. గత జనవరిలో ఆయనకు ఈ అవార్డును ప్రకటించడం తెలిసిందే. సుప్రీంకోర్టులో టెక్నాలజీ వినియోగం మరింత పెంచడంసహా సీజేఐగా తొలి ఏడాది తాను చేపట్టిన పలు చర్యలను అవార్డ్ అందుకున్న సందర్భంగా ఆయన వివరించారు. లాయర్ల మానసిక ఆరోగ్యం తదితర అంశాలను స్పృశిస్తూ ప్రసంగించారు.

నేపాల్‌లో భూకంపం

కాఠ్మండు: నేపాల్ రాజధాని కాఠ్మండును ఆదివారం శక్తివంతమైన భూకంపం కుదిపేసింది. ధడింగ్ జిల్లా కేంద్రంగా ఉదయం 7.39 గంటలకు రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో భూమి కంపించిందని యంత్రాంగం తెలిపింది. మరో 29 నిమిషాల అనంతరం ధడింగ్ జిల్లాలోనే భూ ప్రకంపనలు మరో నాలుగుసార్లు సంభవించినట్లు పేర్కొంది. దీంతో, రాజధాని ప్రాంతంలోని 20 ఇళ్ల వరకు దెబ్బతిన్నాయని, మరో 70 వరకు ఇళ్ల గోడలు బీటలువారాయని పేర్కొంది. ఎటువంటి ప్రాణనష్టం సంభవించినట్లు సమాచారం లేదని వెల్లడించింది. భూకంపం ప్రభావం బాగ్మతి, గండకి ప్రావిన్స్‌ల వరకు కనిపించింది.

భారత్ వ్యవహారాల్లో కెనడా జోక్యం

విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ వెల్లడి

న్యూఢిల్లీ: కెనడా దేశస్తులకు వీసా సేవల పునరుద్ధరణ అంశం, ఆ దేశంలోని భారత దౌత్యవేత్తలకు కల్పించే భద్రతపై ఆధారపడి ఉంటుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కుండబద్దలు కొట్టారు. కెనడాతో దౌత్యపరమైన సమానత్వం వియన్నా సూత్రాల ప్రకారమే భారత్ కోరుతోందని కూడా ఆయన స్పష్టం చేశారు. భారత్ నుంచి 41 మంది దౌత్యాధికారులను కెనడా ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో భారత్–కెనడా సంబంధాలపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. కెనడా భారత్ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కొనసాగిస్తోందనే ఆందోళనతోనే దౌత్యపరమైన సమానత్వంపై పట్టుబట్టాల్సి వస్తోందని మంత్రి వివరించారు. 'ఈ విషయం గురించి ఎక్కువగా మాట్లాడకూడదు. కాలక్రమంలో మరికొన్ని అంశాలు బయటకు వస్తాయి. భారత్ చర్యలపై చాలా మందికి ఎందుకు అసౌకర్యం కలిగిందనే విషయం ప్రజలు అర్థం చేసుకుంటారు'అంటూ వ్యాఖ్యానించారు. 'కెనడాతో సంబంధాలు ప్రస్తుతం ఇబ్బందికరంగా మారాయి. ఆ దేశ రాజకీయాల్లోని ఒక వర్గం, దానికి సంబంధించిన విధానాలతో మాకు కొన్ని సమస్యలున్నాయి. కెనడాలోని మన దౌత్యాధికారుల భద్రత ప్రమాదంలో పడింది. అందుకే వీసాల జారీని నిలిపివేశాం. పరిస్థితుల్లో మార్పు కనిపిస్తేనే వీసాల జారీ పునరుద్ధరణ సాధ్యమవుతుంది' అని జైశంకర్ అన్నారు. దౌత్యాధికారుల భద్రత, రక్షణ అంశం వియన్నా సూత్రాల్లో కీలకమైందని వివరించారు. జూన్‌లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది నిజ్జర్ హత్యకు గురయ్యాడు. ఘటన వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తముందంటూ కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలతో ఉద్రిక్తతలు మొదలైన విషయం తెలిసిందే.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 23 : అక్టోబర్ : 2023



కావేరి సమస్యను ప్రధాని తీర్చాలి: శివ

మండ్య: కావేరి నది నీటి పంపిణీ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకుని రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ కోరారు. ప్రజస్వామ్య వ్యవస్థలో రెండు రాష్ట్రాల మధ్య సమస్య వచ్చినప్పుడు ప్రధాని జోక్యం చేసుకుని పరిష్కరించాలని అన్నారు. ఆదివారం ఆయన మద్దూరు ఓ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు సీఎంలు కూర్చొని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మాకు తాగడానికి నీరు లేనప్పుడు తమిళనాడుకు నీరు ఇవ్వాలని ఆదేశించడం సరికాదన్నారు. తాను రాజకీయాల్లోకి రాబోనని, సినిమా రంగంలోనే ఉంటానని చెప్పారు.

న్యూస్‌రీల్

జింక అడ్డు రావడంతో..



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

యశవంతపుర: అడ్డం వచ్చిన జింకను తప్పించబోయిన కారు ప్రమాదానికి గురైన ఘటన చిక్కమగళూరు జిల్లా కళస సమీపంలోని సంపిఖాన్ వద్ద జరిగింది. ఆదివారం మంగళూరుకు చెందిన కుటుంబం హొరనాడు అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకొని తిరుగు ప్రయాణమైంది. సంపిఖాన్ వద్ద వేగంగా వెళ్తుండగా ఒక జింక అడ్డు రావడంతో డ్రైవర్ అదుపుతప్పగా కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారులో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి

మైసూరు: బ్యారికేడ్‌కు బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు, మరో వ్యక్తి మరణించారు. ఈ ఘటన జిల్లాలోని హుణసూరు–మైసూరు రహదారి సోమనహళ్లి వద్ద జరిగింది. కొడగుజిల్లా కుశాలనగరకు చెందిన ప్రసన్న, పిరియాపట్టణ తాలూకా హుణసవాడి సర్కిల్ కు చెందిన శేఖర్‌లు స్నేహితులు. వీరిద్దరూ శనివారం రాత్రి మైసూరు దసరా ఉత్సవాలను వీక్షించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రసన్న అక్కడికక్కడే మరణించాడు. శేఖర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. హుణసూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడవ ప్రపంచ యుద్ధాన్ని నివారించాలి



సీఐటీయూ కార్యకర్తల ప్రదర్శన

గౌరిబిదనూరు: మూడవ ప్రపంచ యుద్ధం జరగకుండా ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని ఇజ్రాయెల్, పాలస్తీనా పోరాటాన్ని ఆపాలని, కోట్లాది మనుషుల ప్రాణాలను రక్షించాలని సీఐటీయు నాయకులు డిమాండు చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా పట్టణంలో ఎంజీ సర్కిల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. 1939 నుంచి 1944 వరకు జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, మళ్లీ అలాంటి పరిస్థితి రాకుండా ఇజ్రాయెల్ దాడులను ఐరాస నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ దాడుల్లో అమాయక మహిళలు, పిల్లలు వందలాదిగా చనిపోతున్నారని వాపోయారు. ఇతర దేశాలు కూడా యుద్ధంలో పాల్గొంటే అధిక ప్రాణనష్టం జరుగుతుందని, దీనిని నివారించాలని కోరారు.

పండుగ వేళ అన్నదాత ఆత్మహత్య

మైసూరు: పండుగ వేళ అప్పుల బాధతో రైతు ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన కేఆర్ నగరం తాలూకా దెగ్గనహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రామేగౌడ అనే రైతు వ్యవసాయం కోసం తిప్పూరు సహకార బ్యాంకు నుంచి రూ. 2.5 లక్షలు, కెనరా బ్యాంకు నుంచి రూ. 50 వేలు, ఇతరత్రా చోట్ల నుంచి రూ. 2 లక్షలను అప్పులు చేశాడు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి కూడా రూ. 2–3 లక్షలకు పైగా రుణాలు చేశాడు. సకాలంలో వర్షాలు పడకపోవడం, సాగు చేసిన పంటలు నష్టం వాటిల్లడంతో ఆవేదనకు లోనై ఆత్మహత్య చేసుకున్నాడు. కేఆర్ నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.2.43 కోట్ల డ్రగ్స్ సీజ్

- నైజీరియన్ అరెస్టు



ఎండీఎంఏ డ్రగ్స్, మొబైల్

బనశంకరి: డ్రగ్స్ అమ్ముతున్న నైజీరియన్ పౌరున్ని ఆదివారం బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి రూ.2 కోట్ల 43 లక్షలు విలువచేసే మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. నైజీరియన్ విక్టర్ దొడ్డనాగమంగల వీరభద్రస్వామిలేఔట్‌లో అద్దె ఇంట్లో డ్రగ్స్ నిల్వ చేసినట్లు తెలిసి దాడులు జరిపారు. ఇందులో రూ.2.43 కోట్లు విలువచేసే ఎండీఎంఏ, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పెడ్లర్ మెస్సో నుంచి ఢిల్లీ నుంచి డ్రగ్స్ తెప్పించుకుని వాటిని ప్యాకెట్లుగా చేసి అధిక ధరకు విక్రయించేవాడు. మంగళూరు, కేరళలో అమ్మేవాడు, బంట్వాళ తాలూకా విట్లలో ఇతని అనుచరుడు హసన్ సాదిక్‌ను అరెస్ట్‌చేశారు. ఇతని వద్ద నుంచి రూ.రూ.2.50 లక్షల విలువచేసే 50 గ్రాములు ఎండీఎంఏ ,మారుతి 800 కారు, మొబైల్ ను సీజ్ చేసి విచారణ చేపట్టారు.

సంబరాలకు స్వాగతం



రూపుదిద్దుకుంటున్న ఓ శకటం

- మైసూరులో మిన్నంటిన దసరా శోభ
- మంగళవారం జంబూసవారీ మహావేడుక
- ఆకట్టుకున్న వైమానిక ప్రదర్శన



అబ్బురపరిచిన విమాన విన్యాసాలు



ఆదివారం మైసూరు ప్యాలెస్ ముందు జంబూసవారీ రిహార్సల్స్



రాజప్రాసాదం ముందు సందడి

మైసూరు: అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహా వేడుకకు కౌంట్‌డౌన్ ఆరంభమైంది. మైసూరు దసరా రోజున నిర్వహించే చారిత్రక జంబూ సవారి సంరంభానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం గజరాజులు, సాయుధ బలగాలు, కళా బృందాలతో పతాకస్థాయిలో రిహార్సల్స్‌ను నిర్వహించారు. ఈ ఊరేగింపును చూడడానికి దేశవిదేశాల నుంచి ఐదు లక్షలకు మంది పైగా పర్యాటకులు రావచ్చని అంచనా. 24వ తేదీ.. మంగళవారం వివిధ పూజలు నిర్వహించి సీఎం సిద్దరామయ్య, గవర్నర్ గెహ్లాట్, రాజ ప్రముఖుల ఆధ్వర్యంలో దసరా జంబూసవారీని నిర్వహిస్తారు.

జంబూసవారీ ఇలా..

- కన్నడ నాడు వారసత్వ, సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరిగే జంబూసవారీ కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.
- మంగళవారం మధ్యాహ్నం 1.46 గంటల నుంచి 2.08 గంటల వరకు శుభ మకర లగ్నంలో మైసూరు ప్యాలెస్ ఆవరణలో బలరామ మార్గం వద్ద జంబూ సవారీ ఆరంభమవుతుంది.
- సీఎం సిద్దరామయ్య నందిధ్వజానికి సంప్రదాయ పూజ చేసి ఈ ప్రారంభిస్తారు.
- సాయంత్రం 4.40 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శుభ మీన లగ్నమందు విజయదశమి ఊరేగింపు జరుగుతుంది.
- కెప్టెన్ అభిమన్యు ఏనుగుపై బంగారు అంబారీలో చాముండేశ్వరి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రముఖులు పుష్పార్చన గావిస్తారు. 21 సార్లు ఫిరంగులను పేల్చి గౌరవ వందనం చేస్తారు.
- జిల్లాలు, శాఖలకు చెందిన మొత్తం 49 శకటాలు ఊరేగింపులో పాల్గొంటాయి. జానపద కళాకారుల బృందాల ప్రదర్శన సరేసరి. కేఆర్ సర్కిల్, సయ్యాజీ రావ్‌రోడ్డు ద్వారా బన్నిమంటపం పంజిన కవాతు మైదానం వరకు ఊరేగింపు జరుగుతుంది.

సాయంత్రం కాగడాల ప్రదర్శన

సాయంత్రం ఏడు గంటలకు బన్నిమంటపం మైదానంలో కాగడాల ప్రదర్శన, పోలీసు బృందాల ద్వారా సాహస ప్రదర్శనలు జరుగుతాయి. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పాల్గొని గౌరవ వందనం స్వీకరిస్తారు. ఇదే సమయంలో మంగళవారం ఉదయం మైసూరు ప్యాలెస్‌లో రాజవంశస్తుల ప్రైవేటు దర్బార్ కూడా జరగనుంది. యదువీర్ ఉత్తర పూజ, విజయ యాత్ర నిర్వహించి శమీ వృక్షానికి పూజలు చేయనున్నారు.

అలరించిన ఎయిర్ షో

నాలుగేళ్ల తర్వాత మైసూరు దసరా మహోత్సవంలో ఎయిర్ షో సాధన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బన్నిమంటపంలోని పంజిన కవాతు మైదానంపై వైమానిక ప్రదర్శన జరిగింది. వేలాది మంది వీక్షించి మురిసిపోయారు. సూర్యకిరణ్ విమానాలు భారీ రొద పెడుతూ విన్యాసాలు సాగించాయి. సుమారు ఒక గంట పాటు జరిగింది. సోమవారం కూడా వైమానిక ప్రదర్శన జరగనుంది.



సెలవులు పొడిగింపు

చారిత్రక జంబూ సవారి ఊరేగింపును చూసేందుకు వేలాది మంది పర్యాటకులు మైసూరుకు తరలివస్తున్నారు. దీంతో దసరా సెలవును మంగళవారం వరకు పాఠశాల విద్యా శాఖ పొడిగించింది. వరుస సెలవులు, దసరా ఉత్సవాల వల్ల నగరంలోని రెస్టారెంట్లు, వసతి గృహాలు, హోటళ్లు, పర్యాటకులతో నిండిపోయాయి. మరోవైపు రాష్ట్రంలో ఎక్కువమంది మంగళవారమే దసరా పండుగ జరుపుకోనున్నారు.



ఆదివారం జరిగిన డాగ్ షోలో ఓ పోటీదారు



యక్షగాన అభినయం



యువ దసరాలో నృత్యోల్లాసం



వైమానిక విన్యాసాలను తిలకిస్తున్న జనసందోహం



యువ దసరాలో మల్లకంబ విన్యాసం

పబ్ బయట రచ్చ రచ్చ

శివాజీనగర: ఐటీ సిటీలోని చర్చి స్ట్రీట్‌లో ఉన్న బర్గర్ సైనర్ పబ్‌లో యువతీ–యువకుల గొడవ చెలరేగింది. అర్ధనగ్నంగా కొట్టుకోగా ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. శనివారం రాత్రి పబ్ నుంచి కాలేజీ యువకులు, యువతులు పార్టీ ముగించుకొని వెళ్లేటప్పుడు కొందరు యువకులు దురుసుగా ప్రవర్తించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట మొదలైంది. యువతులు కూడా ఇందులో పాల్గొన్నారు. మద్యం మత్తులో రోడ్డు మీదే రెండు గుంపులు కొట్టుకున్నాయి. ఓ యువకుడు పక్కన గడ్డి మీద పడిపోయాడు. యువతీ యువకుల చెలగాటం వీడియోలపై సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తమైంది. అర్ధరాత్రి వరకు చిందులేసింది చాలక రోడ్లపై అసభ్యంగా కొట్టుకుంటారా? అని పలువురు ప్రశ్నించారు.

మహిళ హత్య?



తుమకూరు: జిల్లాలోని శిర తాలూకా తావరెకెరె గ్రామం నుంచి మద్దక్కనహళ్లికి వెళ్లే దారిలో మహిళ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. శిరా తాలూకా బడకనహల్లి గ్రామానికి చెందిన పల్లవి (33)గా గుర్తించారు. హంతకులు హత్య చేసి పొలంలో మృతదేహాన్ని పడేసి వెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతదేహంపై అక్కడక్కడ గాయాలున్నాయి. జిల్లా ఎస్పీ వీకే అశోక్, తావరెకెరె పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

నిఘా హెచ్చరికలు.. భద్రత కట్టుదిట్టం

మైసూరు: ఉగ్రవాదులు జంబూసవారీలో అలజడి సృష్టించే ప్రమాదం ఉందని పోలీసు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. నకిలీ పాస్‌పోర్టుతో సుమారు 70 మంది అక్రమంగా దేశంలోనికి ప్రవేశించినట్లు కేంద్ర నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. ఒకవైపు క్రికెట్ మ్యాచ్‌లు, మరోవైపు దసరా ఉత్సవాల నేపథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. ఆదివారం డీజీపీ అలోక్ మోహన్ పోలీసు అధికారులతో భద్రత గురించి సమావేశం జరిపారు. మైసూరులో 1,568 మంది పోలీసులు, 30 కేఎస్ఆర్‌పీ ప్లాటూన్లు మోహరించారు.

కలర్‌ఫుల్ ప్రోగామ్స్‌కు తెర..

నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవం సందర్భంగా ప్యాలెస్‌తో పాటు వివిధచోట్ల 11 వేదికలపై జరిగిన సాంస్కృతిక సంరంభానికి ఆదివారం రాత్రి తెరపడింది. రైతు దసరా, యువ దసరా, యోగాసనాల పోటీలు తదితర పలు కార్యక్రమాలు ముగిశాయి. యువ దసరా చివరి రోజుమహారాజ కాలేజీ మైదానంలో గాయకుడు బెన్ని దయాళ్ తన సుమధుర గళంతో ఆకట్టుకున్నాడు. మహరాజ కాలేజీ విద్యార్థుల బృందం అంబేడ్కర్ జీవితంపై నృత్యం అలరించింది. ఛాయదేవీ బీఎడ్ కాలేజీ విద్యార్థుల బృందం బాలకృష్ణుని చిలిపి ఆటలు ప్రదర్శించారు. మైసూరు వర్సిటీ యోగా విద్యార్థులు ఏకదంతాయ వక్రతుండాయా పాటకు యోగసనాలు ప్రదర్శించారు.

ప్రేమపాశం.. తండ్రి కర్కశత్వం

- ప్రేమికునితో వెళ్లిపోయిందని కూతురి హత్య
- బెంగళూరులో మరో దారుణం



బనశంకరి: సిలికాన్ సిటీలో మరో పరువు హత్య చోటుచేసుకుంది. మామ ఇంట్లో ఉన్న అమ్మాయి ప్రేమించిన యువకునితో వెళ్లిపోయింది. ఇది సహించకలేక తండ్రి ఆమెను నరికి చంపాడు. ఈ ఘోరం బెంగళూరులోని పరప్పన అగ్రహార పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నాగనాథపురలో నివాసం ఉండే మామ ఇంట్లో పల్లవి (17) అనే బాలిక ఉంటూ చదువుకునేది. స్థానికంగా ఉండే యువకునితో ఆమె ప్రేమలో పడింది. ఇటీవల ఆమె అతనితో వెళ్లిపోయింది. మైసూరు జిల్లా హెచ్‌డీ.కోటెలో నివసించే ఆమె తండ్రి గణేశ్‌కు విషయం తెలిసి బెంగళూరుకు వచ్చాడు. మీకిద్దరికీ పెళ్లిచేసి బాగా చూసుకుంటామని నమ్మబలికి కూతురిని రప్పించాడు. కొడవలితో నరకడంతో బాలిక అక్కడికక్కడే మృత్యువాత పడింది. అగ్రహార పోలీసులు కేసు నమోదుచేసి కిరాతక తండ్రిని అరెస్ట్‌చేశారు. ఇటీవల దేవనహళ్లి వద్ద కూతురిని తండ్రి ఇదేరీతిలో నరికి చంపడం తెలిసిందే.

కుమార్తె నిర్వాకంతో తండ్రి ఆత్మహత్య

అల్లారుముద్దుగా పెంచిన కుమార్తె ఓ యువకున్ని ప్రేమించి ఇంటినుంచి పారిపోవడంతో ఆవేదన చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు శివార్లలో ఆనేకల్‌లో చోటుచేసుకుంది. అనేకల్ తాలూకా నారాయణపురలో గోపాల్ కుటుంబం నివసిస్తోంది. వీరి కుమార్తె ఒక యువకున్ని ప్రేమించి రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో విరక్తి చెందిన గోపాల్ అనేకల్ చెరువు ఆవరణలో చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఆదివారం ఉదయం వాకింగ్ కి వచ్చిన వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆనేకల్ పోలీసులు పరిశీలించి అతడి జేబులో ఉన్న పర్సు ఇతర వివరాలను బట్టి భార్యకు సమాచారం అందించారు. మృతదేహానికి శవపరీక్షలనిమిత్తం అనేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నవరాత్రుల సందర్భంగా ఆదివారం రాత్రి మంగళూరు కుద్రోళిలోని గోకర్ణనాథ ఆలయంలో భక్తజన సందోహం

పోలీసులమంటూ వ్యాపారి కిడ్నాప్

కృష్ణరాజపురం: సిలికాన్ సిటీలో దుండగులు.. పోలీసులమంటూ బెదిరించి మొబైల్ షాప్ యజమానిని కిడ్నాప్ చేసి రూ. 5లక్షలను డిమాండ్ చేశారు. వివరాలు... బెంగళూరు ఎస్పీ రోడ్‌లో కాలు సింగ్ అనే వ్యక్తి మొబైల్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కొందరు అతన్ని పట్టుకుని.. మేం పోలీసులం, నీవు డ్రగ్స్ విక్రయిస్తున్నావు, రూ. 5 లక్షలు ఇస్తే వదిలేస్తామని నిర్బంధించారు. మహమ్మద్ వసీం అనే నేరగాడు, అతని అనుచరులు వ్యాపారిని అపహరించారు. తాను అలాంటి పని చేయలేదని, డబ్బులు ఇవ్వనని కాలుసింగ్ తేల్చి చెప్పాడు. అతని వద్ద డబ్బులు లేవని తెలుసుకున్న వసీం ముఠా వదిలిపెట్టి వెళ్లిపోయింది. తరువాత బాధితుడు వీవీ పురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీబీకి సమాచారం అందించిన తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం ఐదు మంది నిందితులను అరెస్టు చేశారు.

బాలికపై హత్యాచారం.. దోషికి మరణశిక్ష

యశవంతపుర: మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో కామాంధునికి మరణశిక్ష పడింది. వివరాలు ఇలా.. ధారవాడ జిల్లా హుబ్లీ తాలూకా కురడికెరి గ్రామానిని చెందిన శెట్టప్ప బసప్ప వడ్డర్ దోషి. ఇతడు శిగ్గావి పోలీసుస్టేషన్ పరిధిలో 2019లో పెళ్లికి వెళ్లాడు. అక్కడ ఒక బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, ఆపై గొంతు పిసికి చంపి వెళ్లిపోయాడు. పోలీసులు విచారించి వడ్డర్‌ను అరెస్టు చేశారు. ధారవాడ జిల్లా కోర్టులో కేసు విచారణ సాగుతోంది. శనివారం జడ్జి నింగనగౌడ పాటిల్ తీర్పు వెలురించారు. దోషికి మరణశిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వైభవంగా చండికా హోమం



హోమం చేస్తున్న శ్రీ పాదంగల్

రాయచూరు రూరల్ : మంత్రాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండీకా హోమం నిర్వహించారు. మంత్రాలయ రాఘవేంద్ర స్వాముల మఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ ఆధ్వర్యంలో లోక కళ్యాణ కోసం చండికా హోమం జరిపారు. హోమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

పరిశీలకుడిగా మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: తెలంగాణలో నవంబర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా మంత్రి బోసురాజును నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి కృషి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

గుట్కా గోడౌన్‌లో దోపిడీ

- లక్షల విలువ చేసే సరుకు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మాలూరు: గుట్కా రహస్యంగా దాచిన గోడౌన్‌లో దుండగులు వాచ్‌మెన్ కాళ్ల చేతులు బంధించి లక్షల విలువ చేసే పాన్ మసాల సామగ్రిని అపహరించుకుని వెళ్లిన ఘటన తాలూకాలోని ఎట్టికోడి గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. హీరాలాల్ అనే వ్యక్తి ఎట్టికోడి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తికి చెందిన భూమిలో గోడౌన్ బాడుగకు తీసుకుని పాన్ మసాల, ఆర్ఎండి మసాల ప్యాకెట్‌లను విక్రయించడానికి దాచాడు. రాత్రి నలుగురైదుగురు దోపిడీ దొంగలు గోడౌన్‌లో పడుకున్న వాచ్‌మెన్ కాళ్లు చేతులు కట్టివేసి పిస్తోల్‌తో బెదిరించి గోడౌన్‌లో ఉన్న రూ. 20 లక్షలకు పైగా విలువ చేసే పాన్ మసాలా, ఆర్ఎండీ మసాల ప్యాకెట్లు, నగదును అపహరించుకుని వెళ్లారు. ఉదయం విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ ఎం నారాయణ్, ఏఎస్పీ వీబీ భాస్కర్, డీఎస్పీ టి మల్లేష్, ఎస్ఐ వసంత్‌కుమార్‌లు పరిశీలన జరిపారు.

అర్థ నారీశ్వర అలంకరణ



అర్థ నారీశ్వర అలంకరణలో అమ్మవారు

కెజీఎఫ్: శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగరంలోని గణేష పురంలో ఉన్న గంగమ్మ దేవి ఆలయంలో ఆదివారం అర్ధనారీశ్వర అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం, వేద మంత్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

భారతీయ సంస్కృతికి దసరా ఉత్సవాలు ప్రతీక

తుమకూరు: నవరాత్రి ఉత్సవం కర్ణాటకలోనే కాదని, దేశంలోనే జరుగుతోందని, అయితే మైసూరులో ఆ మహోత్సవం అన్ని ప్రాంతాల్లో కంటే ఘనంగా జరుగుతుందని జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర తెలిపారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో తుమకూరు జిల్లా దసరా సమితి ఏర్పాటుచేసిన 33వ దసర ఉత్సవాన్ని శ్రీనివాస కల్యాణోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. దసరా మన సంస్కృతి ప్రతీక అని చెప్పారు.

విజయ దశమి వరకు వేచి చూస్తా

- దేవేగౌడపై భరోసా ఉంది: ఇబ్రహీం

శివాజీనగర: 'బీజేపీ, జేడీఎస్ పొత్తుపై పునరాలోచిస్తారా లేదా అనే విషయంపై విజయదశమి వరకు వేచి చూస్తాను, దేవేగౌడపై తనకు భరోసా ఉంది. అయితే కుమారస్వామిపై భరోసా లేదు' అని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్ష పదవినుంచి తొలగింపునకు గురైన సి.ఎం.ఇబ్రహీం అన్నారు. ఆయన ఆదివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. తాను సాంకేతికంగా వందశాతం జేడీఎస్‌లో ఉన్నానని, తనను అధ్యక్ష స్థానం నుంచి తొలగించేందుకు సాధ్యపడదని వారికి తెలుసన్నారు. పగలగొట్టి ఆమ్లెట్ చేసేందుకు ఇదేమైనా కోడి గుడ్డా? అని ప్రశ్నించారు. చట్టపరంగా ఎన్నుకున్న కార్యవర్గాన్ని తొలగించాలంటే కొన్ని విధానాలు పాటించాల్సి ఉందన్నారు. చేదు, తీపి తనకు తెలుసని, పునర్ పరిశీలన చేయాలని దేవేగౌడకు చేతులెత్తి మొక్కి విన్నవిస్తానన్నారు.

ఇద్దరు విదేశీయుల అరెస్ట్

బనశంకరి: వీసా అవధి ముగిసినా అక్రమంగా మకాం వేసిన నైజీరియాకు చెందిన అంకితోలా, ఘానా సలామ్‌ను ఆదివారం మంగళూరు తూర్పు పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని బెంగళూరులోని విదేశీయుల ప్రాదేశిక కార్యాలయంలో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

కొండెక్కుతున్న ఉల్లి ధరలు

- ధరలు పెరిగే సమయంలో రైతులకు నష్టాలు
- ఉత్పత్తి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు
- ఎండిపోతున్న ఉల్లిపంట
- ఒక పాకెట్ ఉల్లి ధర రూ.2000 నుంచి రూ.2500
- త్వరలో కేజీ రూ.100 ?



పెట్టుబడి కూడా కష్టమే



పొలంలో ఎండిపోయిన ఉల్లి పంట

సాక్షి బళ్లారి: మార్కెట్‌లో రోజు రోజుకు ఉల్లి ధరలు పెరిగిపోతున్నప్పటికీ రైతులకు మాత్రం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలోని అత్యధికంగా ఉల్లి సాగుచేసే చిత్రదుర్గం జిల్లాలో ఈసారి ఉల్లి రైతులకు కష్టాలు కన్నీళ్లే మిగులుతున్నాయి. దేశంలో మహారాష్ట్ర తర్వాత కర్ణాటకలో ఉల్లి సాగు అంతే స్థాయిలో ప్రతి ఏటా జరిగేవి. ఈసారి తీవ్ర వర్షాభావం పరిస్థితుల వల్ల మహారాష్ట్రలో ఉల్లిసాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టడంతో పాటు కర్ణాటకలో కూడా ఉల్లి సాగు తక్కువే. చిత్రదుర్గం జిల్లాలో ప్రతి ఏటా వర్షాధారిత భూములతో పాటు నీటిపారుదల వసతి గల భూముల్లో దాదాపు 2లక్షల ఎకరాల్లో ఉల్లిసాగు జరిగేది. ఈసారి కేవలం లక్ష ఎకరాల్లోపే చిత్రదుర్గం జిల్లాలో పలు గ్రామాల్లో ఉల్లిసాగు చేశారు. ఈసారి సగానికిపైగా ఉల్లి దిగుబడి తగ్గిపోయింది. అయితే పెట్టిన పంట కూడా చేతిక అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఉల్లి ధర మరింత పెరిగేందుకు దారులు ఏర్పడుతున్నాయి. అయితే ప్రతి ఏటా ఒక ఎకరాకు ఉల్లిగడ్డలు 150 బస్తాలు అంటే 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని ఈసారి కేవలం 30 బస్తాలు అంటే 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని చిత్రదుర్గం జిల్లా రైతులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంత్ సాక్షికి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కూడా ఒక ఎకరాకు 15 క్వింటాళ్ల పైబడి దిగుబడి రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఉల్లి కోతలు ప్రారంభమైనాయని ధరలు పెరుగుతున్నప్పటికీ పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఒక ఎకరాకు రూ.50 వేలకుపైగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతులకు 15 క్వింటాళ్లే దిగుబడి రావడంతో రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ప్రస్తుతం ఉల్లిపంట పూర్తిగా దెబ్బతినడంతో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులే పేర్కొంటున్నారు. ప్రస్తుతం కిలో ఉల్లి రూ.50ల నుంచి రూ.60ల వరకు ధర పలుకుతోందని మరో నెల ల్లోపు కిలో ఉల్లి రూ.100లైనా పెరిగే అవకాశం ఉందని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

హెచ్చెల్సీలో మృతదేహం

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి క్రాస్ సమీపంలో ఉన్న తుంగభద్ర హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచ్ కాలువలో గుర్తు తెలియని 40 సంవత్సరాల వ్యక్తి శవాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివ, సిబ్బంది శవాన్ని పరిశీలించారు. తెలుపు రంగు చొక్కా, చెడ్డి మాత్రమే ఉంది. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుండి బ్రాంచ్ కాలువలోకి వచ్చిందని గుర్తించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు జరిపించారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. ఇటీవల బళ్లారి నగరానికి చెందిన యువకున్ని కొందరు హత్య చేసి ఇదే మాదిరిగా కాలువలో మృతదేహాన్ని పడేయడం తెలిసిందే. ఈ మృతదేహం కూడా బళ్లారి ప్రాంతవాసిది కావచ్చని అనుమానాలున్నాయి.

రెండు కార్లు ఢీ

కూడేరు: ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని జల్లిపల్లి–ఉదిరిపికొండ గ్రామాల మధ్య అనంతపురం–బళ్లారి ప్రధాన ర హదారిపై ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కార్లలో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటక రాష్ట్రం హొసపేటె నుంచి అనంతపురం వైపు, అలాగే అనంతపురం నుంచి బళ్లారి వైపు వెళ్లే కార్లు ప్రమాదానికి గురయ్యాయి.

అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులా ?

- యాదగిరిలో దుశ్చర్య

రాయచూరు రూరల్ : కళ్యాణ కర్ణాటక అక్రమాలకు నిలయంగా మారింది. యాదగిరి జిల్లాలో అక్రమాలపై ప్రశ్నించిన వారిపై మారణాయుధాలతో దాడులు జరిపిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇసుక అక్రమ రవాణా విషయంపై ప్రశ్నించిన వ్యక్తిని కిడ్నాప్ చేసి మారణాయుధాలతో దాడి చేశారు. యాదగిరి జిల్లా శహపూర్ తాలూకా విభూతిహళ్లిలో కృష్ణానది నుండి బసురెడ్డి, గ్రామ పంచాయతీ సభ్యుడు విజయ్ రాథోడ్ అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయంపై రాజు, శరణగౌడ అనే వ్యక్తులు ప్రశ్నించారు. దీంతో వారిని కారులో కిడ్నాప్ చేసి మారణాయుధాలతో దాడి చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణ బసప్ప మద్దతుతోనే దౌర్జన్యాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గాయపడిన శరణగౌడను కలబుర్గి ఆస్పత్రికి తరలించారు.

అక్రమాలను అరికట్టండి ఎంపీ లేఖ :

యాదగిరి జిల్లాలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శరణు ప్రకాష్ పాటిల్, యాదగిరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణ బసప్పలకు ప్రత్యేక లేఖలు రాశారు. కృష్ణ, తుంగభద్ర నదీ తీరాల్లో అక్రమంగా ఇసుక రావాణా, అక్రమ మద్యం, రేషన్ బియ్యం తరలిస్తున్నారని ఆ లేఖలో రాశారు.

ఆలయాల్లో ఉత్సవ శోభ



శ్రీకనకదుర్గమ్మకు బంగారు ఆభరణాల అలంకరణ



బన్నిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న కాలనీ వాసులు

- కనకదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

బళ్లారి అర్బన్: బళ్లారిలో శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కనక దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. విజయదశమి సందర్భంగా 9 రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పొటెత్తారు. ఆలయం రాజగోపురంతో పాటు నాలుగు గోపురాలను విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు ఈఓ హనుమంతప్ప, ధర్మకర్త రాజశేఖర్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం దేవి పురాణం, సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామాలు, ప్రవచనాలు, సాంస్కృతిక, భక్తి గీతాలను ఆలపించారు.

బన్నిచెట్టుకు ప్రత్యేక పూజలు

బళ్లారి అర్బన్: నగరంలోని 20 వార్డు ఇంటూరి నగర్ శ్రీ దత్తాత్రేయ దేవస్థానం సమీపంలోని పార్కులో వెలసిన బన్నిచెట్టుకు అక్కడి కాలనీ వాసులు ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రముఖులు పంపాపతి, యర్రిస్వామి, నారాయణ స్వామి, గణేష్, గోపాల్, వీరణ్ణగౌడ, హనుమంతు, రఘు, మంజు, నాగేంద్ర, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో విశేష పూజలు

బళ్లారిటౌన్: నగరంలోని రైల్వే కాలనీ చౌడేశ్వరి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో చౌడేశ్వరి దేవికి ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు జరిపారు. ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక పంచామృతాభిషేకం జరిపి రజితకవచ అలంకారం చేపట్టారు. 10 గంటల నుంచి అమ్మవారిని వీరభద్ర వీరతాండవంతో అమ్మవారి భజన, ఆనంద నృత్యం, ఖడ్గ పద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

అమ్మవార్లకు విశేష పూజలు



అమ్మవారికి పూజలు

మైసూరు: మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా మైసూరులో పలు ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఊటీ రోడ్డులో ఉన్న శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని నాద మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు. శృంగేరి అభినవ శంకరమఠంలో శారదా పరమేశ్వరికి అభిషేకం, హోమం, ప్రత్యేక పూజ, తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో రాజరాజేశ్వరి అలంకారాన్ని దేవీకి సమర్పించారు. మరో వైపు విజయనగరలో ఉన్న శ్రీ సప్త మాతృకాచౌడేశ్వరి ఆలయంలో చౌడేశ్వరి దేవీకి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం, వివిధ రకాలతో పూలతో దుర్గాదేవికి అలంకరణ చేశారు.

పురుషులకూ గ్యారెంటీ పథకం వర్తింపజేయాలి

- వాటాళ్ డిమాండ్

శివాజీనగర: మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీ పథకాలను పురుషులకు కూడా వర్తింపజేయాలని కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో బీఎంటీసీ బస్‌లో టికెట్ తీసుకోకుండా ప్రయాణం చేసి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. పథకాలను పురుషులకు కూడా వర్తింపజేస్తే మానసిక శక్తి కూడా వారికి నింపినట్లు అవుతుందని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల రూ. 2వేలు ఇస్తున్నారని, అదే విధంగా ఇంటి యజమానికి కూడా నారాయణ అనే పేరుతో రూ.2 వేలు ఇవ్వాలని, శక్తి పథకం కూడా వర్తింపజేయాలన్నారు.

అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ



నగరేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకరణ



చిన్నమార్కెట్ శాంభవిదేవికి దుర్గాదేవి అలంకారం



చిన్న దుర్గమ్మకు దుర్గాదేవి అలంకరణ



మారెమ్మకు గాజుల అలంకరణ

బళ్లారి అర్బన్: విజయ దశమి సందర్భంగా బళ్లారి నగరంలోని 8వ రోజు ఆదివారం అమ్మవారి ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణలు గావించి అమ్మలగన్న అమ్మ కరుణించమ్మా దుర్గమ్మ అంటూ పూజలు చేశారు. పటేల్‌నగర్ చిన్నదుర్గమ్మకు దుర్గాదేవి అలంకరణ, మిల్లర్‌పేట్ మల్లాడు దుర్గామ్మ దుర్గాదేవి అలంకరణ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవికి దుర్గాదేవి అలంకరణ, నగరేశ్వరి ఆలయంలో పార్వతి దేవికి దుర్గదేవి అలంకరణ, అవంబావి సీతారామ ఆశ్రమంలో దుర్గాదేవి అలంకరణ, బెంకి మారెమ్మకు దుర్గాదేవి అలంకరణ, చిన్నమార్కెట్ శాంభవి దేవికి దుర్గదేవి అలంకరణ, ఏళ్లుమక్కళ తాయి ఆలయంలో, ఫైర్ ఆఫీస్ ఆదిశక్తి ఆలయంలో, దేవి నగర్ రేణుకా యలమల్మ ఆవరణంలో, తులజ యల్లమ్మ ఆలయంలో, కొల్లపూర్ మహాలక్ష్మీ ఆలయంలో, సంతోషి మాత ఆలయంలో, దుర్గా భవాని ఆలయం తదితర అమ్మవారికి ఆలయాల్లో దుర్గాష్టమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించి, పలు ఆలయాల్లో అన్నదానాలు చేశారు.

వైభవంగా శరవన్నవరాత్రి పూజలు



కాళికాదేవికి విశేష అలంకరణ



వేంకకటేశ్వర స్వామి ఊరేగింపు



హోమం నిర్వహిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: జిల్లాలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నగరంలోని కిల్లే బ్రహన్మఠం వెండి అంబా భవాని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కందగడ్డ మారెమ్మ దేవి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కోటలోని కాళికా దేవి ఆలయంలో దేవిని విశేషంగా తీర్చిదిద్దారు. శనివారం రాత్రి పల్లకి సేవలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు. నగరేశ్వరాలయం, ఉప్పార వాడి లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని ఊరేగించారు. మదాపూర్ మారికాంబ ఆలయంలో శాంతమల్ల శివాచార్యులు చండీ హోమం నిర్వహించారు.

- సంఘ్ ర్యాలీ



దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం ధార్వాడలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ర్యాలీ

కోలారు వార్తలు...

మల్బరి రైతులు ఆధునిక పద్ధతులు చేపట్టాలి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెలే

శ్రీనివాసపురం: పట్టు పెంపకంలో వైజ్ఞానిక పద్ధతులను అనుసరించడం ద్వారా మల్బరి రైతులు అధిక లాభాలను ఆర్జించవచ్చని, డిమాండ్ అధికంగా ఉన్న పట్టు రకాల పెంపకానికి ప్రాధాన్యత నివ్వాలని ఎమ్మెల్యే జికె వెంకటశివారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. రూ. 60 లక్షల వ్యయంతో తాలూకా పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం, తాంత్రిక సేవా కేంద్రం, పట్టగూళ్ల మార్కెట్ భవనం నిర్మిస్తామని చెప్పారు. పట్టు గూళ్ల ధరలలో హెచ్చు తగ్గులు సహజమని, పట్టు పెంపకందారులు ఓపికతో పంట నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి, పురసభ ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు మంజునాథ్ రెడ్డి, ప్రసన్న, పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 3.5 కోట్లతో జలజీవన్ మిషన్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీనివాసపురం: తాలూకాలోని అన్ని గ్రామాలకు రూ. 3.5 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకం అమలు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే జికె వెంకటశివారెడ్డి తెలిపారు. ఆదివారం తాలూకాలోని రోణూరు, కొళతూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పనులను ప్రారంభించి మాట్లాడారు. పథకంలో భాగంగా ఇంటింటికి కొళాయి కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. 3 నెలల అవధిలో పనులను పూర్తవుతాయన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇంటి ముంగిటికే నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి మెహర్‌తాజ్, మణి, ఎస్ ఎం శ్రీనివాస్, నారాయణగౌడ, చంద్రప్ప, జయరాం, జయరామేగౌడ, నంజుండేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బొమ్మల కొలువు



బొమ్మల కొలువు దృశ్యం



కోలారు: దసరా పండుగను పురస్కరించుకుని శరన్నవరాత్రులలో భాగంగా దసరా బొమ్మల కొలువను ప్రతి ఇంటిలోనూ కొలువుదీర్చారు. ప్రతిఏటా కొత్త కొత్త బొమ్మలను ఆయా కాలానుగుణంగా ఖరీదు చేసుకుని వచ్చి శక్త్యాను సారంగా పూజలు నిర్వహిస్తారు. శరన్నవరాత్రులలో బొమ్మలు కొలువే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇళ్లలో కొలువుదీరిన వివిధ రకాల బొమ్మలను చూడడానికి నిత్యం పిల్లలు, మహిళలు తమ స్నేహితులు, బంధువుల ఇళ్లకు సాయంత్రం వెళ్లి బొమ్మల కొలువును చూసివస్తున్నారు. మహిళలు నిత్యం సాయంత్రం వేళ ప్రదర్శనకు ఉంచిన బొమ్మల కొలువుకు హారతులు పట్టి ఇంటికి ముత్తైదువులను పిలిచి పసుపు, కుంకుమ, రవిక , చీరలు పెట్టి గౌరవిస్తారు. అనంతరం ఆ బొమ్మలను పెట్టెలలో వచ్చే ఏడాది దసరా వరకు భద్రపరుస్తారు. శతాబ్దాలుగా ఈ సాంప్రదాయం కొనసాగుతోంది.

శంకరమఠంలో హోమం



కెజీఎఫ్: లోక కళ్యాణం కోసం శరన్నవరాత్రులును పురస్కరించుకుని నగరంలోని శ్రీ శంకరమఠంలో నవదుర్గ హోమం, చండికా హోమాన్ని నిర్వహించారు. సకాలంలో వానలు కురవాలని, దేశ సుభిక్షంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని ధన ధాన్య సమృద్ధి జరగాలని, గోవులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించి ఈ హోమాన్ని ఆదివారం నిర్వహించారు. రుత్వికులు శ్రీధర్, బృందం వేద మంత్ర ఘోషణల మధ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మార్కెట్లలో పండుగ సందడి



పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

- అమాంతం పెరిగిన ధరలు

కోలారు: విజయదశమి పురస్కరించుకుని నగరంలోని మార్కెట్లు కిటకిటలాడాయి. నగరంలోని పాత బస్టాండు, ఎంజి రోడ్డు, కేఎస్ ఆర్టీసీ బస్టాండు, శారదా టాకీస్ రోడ్డులో పూలు, పండ్ల దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. యధావిధిగా పండుగకు ముందు పూలు పండ్ల ధరలు భారీగా పెరిగాయి. కనకాంబరాలు ఏకంగా కిలో రూ. 2 వేల విక్రయిస్తుండగా మల్లెలు, కాగడాలు కిలో రూ. 1000, చేమంతులు కిలో రూ. 250 రూలు, బంతి పూలు కిలో 100 రూలకు విక్రయిస్తుండగా, ఊటిరోజా కిలో రూ. 200 విక్రయిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రజలు శక్తిమేర కొనుగోలు చేస్తున్నారు. ఇక అరటిపండ్లు కిలో 100, దానిమ్మ కిలో రూ. 200, ఆపిల్ కిలో రూ. 250, ద్రాక్ష కిలో రూ. 120, ఐదు కిలోల బూడిద గుమ్మడి రూ 100 నుంచి 120 వరకు విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

కార్యాలయంలో దుర్గాపూజ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: దసరా పండుగను పురస్కరించుకొని తాలూకా కార్యాలయంలో శనివారం దుర్గా పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలు పాడిపంటలతో సుఖంగా ఉడాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా అమ్మవారు ప్రజలందరిని రక్షిస్తారని అన్నారు. తహసీల్దారు మహేశ్ పత్రి, వాల్మీకి నాయకుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధపూజ కోసం పోలీసుల వసూళ్లు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన లారీ ఓనర్

దొడ్డబళ్లాపురం: ఆయుధపూజ కోసం పోలీసులు దందాకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. క్వారీ లారీ డ్రైవర్ల నుంచి రూ.25వేలు చొప్పున వసూలు చేశారని నెలమంగల తాలూకా త్యామగొండ్లు ఎస్ఐ దివ్య, కానిస్టేబుల్ శ్రీనివాస్‌పై నవీద్ అనే లారీ ఓనర్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. రోడ్డుపై వెళ్తున్న లారీలను కానిస్టేబుల్ అడ్డగించి డబ్బు వసూలు చేశారని, ప్రశ్నించిన వారిని బెదిరించారని పేర్కొన్నారు. ఇదంతా తెలిసినా, ఫిర్యాదు చేసినా ఎస్ఐ దివ్య పట్టించుకోలేదని ఆరోపించారు.

ఫైళ్లను తినేస్తున్న చెదలు



హరిహర నగరసభ కార్యాలయంలో చెదలు పట్టిన ఫైళ్లు

యశవంతపుర: దావణగెరె జిల్లా హరిహర నగరసభ కార్యాలయంలో ఫైళ్లను చెదలు తినేస్తున్నాయి. వందలాది ఫైళ్లు చెదలు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. నగరసభకు కొత్త కట్టడం కోసం పాత భవనాన్ని కూలదోశారు. పాత భవనంలోని ఒక గదిలో ఫైళ్లను ఉంచారు. ఓవైపు భవనం నిర్మాణ పనులు జరుగుతుండగా మరో వైపు పాత భవనంలో ఉంచిన ఫైళ్లు చెదలు పట్టి మట్టిగా మారాయి. విషయం తెలుసుకున్న కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాల మార్పు, ప్రజలు చెల్లించిన పన్నుల బిల్లులు, సిబ్బంది వేతన పుస్తకాలతో పాటుగా అనేక ముఖ్యమైన ఫైళ్లు నాశనమైనట్లు చెబుతున్నారు.

విగ్రహ నాణ్యతపై వివాదం

యశవంతపుర: ఉడుపి జిల్లా కార్కళ తాలూకాలో నిర్మాణంలో ఉన్న పరశురామ థీం పార్క్‌పై బీజేపీ-కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదం నెలకొంది. బైలూరు ఉమికల్ కుంజ కొండపై నిర్మిస్తున్న పరశురాముడి విగ్రహం కంచుది కాదని, ఫైబర్‌తో నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ వాదిస్తుంది. శనివారం ఈ విగ్రహం నాణ్యతను పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. అయితే కాంగ్రెస్ నాయకులు విగ్రహాన్ని ధ్వంసం చేశారని స్థానిక బీజేపీ నాయకుడు సునీల్ కార్కళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారీగా బాణాసంచా పట్టివేత

మైసూరు: హుణసూరు తాలూకా బిళికెరెలోని రెండు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 130 కేజీల బాణాసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేకు బజార్ రోడ్డు మూర్తణ్ణ, మంజు అనే వ్యక్తుల దుకాణాల్లో పోలీసులు దాడులు జరిపారు. గత ఏడాది మిగలిన వివిధ బ్రాండ్ల 130 కేజీల బాణాసంచాను పోలీసులు గుర్తించారు.

రౌడీషీటర్ దారుణ హత్య



మారుతి మృతదేహం



హతుడు మారుతి(ఫైల్)

తుమకూరు: పాత కక్షలతో రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన తిలక్ పార్కు పోలీసు స్టేషన్ సరిహద్దులోని బండిమనే కల్యాణ మంటపం వద్ద జరిగింది. మధుగిరి తాలూకా కొడిగెనహళ్లికి ఎందిన మారుతి అలియాస్ పోలార్డ్ (34)పా రౌడీషీట్ నమోదైంది. రౌడీషీటర్ హట్టి మంజ హత్యతో పాటు పలు కేసుల్లో మారుతి నిందితుడిగా ఉన్నాడు. ఇతను నగర శివార్లలోని మంచలకుప్ప వద్ద భార్యతో కలసి ఉంటున్నాడు. శనివారం రాత్రి స్నేహితులతో కలసి మద్యం సేవిస్తుండగా నలుగురు దుండగులు మారణాయుధాలతో వచ్చి విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలతో మారుతి మృతి చెందాడు. తిలక్‌నగర పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. హట్టి మంజ శిష్యులు ప్రతీకారం కోసం మారుతిని హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. జిల్లా ఎస్పీ అశోక్ వెంకట్, అడిషనల్ ఎస్పీ మరియప్ప ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ముగిసిన దసరా క్రీడా పోటీలు

మైసూరు దసరా మహోత్సవం సందర్భంగా వివిధ చోట్ల ఏర్పాటుచేసిన పోటీలు, క్రీడా పోటీలు ముగిశాయి. జేకే మైదానంలో రైతు దసరా ఉపసమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు.అలాగే ఆయా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందించారు. వస్తుప్రదర్శన ప్రాధికార ఆవరణలో, డి.దేవరాజు అరసు క్రీడా మైదానంలో జరిగిన కుస్తీ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మైసూరు:



పాలు పితికే పోటీల దృశ్యం



కుస్తీ పోటీల్లో విజేతలు



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

మార్కెట్లలో జోరుగా విక్రయాలు



శివమొగ్గలో బూడిద గుమ్మడి, పూల విక్రయాలు



శివమొగ్గ: దసరా ఆయుధ పూజ, విజయదశమి నేపథ్యంలో శివమొగ్గ నగరలో ఆదివారం పూలు, పండ్ల మార్కెట్లు ప్రజలతో కిటకిటలాడాయి. నిత్యావసర సరుకుల విక్రయాలు జోరుగా సాగాయి. శివప్పనాయక సర్కిల్, గాంధీబజార్, వీరశైవ కల్యాణ మంటపం రోడ్డు, మహానగర పాలికె కార్యాలయం ఎదుట రోడ్లపై భారీ సంఖ్యలో వ్యాపారులు పండుగ కోసం వస్తువులను విక్రయించారు.

గౌరిబిదనూరు: కరువు పరిస్థితులు నెలకొన్నా దసరా పండుగను మాత్రం సంప్రదాయంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పూజా సామగ్రి, నిత్యావసరాల ధరలు పెరిగినా వాటి కొనుగోలుకు ప్రజలు వెనకడుగు వేయలేదు. పట్టణంలో ఆదివారం పూలు, పండ్లు, కూరగాయల



గౌరిబిదనూరులో పూలు కొనుగోలు

మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. బూడిద గుమ్మడి కాయధరలు తగ్గడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. గత ఏడాది రూ.50 నుంచి రూ.60 ధర పలికిన బూడిద గుమ్మడి కాయ ఈసారి రూ.12కే లభించింది.

కారును ఢీకొన్న ట్రక్

చిలమత్తూరు: హిందూపురం పరిధిలో చిలమత్తూరు మండలంలోని 44 వ నంబరు బెంగళూరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో కారును ట్రక్కు ఢీకొంది. ఆదివారం సాయంత్రం కోడూరు వైపు నుంచి వచ్చిన ట్రక్కు పక్కన వెళుతున్న కారును ఢీకొంది. కారులో బెంగళూరుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రయాణిస్తుండగా వీరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇంతలో సీఆర్‌పీఎఫ్ రిటైర్డు అధికారిని అంటూ ఒక మహిళ అక్కడ హల్‌చల్ చేసింది. ఆ ట్రక్కు తమదేనని, ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు కదా అని కారులోనివారిని బెదిరించి పంపించి



కారును ఢీకొన్న కంటైనర్ వాహనం

వేసిది. పోలీసులను వివరణ కోరగా, బాధితులు ఫిర్యాదు చేయలేదని, అందుకే కేసు నమోదు చేయలేదని తెలిపారు. ట్రక్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినట్టు సీసీ టీవీ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా పోలీసులు చర్యలు తీసుకోలేదు.

కుర్చీలతో కొట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

యశవంతపుర: హాసనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం రసాభాసగా సాగింది. కార్యకర్తలు బాహాబాహికి దిగారు. కుర్చీలతో కొట్టుకున్నారు. వివరాలు.. లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేసేందుకు హాసనకు సమీపంలోని కల్యాణ మంటపంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి హాజరయ్యారు. అయితే నాయకుడు మహేష్‌కు వేదికపై చోటు కల్పించలేదన్న విషయంపై కార్యకర్తలు రెండు గుంపులుగా విడిపోయి పరస్పరం గొడవ పడ్డారు. కుర్చీలతో కొట్టుకున్నారు. ఇలా గొడవ పడితే ఇక్కడి నుంచి వెళ్లిపోతానంటూ మంత్రి హెచ్చరించటంతో కార్యకర్తలు మిన్నకుండిపోయారు.

నర్సులు అందమైన యువతులు

- తాతా అని సంభోదించడం బాధగా అనిపించింది
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజుకాగే వివాదాస్పద వ్యాఖ్యలు

బనశంకరి: నర్సులు అందమైన యువతులు అంటూ బెళగావి జిల్లా కాగవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజుకాగే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బెళగావి జిల్లా అథణి తాలూకా అవరఖోడ గ్రామంలో ఆదివారం జరిగిన దసరా సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజుకాగే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తనకు లివర్ మార్పిడి జరిగినప్పుడు నెల రోజులపాటు ఆస్పత్రిలో ఉన్నానన్నారు. వైద్యులు వచ్చి తన ఆరోగ్యంపై ఆరా తీసినప్పుడు... 'ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశారు.. అయితే మీ నర్సుల్లో చాలా అందమైన యువతులు ఉన్నారు, వారు తనను తాతా అంటున్నారు' ఇది తనను మానసికంగా వేధించిందని చెప్పినట్లు ఆయన వ్యాఖ్యనించారు. దీంతో కార్యక్రమానికి హాజరైన ప్రజలు కేకలు వేశారు.

బైకిస్టును బలిగొన్న బీఎంటీసీ బస్సు

దొడ్డబళ్లాపురం: బీఎంటీసీ బస్సులు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట బీఎంటీసీ బస్సులు ప్రమాదాలకు, మరణాలకు కారణమవుతున్నాయి. తాజాగా బీఎంటీసీ బస్సు బైకిస్టును బలిగొంది. నెలమంగల సమీపంలోని బిన్నమంగల వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను బీఎంటీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. బైకిస్టు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దొంగ అరెస్ట్, నగలు స్వాధీనం

కృష్ణరాజపురం: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహమ్మద్ ఆసీఫ్ అనే దొంగను కామాక్షిపాళ్య పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ. 8.22 లక్షల విలువైన 137 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజలు కష్టాల్లో ఉంటే సీఎం క్రికెట్ వీక్షిస్తారా?

- హెచ్‌డీ కుమారస్వామి ధ్వజం

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నారని, రాష్ట్రం అంధకారంలో ఉందని, అయినప్పటికీ తనకేమి పట్టనట్లుగా సీఎం సిద్దరామయ్య క్రికెట్ పోటీలు వీక్షిస్తూ కర్ణాటక నీరోగా వ్యవహరించారని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి నిపులు చెరిగారు. ఈమేరకు ట్విట్టర్ ఎక్స్‌లో పోస్టు చేసికారు. ప్రైవేటు విద్యుత్ సంస్థలనుంచి కమీషన్లు వసూలు చేయడానికే ప్రభుత్వం విద్యుత్ కొరత సృష్టించిందని, విద్యుత్ కొరత, వాస్తవస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జలవిద్యుత్ కొరత ఏర్పడుతుందని తెలిసీ ముందు జాగ్రత్తగా బొగ్గు ఎందుకు నిల్వ చేసుకోలేదని ప్రశ్నించారు. భారతదేశానికి చెందిన ఆధునిక ఈస్టిండియా కంపెనీ కాంగ్రెస్ అని ఉంటకిస్తూ రాష్ట్రాన్ని దోచుకోవడానికి కాంగ్రెస్ ఆకలిగా ఉందన్నారు.

సీఐఎస్ఎఫ్ ఎస్ఐ ఆత్మహత్య

యశవంతపుర: రివాల్వర్‌తో కాల్చుకొని సీఐఎస్ఎఫ్ ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళూరు బందర్ ముఖద్వారం వద్ద శనివారం రాత్రి జరిగింది. కేంద్ర పరిశ్రమల భద్రతా దళానికి చెందిన ఎస్ఐ జాకీర్‌హుసేన్(58) తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు తెలియలేదు. పణంబూరు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఎంవీ చంద్రశేఖర్ గుప్త(ఫైల్)

తుమకూరు: నీటి ట్యాంకర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన నగరంలోని భద్రమ్మ సర్కిల్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. మాకం కల్యాణ మంటపం, మాకం చారిటబుల్ ట్రస్టు, చిన్మయ మిషన్ కార్యదర్శి ఎంవీ చంద్రశేఖర్ గుప్త (73) దివ్యాంగుడు. ఈయన అశోక నగరలోని తన నివాసం నుంచి ఎంజీ రోడ్డులో ఉన్న కల్యాణ మంటపానికి త్రిచక్రవాహనంలో వస్తుండగా భద్రమ్మ సర్కిల్ వద్ద వేగంగా వచ్చిన నీటి ట్యాంకర్ ఢీకొట్టింది. ట్యాంకర్ ముందుభాగం చక్రంలో ఇరుక్కుపోవడంతో చంద్రశేఖర్ గుప్త తీవ్ర గాయాలతో మృతి చెందాడు.

హోసూరు వార్తలు..

మిన్నంటిన పండుగ సందడి





హోసూరులో బూడిద గుమ్మడి, అరటి పిలకల విక్రయాలు

హోసూరు: పండుగ సామగ్రి విక్రయాలు హోసూరు పట్టణంలో జోరుగా సాగాయి. హోసూరు ప్రాంతంలో దసరా పండును విశేషంగా జరుపుకోవడం ఆనవాయితీ. గత రెండు రోజులుగా పట్టణంలో దుస్తులు, నగల షాపులు, వాణిజ్య కాంప్లెక్స్‌లు కిక్కిరిశాయి. పట్టణంలోని పండ్ల దుకాణాలు, అరటి పిలకలు, గుమ్మడి కాయల వ్యాపారాలు ముమ్మరంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. కాగా, పూల ధరలు విపీరీతంగా పెరిగాయి. హోసూరు పూల మార్కెట్‌లో కిలో చామంతి రూ. 250 వరకు పలికింది. మల్లెలు కిలో రూ. 800, కనకాంబరాలు కిలో రూ.1500, బంతిపూలు రూ. 80, బటన్ రోజా రూ. 250 వరకు చేరాయి. జనం తాకిడితో రోడ్లన్నీ క్రిక్కిరిశాయి.

నీట్ రద్దు కోసం సంతకాల సేకరణ

హోసూరు: తమిళనాడులో నీట్ పరీక్షలను రద్దు చేయాలని అధికార డీఎంకే పార్టీ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా పట్టణంలోని మీరా మహల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నెహ్రూ, ఆహార భద్రతాశాఖ మంత్రి చక్రపాణి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యకర్తల నుంచి సంతకాలు సేకరించారు. మంత్రి నెహ్రూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీట్ పరీక్షల వల్ల విద్యావంతులైన విద్యార్థులు వైద్య చదువులకు ఎంపిక కాలేకపోతున్నారని ఆరోపించారు. నీట్‌ను రద్దు చేసేంత వరకు డీఎంకే ఒత్తిడి చేస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఎ.సత్య, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, ఎన్.ఎస్.మాదేశ్వరన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

కెలమంగలం: కెలమంగలం సమితి పచ్చపనట్టి గ్రామంలో కొన్నిరోజులుగా లోవోల్టేజ్ సమస్య ఉంది. ఎమ్మెల్యే టి.రామచంద్రన్ సంబంధిత శాఖాధికార్లతో చర్చించి మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు. ఆదివారం వాటిని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అప్పావు నగర్‌లో ఓవర్ ట్యాంక్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పంచాయతీ అధ్యక్షులు క్రిష్ణప్ప, మంజుల బైరప్ప, కౌన్సిలర్లు జయరామ్, సురేంద్రన్, ప్రశాంత్, విద్యుత్ శాఖాధాధికార్లు ప్రభాకర్, తేన్‌మొళి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉద్యోగి మృతి

క్రిష్ణగిరి: హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారిపై నడిచి వెళ్లుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందిన ఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు త్రిపుర రాష్ట్రానికి చెందిన అనూప్ కుమార్ ఆశాజి (33) సూళగిరి సమీపంలోని గొల్లపల్లిలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం గొల్లపల్లి బస్టాప్ వద్ద నడిచి వెళుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు ఘటనా పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.


బైక్ నుంచి పడి మహిళ మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనం నుంచి కింద పడిన మహిళ తీవ్ర గాయాలేర్పడి ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన కావేరి పట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు కావేరిపట్టణంకు చెందిన రాజన్ భార్య కల్పన (50) అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తుంది. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని మిత్రుని బైక్ మీద వెళ్తుండగా ఆమె అదుపు తప్పి క్రిందపడింది. తీవ్ర గాయాలేర్పడి అక్కడికక్కడే చనిపోయింది. కావేరిపట్టణం పోలీసులు ఆమె శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పోకిరీపై పోక్సో కేసు

హోసూరు: ఆలయానికెళ్లిన అమ్మాయిని ప్రేమించాలని ఒత్తిడి చేసిన ఆకతాయిపై హోసూరు మహిళా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల మేరకు హోసూరుకు చెందిన 17 ఏళ్ల అమ్మాయి బిఎస్సీ చదువుతోంది. శనివారం సాయంత్రం హోసూరు తేరుపేటలోని శ్రీ చంద్ర చూడేశ్వరస్వామి కొండపైకెళ్లింది. ఈ సమయంలో అక్కడే ఉన్న డెంకణీకోట సమీపంలోని గుడిసెనత్తం గ్రామానికి చెందిన సుమన్ (19) ప్రేమించాలని ఆమెను పట్టుబట్టాడు. ఇది తెలిసి అమ్మాయి తల్లి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయగా సుమన్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

ఐస్‌క్రీం షెడ్‌లో అగ్ని ప్రమాదం



ఐస్‌క్రీం షెడ్‌లో చెలరేగుతున్న మంటలు

హోసూరు: హోసూరులోని ఐస్‌క్రీం తయారీ షెడ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ఆవులపల్లి హడ్కో ప్రాంతానికి చెందిన క్రిష్ణమూర్తి (65). గత నలభై ఏళ్లుగా ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ పరిశ్రమలో 10 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. శనివారం రాత్రి కార్మికులు షెడ్‌కు తాళం వేసి ఇంటికెళ్లిపోయారు. ఆదివారం వేకువజాము షెడ్‌లో మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది చేరుకుని ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు 15 ఐస్‌క్రీం పెట్టెలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు.







అలరించిన శునకాల ప్రదర్శన

మైసూరు: మైసూరు దసరా వేడుకల్లో భాగంగా జేకే మైదానంలో ఆదివారం రైతు దసరా ఉపసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శునకాలు, పెంపుడు జంతువుల షో అబ్బురపరచింది. ఈ ప్రదర్శనను మంత్రి వెంకటేశ్ ప్రారంభించారు. వందలాది మంది తమ పెంపుడు కుక్కలను ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈ కుక్కలను ఫొటోలు తీసుకునేందుకు పోటీలు పడ్డారు. విజేతలుగా నిలిచిన కుక్కలకు బహుమానాలు కూడా అందించారు. అలాగే కుందేళ్లు, పిల్లులు వంటి జంతువులు కూడా ఆకట్టుకున్నాయి.

మహిషాసుర మర్దినిగా బనశంకరిదేవి



మహిషాసురమర్దిని అలంకరణలో బనశంకరి దేవి



దుర్గాదేవి అలంకరణలో శాకంబరీదేవి



దుర్గాదేవి అలంకరణలో యలహంక చౌడేశ్వరీదేవి




వేంకటేశ్వరస్వామి అలంకరణలో మహేశ్వరమ్మ



బనశంకరి అమ్మవారికి దుర్గాదీపంతో వందనం

బనశంకరి: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకపుర రోడ్డు ప్రధాన రహదారిలోని కరియప్పరోడ్డులో వెలసిన బనశంకరి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనంకరీదేవిని మహిషాసుర మర్దినిగా, శాకంబరి దేవిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి దుర్గాదీప నమస్కారం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధనచేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, ఈఓ లక్ష్మీ, సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, సమితి సభ్యులు హనుమంతరాయప్ప, వెంకటేశ్, చంద్రు పాల్గొన్నారు. విద్యారణ్యపుర దుర్గాపరమేశ్వరికి, రాజరాజేశ్వరి నగర కెంచనహళ్లిలో రాజరాజేశ్వరిదేవికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. గవిపురం బండిమహంకాళి ఆలయం, హలసూరు దుర్గాదేవి, మహాలక్ష్మీపురం ఆలయంలో పూజలు జరిగాయి. యలహంక చౌడేశ్వరీదేవిని దుర్గాదేవిగా అలంకరించారు. మహేశ్వరమ్మ అమ్మవారిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు.



బనశంకరి దేవి ఆలయం వద్ద భక్తుల రద్దీ

క్లుప్తంగా...

83 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 83 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో చీపురుపల్లి ఆర్డీవో ఎం.అప్పారావును శ్రీకాకుళం జిల్లా పరిషత్ సీఈవోగా, బొబ్బిలి ఆర్డీవో శేష శైలజను విశాఖ కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేసింది. మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న వి.మదన్‌మోహన రావును బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎంగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ టి.సవరమ్మను సీసీఎల్ఏ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా బదిలీ చేసింది.

1న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎన్నిక

నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నిక నవంబర్ 1న నిర్వహించనున్నారు. చైర్మన్ ఎన్నికల్లో పాల్గొననున్న సభ్యులకు సంబంధించిన వివరాలతో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే ఎండీ రుహుల్లా(ఎమ్మెల్సీ), హాఫీజ్‌ఖాన్ (ఎమ్మెల్యే), షేక్ ఖాజా (ముతవల్లీ) కోటాలో సభ్యులుగా నేరుగా ఎన్నికయ్యారు. ఖాదర్ బాషా, మునీర్ హుస్సేన్, షరీఫ్ అహ్మద్ ఖాద్రీ, షిరీన్ బేగం, భరఖత్ అలీ, జె.నజీర్ బాషా, పటాన్ షఫీ అహ్మద్, హసీనా బేగంలను ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరిలో నామినేట్ అయిన అధికారులు మినహా మిగిలిన వారిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్



తిరుపతి గాంధీరోడ్: ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ సూచించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జన్మదినం సందర్భంగా ఆదివారం తిరుపతిలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో గిరిరాజ్‌సింగ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సహకారమున్న ప్రతి పథకంపైనా ప్రధాని మోదీ ఫొటో ముద్రించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంటే.. ఏపీలోని ప్రభుత్వం పేరు మార్చుకుని ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ప్రచార ఆర్భాటం తగ్గించుకోవాలని సూచించారు. శ్రీజ పాల కంపెనీకి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించట్లేదని ఆరోపించారు. శ్రీజ పాల కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తే 2 లక్షల మంది మహిళలు ఆర్థిక పురోగతిని సాధిస్తారని చెప్పారు. పీఎం ఆవాస్ యోజన, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లలో 50 శాతం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు.

దమ్ముంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడు!

పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సవాల్



శ్రీరంగరాజపురం: పేదవారు ఉన్నత విద్య అభ్యసించకూడదా పవన్? పెత్తందారుల పిల్లలే ఇంగ్లిష్ మీడియం చదవాలా? అంటూ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ధ్వజమెత్తారు. ఆదివారం చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా అందరిదీ పెత్తందారి మనస్తత్వమేనన్నారు. వీరందరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంపై మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మన పిల్లలు ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించే స్థాయికి వెళ్లారని, ఇంటర్ ఫెయిల్ అయిన పవన్ చదువు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ నీకు దమ్ముంటే ప్రభుత్వ స్కూల్ విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడాలని సవాల్ విసిరారు. టీడీపీకి భవిష్యత్ లేదని, పవన్, లోకేశ్‌కు గ్యారెంటీ లేదని అన్నారు.

నేడు టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం సోమవారం రాజమహేంద్రవరం మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిపి మొత్తం 14 మంది ఈ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం జరిగే హాలును టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం పరిశీలించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు టీడీపీ, జనసేన కలిసి పని చేస్తాయని, అందుకు అవసరమైన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చిస్తారని వారు తెలిపారు.

బోధనాస్పత్రులపై స్పెషల్ ఫోకస్

కార్పొరేట్ హాస్పిటల్స్ తరహాలో నాన్‌–క్లినికల్ అంశాల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ

- 11 పాత బోధనాస్పత్రులకు జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులు
- ఒక్కో ఆస్పత్రిలో ముగ్గురు ఏడీలు, మరికొందరు సిబ్బంది కూడా...
- ఇటీవల కొత్తగా 99 పోస్టులను సృష్టించిన ప్రభుత్వం
- సూపరింటెండెంట్‌పై తగ్గనున్న పనిభారం
- రోగుల సంరక్షణపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టేందుకు అవకాశం



సాక్షి, అమరావతి: 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చివేసిన ప్రభుత్వం... రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రుల నిర్వహణపై కూడా దృష్టి పెట్టింది. కార్పొరేట్ హాస్పిటల్స్ తరహాలో ప్రభుత్వాస్పత్రుల్లోనూ నిర్వహణ బాధ్యతలను చూసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 11 పాత బోధనాస్పత్రులకు ప్రత్యేకంగా జాయింట్ డైరెక్టర్(జేడీ) స్థాయి అధికారులను వైద్యశాఖ నియమించనుంది. వీరికి సహాయకులుగా మరో 88 మందిని నియమిస్తుంది. ఈ మేరకు కొత్తగా 99 పోస్టులను ఇటీవల సృష్టించింది.

ఎవరి బాధ్యతలు ఏమిటంటే...

- ▲ సాధారణంగా కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యపరమైన (క్లినికల్) అంశాలను మెడికల్ సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తారు. నాన్‌–క్లినికల్ (ఆస్పత్రి నిర్వహణకు సంబంధించిన అంశాలు) వ్యవహారాలపర్యవేక్షణకు సీఈవో/జీఎం ఆపరేషన్స్/అడ్మినిస్ట్రేటర్ హోదాలో మరొకరు ఉంటారు.
- ▲ ఇప్పటి వరకు ప్రభుత్వాస్పత్రుల్లో క్లినికల్, నాన్ క్లినికల్ రెండింటి పర్యవేక్షణ బాధ్యత సూపరింటెండెంట్ చూస్తున్నారు.
- ▲ ఇకపై ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో మెడికల్ సూపరింటెండెంట్‌లను వైద్యపరమైన వ్యవహారాలకు పరిమితం చేస్తారు.
- ▲ పరిపాలన కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. జేడీ నేతృత్వంలో ముగ్గురు ఏడీలతో పాటు అసిస్టెంట్ ఇంజినీర్, ఫెసిలిటీ మేనేజర్, సిస్టం అడ్మినిస్ట్రేటర్, డేటా అనలిస్ట్ వంటి సహాయక సిబ్బంది పనిచేస్తారు. వీరు ఆస్పత్రిలో భవనాల నిర్వహణ, సెక్యూరిటీ, శానిటేషన్, డైట్, ఉద్యోగుల హాజరు, జీతభత్యాలు, ఇతర నాన్ క్లినికల్ అంశాలను చూస్తారు.
- ▲ సూపరింటెండెంట్‌లకు ఇప్పటివరకు ఉన్న ఆస్పత్రి నిర్వహణ భారం తొలగిపోయి రోగుల సంరక్షణకు ఎక్కువ సమయాన్ని కేటాయించే అవకాశం లభిస్తుంది. వైద్యుల హాజరు, ఐపీ, ఓపీ, సర్జరీ సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతారు.

ఎన్ఏబీహెచ్ గుర్తింపే లక్ష్యంగా...

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రమాణాలు పెంచి మంచి వాతావరణంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఈ క్రమంలో మన ఆస్పత్రులకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్, హెల్త్‌కేర్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు పొందడమే లక్ష్యంగా వైద్యశాఖ అడుగులు వేస్తోంది. ఈ దిశగా చేపట్టిన చర్యల ఫలితంగా ఇప్పటికే విశాఖపట్నంలోని ఛాతీ, మెంటల్ కేర్ ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించింది. మరోవైపు రాష్ట్రంలోని అత్యధిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌–క్వాష్) గుర్తింపు పొందాయి. ఎన్‌–క్వాష్ గుర్తింపులో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఇదే తరహాలో మిగిలిన ఆస్పత్రులను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించడానికి నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొస్తున్నారు.

పండుగపై పడగ!

- రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసానికి టీడీపీ కుట్రలు
- నకిలీ లేఖ, ఆందోళనలతో అల్లర్లకు పథకం
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని హెచ్చరిక

సాక్షి, అమరావతి: అంతటా పండుగ సంతోషాలు, సంబరాలు వెల్లివిరుస్తున్న శుభవేళ ప్రతిపక్ష టీడీపీ మాత్రం వికృత రాజకీయాలకు తెగబడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, అలజడులు, విధ్వంసాలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతోంది. స్కిల్ కుంభకోణంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి రాశారంటూ ఓ నకిలీ లేఖను ప్రచారంలోకి తేవడంతోపాటు సోమవారం సాయంత్రం 'జగనాసుర దహనం' అనే కార్యక్రమానికి నారా లోకేశ్ పిలుపునివ్వడం ద్వారా పార్టీ శ్రేణులు, రౌడీమూకలను అల్లర్లకు పురిగొల్పుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి దిష్టి బొమ్మలను దహనం చేయడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, దుకాణాలపై దాడులు, లూటీలు చేయాలన్నది టీడీపీ లోపాయికారీ కుట్రగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా వీధుల్లోకి వచ్చి సామాన్యులను భయభ్రాంతులకు గురిచేసి అల్లకల్లోలం సృష్టించాలని పథకం వేశారు. మత కలహాలు, వర్గ వైషమ్యాలు సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. విపక్షం కుట్ర రాజకీయాల పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన 'నారా'సురుడు చంద్రబాబే అసలైన నరకాసురుడని వ్యాఖ్యానిస్తున్నారు. అటువంటి వ్యక్తి జైల్లో ఉండటమే ప్రజలకు అసలైన దసరా అని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి.

పోలీసు యంత్రాంగం అప్రమత్తం

తాజా పరిణామాలతో పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైంది. ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రజలు సామరస్య పూర్వకంగా ఆనందోత్సాహాలతో దసరా పండుగ నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

చంద్రలేఖలో ఇంద్రజాలం!

▶ మొదటి పేజీ తరువాయి

కేసును కొట్టి వేయాలని మాత్రమే వాదిస్తున్నారు. ఈ కేసులోనూ తనకు అలవాటైన రీతిలోనే న్యాయ పరీక్షను ఎదుర్కోకుండా సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకుని తప్పించుకోవడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఒకవైపు తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తూ మరోవైపు న్యాయం ఆలస్యం కావచ్చుగానీ అంతిమంగా గెలుస్తుందంటూ ఆదివారం ఓ బహిరంగ లేఖలో చంద్రబాబు అడ్డగోలుగా దబాయించారు. అయితే జైలు నుంచి అలాంటి లేఖ ఏదీ తాము జారీ చేయలేదని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్.రాహుల్ స్పష్టం చేశారు. అంటే.. ఆ లేఖే నకిలీదని తేటతెల్లమవుతోంది. జైలు నుంచి ప్రజలకు తన తండ్రి రాశారనే పేరుతో లోకేశ్ బహిరంగ లేఖను విడుదల చేసి నాటకమాడినట్లు స్పష్టమవుతోంది. ఇక ఆ లేఖలో రాసినవన్నీ పచ్చి అబద్ధాలే. అంతా కల్పితాలతో దాని విడుదల చేశారు.

శ్రేణుల నుంచి కనీస స్పందన లేకపోవడంతో..

స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో ప్రభుత్వ ఖజానా నుంచి అడ్డంగా దోచేసి దొరికిపోయిన కేసులో చంద్రబాబును ఏసీబీ కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తమ అధినేతను అరెస్టు చేశారంటూ టీడీపీ నేతలు ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా ప్రజల నుంచి సానుభూతి కాదు కదా కనీస స్పందన కూడా లభించడం లేదు. చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా మొహం చాటేయడంతో దాన్ని కప్పిపుచ్చుకునేందుకు శనివారం ములాఖత్‌లో చంద్రబాబు సూచనల మేరకు పండుగ పూట పచ్చి అసత్యాలు వల్లె వేస్తూ బహిరంగ లేఖను లోకేశ్ విడుదల చేసి డ్రామా ఆడినట్లు స్పష్టమవుతోంది. తన సామాజిక వర్గంలో కొందరు మినహా ఎవరూ స్పందించకపోయినా ఉవ్వెత్తున ప్రజా చైతన్యం ఎగిసిపడుతున్నట్లు ఆ లేఖలో చిత్రీకరించడం గమనార్హం.

అభివృద్ధి ఎక్కడ.. అంతా విధ్వంసమే..:

తాను జైల్లో ఉన్నా అభివృద్ధి రూపంలో ప్రతి చోటా ఉంటానని, సంక్షేమం పేరు వినిపించిన ప్రతి సారీ తానే గుర్తొస్తానని చంద్రబాబు లేఖలో అతిశయోక్తులు వల్లె వేశారు. విభజిత రాష్ట్రంలో చంద్రబాబు దోపిడీ మినహా సంక్షేమం ఎక్కడా కానరాదు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంలా మార్చుకుని విధ్వంసం సృష్టించారని సాక్షాత్తూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. అమరావతి భూకుంభకోణం నుంచి స్కిల్ స్కామ్ వరకూ అనేక అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు ఖజానాను కొల్లగొట్టి పేదల నోట్లో మట్టి కొట్టారన్నది యదార్థం. అందుకే రిమాండ్‌పై చంద్రబాబు జైల్లో ఉన్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

దొరికిపోయిన దొంగ.. దేశ భక్తుడిలా సూక్తులా?

తన రాజకీయ అరంగేట్రం నుంచే చంద్రబాబు అక్రమాలకు తెరతీశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని చేజిక్కించుకున్నాక అవి పరాకాష్టకు చేరాయి. 1995 నుంచి 2004 వరకూ చంద్రబాబు పాల్పడ్డ అక్రమాలు, ఆయన అక్రమాస్తులపై విచారణ జరిపించాలంటూ ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతితోపాటు ప్రస్తుతం టీడీపీ పంచన చేరిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ వరకూ కోర్టుల్లో 17 కేసులు వేశారు. ఆ కేసుల్లో విచారణ ఎదుర్కొంటే దొరికిపోతాననే భయంతో స్టేలు తెచ్చుకుని చంద్రబాబు బతుకుతున్నారు. చివరకు స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయారు. అలాంటి వ్యక్తి దేశభక్తుడిలా అంతిమంగా గెలిచేది న్యాయమేనంటూ నమ్మబలకటాన్ని రాజకీయ పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు.

అనారోగ్య కారణాలతో మరణిస్తే పరామర్శా?

రాష్ట్రంలో అనారోగ్య కారణాలతో మరణించిన వారిని సైతం వదిలిపెట్టకుండా తన అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందినట్లుగా చంద్రబాబు చిత్రీకరించుకోవటాన్ని సామాజికవేత్తలు తప్పుబడుతున్నారు. ఆ కుటుంబాలను పరామర్శించేందుకు, అరాచక పాలనను ఎండగట్టడానికి 'నిజం గెలవాలి' అంటూ తన భార్య భువనేశ్వరి ప్రజల ముందుకు వస్తోందని చంద్రబాబు పేరుతో విడుదలైన లేఖలో పేర్కొన్నారు. తాను జైల్లో ఉంటున్నా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో దాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ డ్రామాకు తెరతీశారన్నది విశదమవుతోంది.

మరో మేనిఫెస్టో.. దసరా వేషమే!

- చంద్రబాబుకు మంత్రి అంబటి బహిరంగ లేఖ
- 2014లో మీరిచ్చిన 650 వాగ్దానాలకే దిక్కు లేదు
- మీ పేరు చెబితే నాలుగు పథకాలైనా గుర్తొస్తాయా?
- కనీసం మలి సంధ్యలోనూ నిజాలను ఒప్పుకోరా?
- జైలులో లేనంటున్న మీరు న్యాయ పోరాటం ఎందుకు చేస్తున్నట్లు?
- మీపై మీకు నమ్మకం ఉంటే సీబీఐ విచారణకు సిద్ధమేనా?
- మీ ఉద్దేశంలో ప్రజలంటే మెట్రోలో నల్ల చొక్కాలేసుకున్న ఆ నలుగురేనా?

సాక్షి, అమరావతి/నగరంపాలెం: మాజీ సీఎం చంద్రబాబు అవినీతి కేసులో జైలుకెళ్లి 44 రోజులైనా పవన్‌కళ్యాణ్ మినహా ఎవరూ పట్టించుకోకపోవడంతో టీడీపీ నేతలు సానుభూతి డ్రామాలు మొదలుపెట్టారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. చంద్రబాబు తరఫు న్యాయవాదులు కోర్టుల్లో లాయర్లపై దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. 'నిజం గెలవాలి' అంటున్న నారా భువనేశ్వరి న్యాయస్థానాల్లో సత్యం గెలవడం వల్లే చంద్రబాబు జైలులో ఉన్నారన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. స్థాయికి మించి ఎక్కువగా మాట్లాడవద్దని లోకేశ్‌కు హితవు పలికారు. చంద్రబాబు జైలుకెళ్లడం గురించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎందుకో విపరీతంగా ఆవేశపడుతున్నారని వ్యాఖ్యానించారు. తాను జైలులో కాకుండా ప్రజల గుండెల్లో ఉన్నానంటూ



లేఖ రాసిన మాజీ సీఎం చంద్రబాబు ఆయన పేరు చెబితే గుర్తొచ్చే నాలుగు పథకాల పేర్లను వెల్లడించాలని సూచించారు. తన కోసం ఉవ్వెత్తున ప్రజా చైతన్యం ఎగసిపడుతోందని చెప్పుకుంటున్న చంద్రబాబు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద వర్గాలు కూడా ప్రజలే అని గుర్తించాలన్నారు. 'మీ దుష్ట బృందంలో అందరికీ వయసు పెరిగినా జీవన సంధ్యా సమయంలో కూడా నిజాన్ని ఒప్పుకునే అంతరాత్మ మాత్రం ఏ ఒక్కరికీ లేదు' అని చంద్రబాబుకు చురకలంటించారు. ఈమేరకు అంబటి ఆదివారం గుంటూరులో మీడియాతో మాట్లాడటంతోపాటు చంద్రబాబునుద్దేశించి రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు.

- ▲ 45 రోజుల జైలు జీవితం తర్వాతైనా నాలుగైదు నిజాలు చెబుతారేమో అన్న ఆశను నిరాశగా మారుస్తూ మీరు ఉత్తరం రాశారు. జైలు నుంచి ఈ లేఖను ఎలా బయటకు పంపారన్న టెక్నికల్ డీటెయిల్స్‌లోకి, 17(ఏ) ప్రొటోకాల్స్‌లోకి నేను వెళ్లటం లేదు. మీ పేరిట టీడీపీనే ఆ ఉత్తరం ఇచ్చింది కాబట్టి దాన్ని చదివిన తరవాత మీకు బహిరంగ లేఖ రాస్తున్నా. ఇందులో కొన్ని ప్రశ్నలను అడుగుతున్నా.
- ▲ లేఖలో మొదటి వాక్యమే మీరు జైలులో లేనని రాశారు. కాబట్టి దయచేసి మీ న్యాయ పోరాటం మొత్తాన్ని ఆపేయండి. క్వాష్ పిటిషన్లు, బెయిల్ పిటిషన్లను ఉపసంహరించుకోండి.
- ▲ మీ రాజకీయ జీవితం అంతా తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సాగిందన్నారు. తెలుగు ప్రజలు అంటే మీ ఉద్దేశంలో ఎవరు? హైదరాబాద్ మెట్రోలో నల్ల చొక్కాలు వేసుకున్న ఆ నలుగురా? అమెరికా, బ్రిటన్‌లో మీ దోపిడీ సొమ్ములతో స్థిరపడిన మీ బంధుగణాలా? ఎన్టీఆర్‌కు మీరు వెన్నుపోటు పొడవటంలో సహకరించిన మీ మీడియా మిత్రులా? బీజేపీలో ఉన్న మీ బంధువులా? కాంగ్రెస్‌లోకి పంపించిన మీ మనుషులా? కొద్దిమంది వామపక్షాల నాయకుల్లో ప్రవహిస్తున్న మీ పసుపు రక్తమా? తెలుగు ప్రజలంటే ఎవరు అన్నది దయచేసి తెలియజేయండి.
- ▲ దసరాకి పూర్తి మేనిఫెస్టో విడుదల చేయలేకపోయానంటూ మరో భారీ డైలాగు వదిలారు. 2014 మేనిఫెస్టోలో మీరు ఇచ్చిన 650 వాగ్దానాలకు, అధికారంలోకి వచ్చాక మీరు చేసిన మొదటి సంతకాలకు ఏనాడూ దిక్కూమొక్కూ లేదు. కాబట్టే ప్రజలు మీరు కొనుగోలు చేసిన ఎమ్మెల్యేల సంఖ్యకు తగినట్లే మీ పార్టీని పరిమితం చేశారు. ఇప్పుడు మీరు మరో మేనిఫెస్టో విడుదల చేస్తే ఎంత? చేయకపోతే ఎంత?
- ▲ ఓటమి భయంతో మిమ్మల్ని జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు దూరం చేయాలని ఎవరో అనుకుంటున్నారని లేఖలో ఆరోపణలు చేశారు. ఒక అవినీతిపరుడిని కేంద్ర ఐటీ శాఖ పట్టుకుని షోకాజ్ నోటీసు ఇచ్చింది. అది మీరే. స్కిల్ స్కామ్‌లో నలుగురిని ఈడీ అరెస్టు చేసింది. దానికి కర్త, కర్మ, క్రియ మీరే. స్కిల్ స్కామ్‌లో కోర్టు మీకు రిమాండ్ విధించింది. దాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టు సమర్థించాయి. మరి ప్రజల నుంచి మిమ్మల్ని ఎవరో దూరం చేయటం ఏమిటి? 45 ఏళ్లు దొరక్కుండా తప్పించుకున్నాననే మీ ఆత్మవిశ్వాసం, వ్యవస్థల మేనేజ్‌మెంట్ ఈసారి మీకు సాధ్యం కాలేదు. కాబట్టి దొరికిపోయిన దొంగ దేశభక్తుడ్ని అని, ప్రజాసేవకుడ్ని అని భారీ డైలాగులు చెప్పటం బాగోదు.
- ▲ స్కిల్ స్కామ్‌లో సీబీఐ విచారణ జరగాలని ఎవరో పిటిషన్ వేస్తే మీ ప్యాంట్లు ఎందుకు తడుస్తున్నాయి? రాష్ట్ర ప్రభుత్వ విచారణ కక్ష సాధింపు అని మీరు అంటున్నారు. అదే నిజమైతే.. కేంద్ర ప్రభుత్వ సీబీఐ విచారణకు మీరు ఆహ్వానించాలి కదా? మరి, రెండింటికీ గుడ్డలు తడుస్తున్నాయంటే మీరు లేఖలో రాసిన డైలాగులన్నీ ఆత్మవంచనతో కూడిన అబద్ధాలే కదా?
- ▲ సంకెళ్లు మీ సంకల్పాన్ని బంధించలేవని, జైలు గోడలు మీ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీయలేవని అంటున్నారు. మీమీద మీకు అంత నమ్మకం, ధైర్యం ఉంటే మీ ఆదాయం ఎంత? మీ ఆస్తులు ఎంత? అనే అంశంపై నేను పిటిషన్ వేస్తా. కోర్టుల్లో స్టే కోసం వెళ్లకుండా సీబీఐ విచారణకు సిద్ధపడతారా?
- ▲ ఈ రాష్ట్రంలో ఉండని మీరు, మీ పుత్రుడు, మీ దత్తపుత్రుడు కేవలం గెస్టులు మాత్రమే కదా? ఇది మీకు వీకెండ్ రిసార్ట్ మాత్రమే కదా?
- ▲ నా బలం జనమే అని చెబుతున్న మీరు ఈ మధ్య జగన్ గారి స్పీచ్‌లు బాగా చూస్తున్నారని అర్థమైంది. సీఎం జగన్ పొత్తులను నమ్ముకోవట్లేదు. ఇంటింటికీ తాను చేసిన అభివృద్ధిని, రూ.2.38 లక్షల కోట్ల డీబీటీని, ఇచ్చిన 31 లక్షల ఇళ్ల పట్టాలను, కడుతున్న 22 లక్షల ఇళ్లను, గ్రామ గ్రామంలో తెచ్చిన మార్పులను చూపించి మీరే నా బలం అని ప్రజలకు చెబుతున్నారు.
- ▲ చెడు గెలిచినా నిలవదని, మంచి తాత్కాలికంగా ఓడినా కాల పరీక్షలో గెలుస్తుందని మీరు అంటున్నారు. సీఎం జగన్ విషయంలో జరిగింది అదే కదా! ఆ చెడు చేసింది మీరే కదా?
- ▲ ఎప్పుడూ బయటకు రాని మీ భార్యను ప్రజల్లోకి పంపటం ఎందుకు? వెన్నుపోటు పొడిచినప్పుడే కన్నతండ్రి పక్షాన కాకుండా మీవైపు నిలిచిన ఆమె ఎన్టీఆర్ వారసురాలు ఎలా అవుతుంది? ఎన్టీఆర్‌ను మొదట మీరే పొడిచారన్న నిజం చెప్పి ఆ తర్వాత ఆవిడ నిజం గెలవాలి అంటూ నినాదం చేయాలి.

మీ నాన్న జైలులో ఉంటే.. ఆ ఏడుపేంటి లోకేశ్!

వైఎస్సార్‌సీపీ కోస్తా ఆంధ్ర దళిత ముఖ్య నేతల సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు భయమంటే ఏమిటో చూపిస్తానని బీరాలు పలికిన లోకేశ్ పిరికిపందలా మారాడని ఎంపీ నందిగం సురేష్ ఎద్దేవా చేశారు. అతని తండ్రి జైలులో ఉంటే పోరాటం చేయాల్సింది పోయి.. మీడియా ముందు లోకేశ్ ఏడవడం ఏమిటని ప్రశ్నించారు. ఆదివారం ఏలూరులో కోస్తాంధ్ర జిల్లాల దళిత ముఖ్యనేతలతో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్ర సన్నాహక సమావేశం వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ సురేష్ మాట్లాడుతూ చంద్రబాబును న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిస్తే.. లోకేశ్ ఢిల్లీ వెళ్లి పనికిమాలిన రఘురామకృష్ణరాజు ఇంట్లో కూర్చుని ఏం చేశాడని ప్రశ్నించారు. చంద్రబాబు అండ్ కో దళిత జాతిలో చీకట్లు నింపాలని చూసిన దుష్టులు కాగా.. సామాన్యులను సైతం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా చేస్తూ రాజ్యాధికారం దిశగా అడుగులు వేయిస్తున్న ఘనుడు సీఎం జగన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, దళిత వర్గాల పిల్లలు ఇంగ్లిష్‌ను యూట్యూబ్‌లో చూసి నేర్చుకోవాలని పవన్ కళ్యాణ్ చెప్పటం సిగ్గుచేటన్నారు. ఆయనకు యూట్యూబ్ తప్ప ఏం తెలుసంటూ ఎద్దేవా చేశారు.

దళితుల కోసం చేసిన ఒక్క మంచైనా చెప్పగలవా!

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు దళితులకు చేసిన ఒక్క మంచిపని చెప్పగలరా అని నిలదీశారు. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు దళిత మహిళను కాలుతో తన్ని అమానుషంగా ప్రవర్తించాడని, మరోచోట దళిత మహిళను వివస్త్రను చేశారని, ఎంతోమంది దళితులను రాక్షసంగా చంపించిన దుష్టుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ అవినీతి కేసుల్లో చంద్రబాబు జైలుకెళితే ఆయన కోసం జనం గుండెలు ఆగి చనిపోయారనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఎమ్మెల్యేలు రక్షణ నిధి, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీలు ఎం.అరుణ్‌కుమార్, పండుల రవీంద్రబాబు, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

నేను జైల్లో లేను.. అందరి గుండెల్లో ఉన్నా

జైలు నుంచి చంద్రబాబు బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: 'నేను ప్రస్తుతం ప్రజల మధ్య లేకపోయినా అభివృద్ధి రూపంలో ప్రతిచోటా కనిపిస్తా. సంక్షేమం పేరు వినిపించిన ప్రతిసారి నా పేరే తలుస్తారు. ప్రజల నుంచి ఒక్క క్షణం కూడా నన్ను దూరం చేయలేరు. నేను జైల్లో లేను.. ప్రజల హృదయాల్లో ఉన్నా...' అని ప్రతిపక్ష నేత చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాజమహేంద్రవరం జైలు నుంచి ప్రజలకు బహిరంగ లేఖ రాశారంటూ ఆదివారం టీడీపీ కార్యాలయం ఒక లేఖ విడుదల చేసింది. చంద్రబాబు రాసిన లేఖను ములాఖత్‌లో భాగంగా కలిసిన కుటుంబ సభ్యులకు అందించారని పేర్కొంది. 'జైలు గోడల మధ్య కూర్చుని ఉంటే 45 ఏళ్ల ప్రజాజీవితం నా కళ్ల ముందు కదలాడుతోంది. ఓటమి భయంతో నన్ను జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు దూరం చేశామనుకుంటున్నారు. కుట్రలతో నాపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారు. నేను నమ్మిన విలువలు, విశ్వసనీయతను ఎన్నడూ చెరిపేయలేరు. ఈ చీకట్లు తాత్కాలికమే. జైలు గోడలు నా ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీయలేవు. ఈ దసరాకి పూర్తిస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తానని రాజమహేంద్రవరం మహానాడులో ప్రకటించాను. అదే రాజమహేంద్రవరం జైలులో నన్ను ఖైదు చేశారు. త్వరలో బయటకు వచ్చి పూర్తిస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తా. నా అరెస్టుతో తల్లడిల్లి మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు నా భార్య భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో ప్రజల్లోకి వస్తుంది. మంచి తాత్కాలికంగా ఓడినట్లు కనిపించినా, కాలపరీక్షలో గెలిచి తీరుతుంది. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు..' అని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.

చంద్రబాబు బహిరంగ లేఖ అనేది తప్పుడు ప్రచారం

ఖండించిన జైళ్ల శాఖ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారంటూ వస్తున్న వార్తలు, ఆ లేఖ పూర్తిగా అవాస్తవమని జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. ప్రజలకు చంద్రబాబు లేఖ రాశారంటూ ఆయన సంతకంతో ఉన్న లెటర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో జైళ్ల శాఖ అధికారులు స్పందించారు. దీనికి సంబంధించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముద్దాయిలు బయటకు లేఖలు విడుదల చేయాలంటే దానిని జైలు అధికారులు పూర్తిగా పరిశీలించి, జైలర్ ధ్రువీకరణతోపాటు కారాగారం ముద్రతో సంబంధిత కోర్టుల ద్వారా ప్రభుత్వ శాఖలకు, కుటుంబ సభ్యులకు పంపుతామని వివరించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ తప్పుడు ప్రచారమని తెలిపారు. ఆ లేఖకు, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి సంబంధం లేదని రాహుల్ స్పష్టం చేశారు.



విజయ దశమి ప్రత్యేకం

స్త్రీ శక్తి విజయం విజయ దశమి

ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ'అవుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభ పెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచననునుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మాణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్ఛితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగివేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి, శ్రీదేవితోనే యుద్ధం చేయ దలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పది మంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితో పాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్రపోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును, సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును, ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది – రవితేజ



● అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

''టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

''నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.



● 'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక

అప్పుడే అది జరుగుతుంది

– అల్లు అర్జున్



● దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

''పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే

– దర్శకుడు రాజ్ మదిరాజు



''ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లిదండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కల్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్టపడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా

– తల్లాడ వెంకన్న



● వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ–''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



● శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



● ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వి, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా – నిర్మాత సతీష్ కుమార్



''గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్థి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.

1 వన్డే ప్రపంచకప్ చరిత్రలో రెండుసార్లు మ్యాచ్‌లో ఐదు వికెట్ల చొప్పున తీసిన తొలి భారతీయ బౌలర్‌గా షమీ గుర్తింపు పొందాడు. 2019 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై కూడా షమీ (5/69) ఐదు వికెట్లు తీశాడు.

38 వన్డేల్లో తక్కువ ఇన్నింగ్స్‌లలో 2000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా శుబ్‌మన్ గిల్ నిలిచాడు. గిల్ 38 ఇన్నింగ్స్‌లో ఈ మైలు రాయిని దాటి దక్షిణాఫ్రికా ప్లేయర్ ఆమ్లా (40 ఇన్నింగ్స్) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు.

5 ఈ ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఐదు మ్యాచ్‌ల్లో ఐదు గురు వేర్వేరు ఆటగాళ్లకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు లభించాయి. ఆస్ట్రేలియాపై రాహుల్, అఫ్గానిస్తాన్‌పై రోహిత్ శర్మ, పాకిస్తాన్‌పై బుమ్రా, బంగ్లాదేశ్‌పై కోహ్లి, న్యూజిలాండ్‌పై షమీ ఈ పురస్కారాలు గెల్చుకున్నారు.



మిచెల్ (130)

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X అఫ్గానిస్తాన్
వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
న్యూజిలాండ్	5	4	1	8	1.481
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

షమీ 5 కోహ్లి 95 భారత్ 5

ప్రపంచకప్‌లో ఎదురులేని టీమిండియా ● వరుసగా ఐదో గెలుపు
న్యూజిలాండ్‌కు తొలి పరాజయం ● మెరిసిన షమీ, కోహ్లి



షమీ (5/54)

1, 2, 3, 4, 5... ఐదు మ్యాచ్‌లు మనవే! మైదానంలోకి దిగిన ప్రతీసారి విజయం మన జట్టునే వరించింది... ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల తర్వాత ఇప్పుడు న్యూజిలాండ్ లెక్క కూడా తేల్చేశాం ... ఐదుసార్లూ ప్రత్యర్థి లక్ష్యాన్ని నిర్దేశిస్తే అన్నింటినీ ఛేదించేశాం... ఫలితంగా వరల్డ్ కప్‌లో టీమిండియా తిరుగులేని ప్రదర్శనతో మళ్లీ పైచేయి సాధించింది... టోర్నీలో ఇప్పటి వరకు అజేయంగా ఉన్న భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన సమరంలో రోహిత్ బృందానికే గెలుపు దక్కింది.

ప్రపంచకప్‌లో 20 మ్యాచ్‌లు జరిగినా హోరాహోరీ సమరం కనిపించలేదనేవారికి ఈ మ్యాచ్ సమాధానం ఇచ్చింది. పలు మలుపులతో ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో 12 బంతుల ముందు భారత్ గట్టెక్కింది. 19/2 నుంచి 243/4కు చేరిన కివీస్‌ను 273కే పరిమితం చేసి భారత్ పైచేయి సాధించింది. గత మ్యాచ్‌లకు భిన్నంగా కొంత తడబడి ఆరు వికెట్లు చేజార్చుకున్నా... చివరకు ఫలితం దక్కింది. టోర్నీలో తాను ఆడిన తొలి మ్యాచ్‌లో షమీ 5 వికెట్లతో చెలరేగగా... కోహ్లి తనదైన శైలిలో నిలబడి పరుగులను వేటాడినా త్రుటిలో సెంచరీని చేజార్చుకున్నాడు.

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆడిన ఐదో మ్యాచ్‌లోనూ గెలుపు బావుటా ఎగరేసిన టీమిండియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. డరైల్ మిచెల్ (127 బంతుల్లో 130; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, రచిన్ రవీంద్ర (87 బంతుల్లో 75; 6 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ షమీ (5/54) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని నిలువరించాడు. అనంతరం భారత్ 48 ఓవర్లలో 6 వికెట్లకు 274 పరుగులు చేసి గెలిచింది. విరాట్ కోహ్లి (104 బంతుల్లో 95; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగగా, రోహిత్ శర్మ (40 బంతుల్లో 46; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (44 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో ఈనెల 29న లక్నోలో ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

భారీ భాగస్వామ్యం...

ఆరంభంలోనే న్యూజిలాండ్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కాన్వే (0)ను సిరాజ్ అవుట్ చేయగా, ఈ ప్రపంచకప్‌లో తాను వేసిన తొలి బంతికే యంగ్ (17)ను షమీ అవుట్ చేశాడు. అయితే రచిన్, మిచెల్ మూడో వికెట్ భాగస్వామ్యం కివీస్‌ను కోలుకునేలా చేసింది. మరో 25 ఓవర్లపాటు వీరిద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు టోర్నీలో ప్రత్యర్థి బ్యాటర్లందరినీ కట్టడి చేసిన కుల్దీప్ బౌలింగ్‌లో వీరు వేగంగా పరుగులు రాబట్టారు. 12 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రచిన్ ఇచ్చిన (షమీ బౌలింగ్‌లో) సునాయాస క్యాచ్‌ను జడేజా వదిలేశాడు! దీనిని రచిన్ సమర్థంగా వాడుకున్నాడు. ఈ క్రమంలో 56 బంతుల్లోనే అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఆ తర్వాత 60 బంతుల్లో మిచెల్ హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఆ తర్వాతా వీరిద్దరు ధాటిని ప్రదర్శించడంతో భాగస్వామ్యం 150 పరుగులు దాటింది. 69 పరుగుల వద్ద మిచెల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను బుమ్రా నేలపాలు చేశాడు. ఎట్టకేలకు రచిన్‌ను వెనక్కి పంపి షమీ ఈ జోడీని విడదీశాడు. లాథమ్ (5) విఫలం కాగా 100 బంతుల్లో మిచెల్ శతకాన్ని అందుకొని ప్రపంచకప్‌లో భారత్‌పై సెంచరీ సాధించిన తొలి న్యూజిలాండ్ ఆటగాడిగా నిలిచాడు. అయితే ఆ తర్వాత కివీస్ పతనం వేగంగా సాగింది. 243/4తో మెరుగైన స్థితిలో కనిపించిన జట్టు భారత బౌలర్ల ధాటికి చివరి 6 ఓవర్లలో 30 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది.

జడేజా అండగా...

భారత్‌కు ఛేదనలో రోహిత్ మరోసారి అద్భుత ఆరంభాన్ని అందించాడు. బౌల్ట్, హెన్రీల బౌలింగ్‌లో చెలరేగి ఫోర్లు, సిక్సర్లతో దూసుకుపోయాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (31 బంతుల్లో 26; 5 ఫోర్లు) అండగా నిలిచాడు. అయితే ఫెర్గూసన్ 7 బంతుల వ్యవధిలో వీరిద్దరిని వెనక్కి పంపాడు. ఈ దశలో కోహ్లి పట్టుదలగా నిలబడిన తీరు భారత్‌కు గెలుపు అవకాశాలు సృష్టించింది. శ్రేయస్ అయ్యర్ (29 బంతుల్లో 33; 6 ఫోర్లు), కేఎల్ రాహుల్ (35 బంతుల్లో 27; 3 ఫోర్లు)లతో పాటు చివర్లో జడేజాతో కోహ్లి మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పడం విశేషం. ఆరంభంలో నెమ్మదిగా ఆడి ఒకదశలో 47 బంతుల్లో 28 పరుగులే చేసిన కోహ్లి ఆ తర్వాత దూకుడు పెంచాడు. 60 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. సమన్వయ లోపంతో సూర్యకుమార్ (2) రనౌటైన తర్వాత కోహ్లి, టోర్నీలో తొలిసారి బ్యాటింగ్‌కు దిగిన జడేజా జత కలిశారు. ఆ సమయంలో 16.1 ఓవర్లలో మరో 83 పరుగులు చేయాల్సి ఉంది. ఈ స్థితిలో వీరిద్దరు ప్రశాంతంగా ఆడుతూ జట్టును లక్ష్యంవైపు నడిపించారు. కివీస్ బౌలర్లు అప్పుడప్పుడు కొన్ని మంచి బంతులతో ఒత్తిడి పెంచగలిగినా... భారత్ గెలుపును ఆపలేకపోయారు. పాండ్యా, శార్దుల్ స్థానాల్లో షమీ, సూర్యకుమార్ ఈ మ్యాచ్‌లో జట్టులోకి వచ్చారు.



కోహ్లి (95)

ఈసారి సెంచరీ దక్కలేదు!

మ్యాచ్‌లో ఒకవైపు భారత్ గెలుపు అవకాశాలు మెరుగవుతూ రాగా, మరోవైపు కోహ్లి సెంచరీ చేసి సచిన్‌ను సమం చేస్తాడా అనేది కూడా ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్‌లో రాహుల్‌లాగే ఈసారి జడేజా కూడా సహకరించడంతో ఆఖర్లో సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు కోహ్లి ఒక్కడే చేసి శతకానికి చేరువయ్యాడు. జట్టుకు 35, కోహ్లికి 25 పరుగులు అవసరమైనప్పుడు ఉత్కంఠ పెరిగింది. ఆపై ఈ సమీకరణం 19 పరుగులు, 18 పరుగులకు మారింది. అయితే బౌల్ట్ వేసిన 47వ ఓవర్లో కోహ్లి 6, 4 సహా 11 పరుగులు రాబట్టి 93కు చేరుకున్నాడు. ఇప్పుడు 7 పరుగులు కావాల్సి ఉండగా తొలి బంతికి కోహ్లి 2 పరుగులు తీశాడు. అయితే మూడో బంతిని భారీ సిక్సర్‌గా మలచి ముగించే ప్రయత్నంలో బౌండరీ లైన్‌కు చాలా ముందే క్యాచ్ ఇచ్చాడు. దాంతో అతను ప్రస్తుతానికి 48 సెంచరీల వద్దే నిలిచాడు.


జడేజా 39 నాటౌట్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) అయ్యర్ (బి) సిరాజ్ 0; యంగ్ (బి) షమీ 17; రచిన్ (సి) గిల్ (బి) షమీ 75; మిచెల్ (సి) కోహ్లి (బి) షమీ 130; లాథమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 5; ఫిలిప్స్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 23; చాప్‌మన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 6; సాన్‌ట్నర్ (బి) షమీ 1; హెన్రీ (బి) షమీ 0; ఫెర్గూసన్ (రనౌట్) 1; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 273. వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-178, 4-205, 5-243, 6-257, 7-260, 8-260, 9-273, 10-273. **బౌలింగ్:** బుమ్రా 10-1-45-1, సిరాజ్ 10-1- 45-1, షమీ 10-0-54-5, జడేజా 10-0- 48-0, కుల్దీప్ 10-0-73-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) ఫెర్గూసన్ 46; గిల్ (సి) మిచెల్ (బి) ఫెర్గూసన్ 26; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 95; అయ్యర్ (సి) కాన్వే (బి) బౌల్ట్ 33; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సాన్‌ట్నర్ 27; సూర్యకుమార్ (రనౌట్) 2; జడేజా (నాటౌట్) 39; షమీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (48 ఓవర్లలో 6 వికెట్లకు) 274. వికెట్ల పతనం:** 1-71, 2-76, 3-128, 4-182, 5-191, 6-269. **బౌలింగ్:** బౌల్ట్ 10-0-60-1, హెన్రీ 9-0-55-1, సాన్‌ట్నర్ 10-0-37-1, ఫెర్గూసన్ 8-0-63-2, రచిన్ 9-0-46-0, ఫిలిప్స్ 2-0-12-0.

రన్నరప్ రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో తొలి సింగిల్స్ టైటిల్ సాధించేందుకు హైదరాబాద్ యువతార భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఇంకొంత కాలం వేచి చూడాల్సి ఉంటుంది. బ్యాంకాక్‌లోని హువా హిన్‌లో ఆదివారం ముగిసిన ఐటీఎఫ్ డబ్ల్యూ15 టోర్నీలో రష్మిక రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఫైనల్లో ఆరో సీడ్ రష్మిక 2-6, 1-6తో రెండో సీడ్ అయూమి కోషిషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏకంగా పది డబుల్ ఫాల్ట్‌లు చేసి మూల్యం చెల్లించుకుంది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. రన్నరప్‌గా నిలిచిన రష్మికకు ట్రోఫీతోపాటు 1,470 డాలర్ల (రూ. లక్షా 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.




ఆకాశ్

రిత్విక్–అర్జున్ జోడీకి ఏటీపీ చాలెంజర్ టైటిల్



రిత్విక్ అర్జున్

సాక్షి, హైదరాబాద్: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సర్క్యూట్‌లో హైదరాబాద్ యువ క్రీడాకారుడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ కెరీర్‌లో తొలి చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఇటలీలో జరిగిన ఒల్బియా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో రిత్విక్ చౌదరీ-అర్జున్ ఖడే (భారత్) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో రిత్విక్-అర్జున్ ద్వయం 6-1, 6-3తో ఇవాన్ సబనోవ్-మాతెజ్ సబనోవ్ (సెర్బియా) జంటపై గెలిచింది. ఈ ఏడాది రిత్విక్-అర్జున్ జోడీ పోర్టో ఓపెన్, బ్రాన్‌స్వీగ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలలో ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సంతృప్తి పడ్డారు. మూడో ప్రయత్నంలో ఈ జంట తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తొలి రౌండ్‌లో రిత్విక్-అర్జున్ 6-3, 6-4తో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఆండ్రీ బెగెమన్ (జర్మనీ)లపై... క్వార్టర్ ఫైనల్లో 6-3, 6-4తో ఆండ్రూ హారిస్-జాన్ ప్యాట్రిక్ (ఆస్ట్రేలియా)లపై... సెమీఫైనల్లో 2-6, 7-6 (11/9), 10-7తో జెబవి-జెడెనెక్ (చెక్ రిపబ్లిక్)లపై గెలుపొందారు. టైటిల్ నెగ్గిన రిత్విక్-అర్జున్ జోడీకి 8,420 యూరోల (రూ. 7 లక్షల 41 వేలు) ప్రైజ్‌మనీ, 125 పాయింట్లు లభించాయి.

ఆసియా అండర్-15 విజేత ఆకాశ్

న్యూఢిల్లీ: పదేళ్ల విరామం తర్వాత ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అండర్-15 బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్‌కు టైటిల్ లభించింది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో అస్సాం టీనేజ్ షట్లర్ బొర్నిల్ ఆకాశ్ చాంగ్‌మయ్ చాంపియన్‌గా నిలిచాడు. అండర్-17 బాలికల ఫైనల్లో తన్వీ శర్మ రన్నరప్‌గా నిలిచింది. టైటిల్ పోరులో 13 ఏళ్ల ఆకాశ్ 21-19, 21-13తో ఫాన్ హాంగ్ (చైనా)ను ఓడించి స్వర్ణం గెలిచాడు. పదేళ్ల క్రితం 2013లో హైదరాబాద్ కుర్రాడు సిరిల్ వర్మ అండర్-15 ఆసియా జూనియర్ టైటిల్ గెలిచాడు. బాలికల అండర్-17 ఫైనల్లో తన్వీ శర్మ 17-21, 21- 11, 19-21తో కెత్ క్లింగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది.

ఆంధ్రను గెలిపించిన భరత్, అశ్విన్


శ్రీకర్ భరత్


అశ్విన్ హెబ్బర్


స్టీఫెన్

రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు ఖాతాలో వరుసగా రెండో విజయం చేరింది. గుజరాత్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ 19.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. ఆర్య దేశాయ్ (35 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీ చేశాడు. ఆంధ్ర బౌలర్లు స్టీఫెన్ (3/25), కావూరి సాయితేజ (2/45), కేవీ శశికాంత్ (2/22), మనీశ్ (2/47) గుజరాత్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం 166 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 17.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ కోన శ్రీకర్‌భరత్ (41 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అశ్విన్ హెబ్బర్ (36 బంతుల్లో 53; 7 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి తొలి వికెట్‌కు 10.2 ఓవర్లలో 87 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక విహారి (16 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రికీ భుయ్ (13 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆంధ్ర జట్టును విజయతీరానికి చేర్చారు. నేడు జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో మణిపూర్ జట్టుతో ఆంధ్ర ఆడుతుంది.

చాంపియన్ రామ్



ధార్వాడ్ (కర్ణాటక): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) పురుషుల టోర్నీలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రామ్‌కుమార్ 7-6 (7/5), 7-6 (8/6)తో భారత్‌కే చెందిన దిగ్విజయ్ ప్రతాప్ సింగ్‌ను ఓడించాడు. రామ్‌కుమార్‌కు 3,600 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 20 ఏటీపీ ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల డబుల్స్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ సురేశ్ కుమార్ (భారత్) ద్వయం 4-6, 3-6తో ప్రజ్వల్ దేవ్-నితిన్ (భారత్) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది.

హైదరాబాద్‌కు నాలుగో విజయం

రాణించిన తిలక్, రోహిత్, రవితేజ


తిలక్

జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు విజయపరంపర కొనసాగుతోంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మిజోరం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలిచి ఈ టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన మిజోరం సరిగ్గా 20 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. అగ్ని చోప్రా (16 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోసెఫ్ లాథన్‌కుమా (20 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హైదరాబాద్ బౌలర్లు రవితేజ (3/30), సీవీ మిలింద్ (2/18), చింతల రక్షణ్ రెడ్డి (2/20) మిజోరం జట్టును కట్టడి చేశారు. 115 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 15.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ రాయుడు (31 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ తిలక్ వర్మ (24 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్ ప్రస్తుతం 16 పాయింట్లతో ముంబై జట్టుతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. నేడు జరిగే తదుపరి మ్యాచ్‌లో బరోడా జట్టుతో హైదరాబాద్ తలపడుతుంది.

అఫ్గాన్ స్పిన్‌కు పాక్ ఎదురునిలిచేనా?

నేడు బాబర్ బృందానికి కీలకమైన మ్యాచ్ ● చెన్నైలో స్పిన్‌తో షాక్ ఇవ్వాలని అఫ్గాన్ కసరత్తు

చెన్నై: ప్రపంచకప్‌లో మళ్లీ గెలుపుబాట పట్టాలని పాకిస్తాన్... మరో సంచలనంపై కన్నేసిన అఫ్గానిస్తాన్ సమరానికి సై అంటున్నాయి. బాబర్ ఆజమ్ బృందంతో పోల్చితే ఏ రకంగా చూసినా కూడా అఫ్గాన్ కూనే! అయితే ఈ ప్రపంచకప్‌లో భారత్, ఇంగ్లండ్‌లపై 270 పైచిలుకు పరుగులు చేయడం, మ్యాచ్‌ను మలుపు తిప్పే స్పిన్నర్లు ఉండటంతో హష్మతుల్లా షాహిది జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీలు లేదు. ఇక పాక్ విషయానికే వస్తే వరుసగా భారత్, ఆస్ట్రేలియా చేతుల్లో ఓడిన జట్టుకు ఈ మ్యాచ్ కీలకం. గెలిస్తే సెమీఫైనల్ రేసులో నిలుస్తుంది. లేదంటే మరింత ఒత్తిడిలో కూరుకుపోతుంది. వరుసబెట్టి గెలవాల్సిన గడ్డు పరిస్థితులు ఎదురవొచ్చు. కాబట్టి అబ్దుల్లా షఫీక్, ఇమాముల్‌లతో కూడిన టాపార్డర్, రిజ్వాన్, సౌద్ షకీల్, ఇఫ్తికార్‌లతో ఉన్న మిడిలార్డర్ బాధ్యతగా ఆడాలి. బౌలింగ్‌లో షాహిన్ అఫ్రిదికి మిగతా సీమ్ సహచరులు కూడా తోడైతే అఫ్గాన్‌ను ఆదిలోనే కట్టడి చేయొచ్చు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు షాక్ ఇచ్చిన అఫ్గానిస్తాన్ తర్వాత రన్నరప్ న్యూజిలాండ్ చేతిలో ఓడింది. ఈ ఫలితం పక్కన బెడితే మ్యాచ్‌కు వేదికైన ఇక్కడి చెపాక్ పిచ్ స్పిన్‌కు కలిసొచ్చేది. అఫ్గాన్ జట్టులోని స్పిన్ వనరులకు (రషీద్, నబీ, ముజీబ్) ఈ పిచ్ సహకరిస్తే పాక్‌పై సంచలనం తప్పకుండా ఆశించవచ్చు. బ్యాటింగ్ దళం కూడా మెరుగ్గానే ఉంది. కెప్టెన్ హష్మతుల్లాసహా గుర్బాజ్, ఇబ్రహీమ్, రహ్మత్ షాలు నిలకడగా ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఏమాత్రం ఆదమరిచినా కష్టాలు తప్పవు.

జట్లు (అంచనా)

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), షఫీక్, ఇమాముల్, రిజ్వాన్, షకీల్, ఇఫ్తికార్, నవాజ్, ఉసామ మీర్, షాహిన్ అఫ్రిది, హసన్ అలీ, రవూఫ్.

అఫ్గానిస్తాన్: హష్మతుల్లా (కెప్టెన్), గుర్బాజ్, ఇబ్రహీమ్, రహ్మత్ షా, ఒమర్జాయ్, ఇక్రామ్, నబీ, రషీద్ ఖాన్, ముజీబ్, నవీనుల్, ఫరూఖీ.



7 వన్డే ఫార్మాట్‌లో పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఏడు మ్యాచ్‌లు జరిగాయి. ఏడు మ్యాచ్‌ల్లోనూ పాకిస్తాన్ జట్టే గెలిచింది. ఈ రెండు జట్లు ప్రపంచకప్‌లో (2019) ఒకసారి తలపడ్డాయి. పాకిస్తాన్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

అశ్విని-తనీషా జోడీకి టైటిల్

న్యూఢిల్లీ: అబుధాబి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు రెండు టైటిల్స్ లభించాయి. మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ విజేతగా నిలువగా... మహిళల సింగిల్స్ విభాగంలో ఉన్నతి హుడా చాంపియన్‌గా అవతరించింది. డబుల్స్ ఫైనల్లో అశ్విని-తనీషా ద్వయం 21-16, 16-21, 21-8తో జూలీ ఫిన్ ఇప్సెన్-మాయ్ సురో (డెన్మార్క్) జంటపై గెలిచింది. సింగిల్స్ తుది పోరులో ఉన్నతి హుడా 21-16, 22-20తో హైదరాబాద్ అమ్మాయి సామియా ఇమాద్ ఫారూఖీపై విజయం సాధించింది.



సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
సాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	99.44	102.75
€	యూరో	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	59.70	61.63
SAR	సౌదీ రియాల్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	21.73	23.53
¥	చైనా యువాన్	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.

- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు



గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు–తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10–20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు–తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు–తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?

	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు–తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6–1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.



కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు–తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు–తయారీ చార్జీల (10–20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5–11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాశ్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

సాక్షి స్టాక్స్

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023–24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై–సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13–5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లా భాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిందాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570



ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతో పాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?

– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?

– విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

కొర్రమీను చేప గురించి తెలుసు కానీ.. చీరమీను పేరు ఎప్పుడైనా విన్నారా. ఇదేదో కొత్త చేప అనుకోకండి. గోదావరి తీరానికి చీరమీనుతో చిరకాల బంధం పెనవేసుకుపోయింది. ఈ బుల్లి.. బుజ్జి.. చిట్టి చేపలు దొరికేది 20 రోజులే అయినా.. గోదావరి జిల్లాల ప్రజలతోపాటు పారిస్‌లో స్థిరపడిన వారు సైతం వీటి రాక కోసం ఏడాదంతా ఎదురు చూస్తూనే ఉంటారు. గోదావరి నీటి ప్రవాహం వెంట పక్షులు వాలుతూ ఎగురుతుంటే.. చీరమేనుల సందడి మొదలైనట్టే. పక్షుల రాకను గమనించిన వెంటనే గోదావరి వెంట ఉండే మత్స్యకారులు చీరమీనులొచ్చేత్తన్నాయ్.. లగెత్తండ్రోయ్ అంటూ చీరల్ని పట్టుకుని గోదావరి వెంట పరుగులు తీస్తారు.


గోదావరిలో చీరను వలగా చేసుకుని చీరమీనుల్ని పడుతున్న మత్స్యకారులు

చీరమీను.. రుచి అదిరేను

- చీరమీనుతో గోదావరి తీరానికి చిరకాల బంధం
- పులస తరువాత రుచిలో ఈ చిట్టి చేపలదే టాప్
- దసరా–దీపావళి మధ్య 20–25 రోజులపాటు లభ్యం
- ఫ్లైటెక్కి పారిస్‌కూ పయనం
- ఈ చేప మూడు అంగుళాలు పెరిగితే గొప్పే


చీరమీను



సాక్షి ప్రతినిధి, కాకినాడ: దసరా.. దీపావళి. ఈ రెండు పండుగలు ఎవరికైనా ప్రత్యేకమే. కానీ.. ఈ పండుగల మధ్య వచ్చే మూడు వారాలపాటు గోదావరి జిల్లాల ప్రజలు మరో పండుగ కూడా జరుపుకుంటారు. అరుదైన చీరమీను చేప ఈ పండుగకు కారణమవుతోంది. దసరా–దీపావళి మధ్య సీజనల్‌గా గోదావరి తీరంలో తప్ప మరెక్కడా దొరకని అరుదైన చేప జాతి చీరమీను. శీతాకాలం తొలి నాళ్లలో చలి గాలులు (తూర్పు గాలులు) వీచే అక్టోబర్ నెల రెండో వారం నుంచి కేవలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఇవి లభిస్తాయి. దీపావళి వెళ్లిపోతోందనగా ఇవి కూడా నెమ్మదిగా కనుమరుగైపోతాయి.

ఆ పేరెలా వచ్చిందంటే..

సముద్రం, గోదావరి కలిసే ప్రాంతాలకు సమీపాన బురద నీటిలో చీరమీను చేపలు తీరం వెంబడి తప్ప మరెక్కడా కనిపించవు. తూర్పువైపు నుంచి వచ్చే చల్లటి గాలులకు నీటి అడుగు భాగంలో ఉండే ఈ చిట్టి చేపలు నీటి ఉపరితలంపైకి వచ్చి గుంపులు గుంపులుగా ప్రయాణిస్తుంటాయి. ఆక్సిజన్ ఎక్కువగా లభించే నదీ ముఖద్వారాల వద్ద మడ అడవుల్లో గుడ్లు పెడుతుంటాయి. వీటిని ఇండో–పసిఫిక్ సముద్ర ప్రాంతాల్లో లభించే లిజర్డ్ ఫిష్ జాతికి చెందిన చేపలుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సినోడాంటిడే కుటుంబానికి చెందిన వీటి శాస్త్రీయ నామం సారిడా గ్రాసిలిస్. సారిడా టంబిల, సారిడా అండోస్క్వామిస్ జాతులకు చెందిన వీటిని చిట్టి చేపలని కూడా పిలుస్తారని యానాంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ సుధాకర్ చెబుతున్నారు. అంగుళం నుంచి మూడు అంగుళాల పరిమాణంలో ఉండే చీరమీను చేపల్ని వలలతో పట్టడం సాధ్యం కాదు. వీటిని పట్టేందుకు మత్స్యకారులు వివిధ రకాల రంగుల చీరలను ఉపయోగిస్తుంటారు. రంగు, రంగు చీరలను చూసిన చీరమీను చేపలు నీటి అడుగు నుంచి ఉపరితలం పైకి వస్తుంటాయి. అలా వేలకొద్దీ వచ్చే చేపలు చీరల్లో చిక్కుతాయి. చీరలతో పడతారు కాబట్టి వీటిని చీరమీనులని పిలుస్తారు.

శేరు రూ.700 నుంచి రూ.1,500

ఇప్పటికీ కూడా చీరమీను చేపలను సోల, శేరు, తవ్వ, గ్లాసు, కుంచం, బకెట్ వంటి కొలతల్లో విక్రయిస్తున్నారు. శేరు చీరమీను రూ.700 నుంచి రూ.1500 వరకు పలుకుతుంది. ఒక్కోసారి రూ.2 వేలకు కూడా విక్రయిస్తుంటారు. చీరమీను ఎక్కువగా కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా భైరవపాలెం, మురమళ్ల, చింతపల్లి లంక, ఎదుర్లంక, పాత యింజరం, రాజోలుదీవి తదితర ప్రాంతాల్లో లభిస్తోంది.

ఈ చేపలంటే పారిస్ పడి చస్తుంది!

చీరమీను చేపలను ఫ్రాన్స్ దేశస్తులు కూడా అమితంగా ఇష్టపడతారు. స్వాతంత్ర్యం రాక మునుపు యానాంను ఫ్రాన్స్ దేశస్తులు పాలించేవారు. నాటి నుంచి ఫ్రెంచి పౌరులతో ఫ్రాన్స్‌లో స్థిరపడిన యానాం ప్రాంత వాసులు కూడా చీరమీనును వివిధ రకాల కూరలు, వంటకాలు తయారు చేయించుకుని ఫ్రాన్స్ తీసుకుని వెళుతుంటారు.

ఆహా ఏమి రుచి!

చీరమీను చేపలతో వివిధ రకాలుగా కూరలు చేస్తుంటారు. లేత చింతకాయలతో చీరమీను, చింత చిగురుతో కలిపి ఇగురు వండుతుంటారు. చీరమీను చేపల్ని మినప పిండితో కలిపి గారెలుగా కూడా వేస్తుంటారు. మసాలా పెట్టి ఫ్రై చేసుకుంటే ఆ టేస్టే వేరు అంటారు. చీరమీను ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతుంటారు. అధిక ప్రొటీన్లు గల చీరమీను చేపలను ధర కాస్త ఎక్కువైనా కొనుగోలు చేస్తారు.

పోషక విలువలు మెండు



చీరమీనులో పోషక విలువలు మెండుగా ఉంటాయి. కాల్షియం, ఐరన్, సెలీనియం, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్–ఏ, జింక్ వంటి మూలకాలు సమృద్ధిగా లభిస్తాయి. పులసలు, రామలతోపాటు చీరమీను ఏడాదిలో ఒక సీజన్‌లో మాత్రమే దొరకుతాయి. అది కూడా పరిమితంగా లభిస్తాయి. – చిట్టూరి గోపాలకృష్ణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి

పారిస్‌లో భలే డిమాండ్



పారిస్ వాసులు చీరమీను చేపల్ని చాలా ఇష్టపడతారు. చైనా నుంచి ప్యాకెట్ల రూపంలో చీరమీను వస్తున్నా మన గోదావరి జిల్లాల్లో లభించే చీరమీను అంత రుచికరంగా ఉండదు. చాలా ఏళ్లుగా యానాం పరిసర ప్రాంతాల్లో లభించే చీరమీను చేపల్ని వండించుకుని పారిస్‌లో ఉన్న వారికి అభిమానంతో తీసుకువెళుతుంటాం. – సాధనాల సత్యవీరేంద్ర, ధృవ సిటీ, పారిస్‌లో స్థిరపడ్డ యానాం వాసి

మానసిక ఆరోగ్యానికి మంచి జీవనశైలి రక్ష

జీవనశైలి మార్పులతో 57 శాతం డిప్రెషన్ సమస్యలు తగ్గుదల

- కేంబ్రిడ్జి వర్సిటీకి చెందిన పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- మంచి నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామంతో మానసిక స్థితి మెరుగుదల



సాక్షి, అమరావతి: మీరు బాగా నిద్రపోతున్నారా? పౌష్టికాహారం తీసుకుంటున్నారా? మీరు ఇష్టమైన అభిరుచి కోసం సమయాన్ని వెచ్చిస్తున్నారా? వ్యాయామం చేస్తున్నారా? స్నేహితులు, కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉంటున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలే వ్యక్తుల మానసిక స్థితిని నిర్ధారిస్తున్నాయి. వారిలోని డిప్రెషన్ ప్రమాదాలను హెచ్చరిస్తున్నాయి. కేంబ్రిడ్జి వర్సిటీకి చెందిన సైకాలజిస్టు, న్యూరో శాస్త్రవేత్త బార్బరా సహకియన్ పరిశోధనలో కేవలం మందులు, ఇతర చికిత్స ద్వారా మాత్రమే కాకుండా.. మంచి జీవనశైలి అలవాట్లు సైతం డిప్రెషన్ తగ్గించడానికి ఔషధంగా పని చేస్తున్నట్టు కనుగొన్నారు. యూకే బయోబ్యాంక్‌లోని 3 లక్షల మంది డేటాతో పాటు డిప్రెషన్‌తో బాధపడుతున్న వారు, డిప్రెషన్‌కు చికిత్స తీసుకుని నయమైన వారి జీవనశైలిని అధ్యయనం చేశారు. మంచినిద్ర, వ్యాయామం, సామాజిక సంబంధాల మధ్య నిత్యం గడిపేవారిలో మానసిక రుగ్మతలు, డిప్రెషన్ గణనీయమైన స్థాయిలో తగ్గినట్టు గుర్తించారు.

ఏడు రకాల ఆరోగ్య అలవాట్లు

డిప్రెషన్ సమస్యను ఏడు రకాల అలవాట్లు ప్రభావితం చేస్తున్నట్టు పరిశోధన చెబుతోంది. ఇందులో ఐదుకు పైగా మంచి అలవాట్లను నిత్యం పాటించిన వారిలో 57 శాతం వరకు డిప్రెషన్ సమస్యలు తగ్గుతున్నాయని పేర్కొంది. ఇక్కడ పరిశోధకులు డిప్రెషన్‌తో సంబంధం ఉండే సి-రియాక్టివ్ ప్రొటీన్‌తో (సీఆర్‌పీ) స్కోర్లను విశ్లేషించగా ఆరోగ్య సూత్రాలు పాటించిన వారిలో ఈ స్కోరు బాగున్నట్టు తేల్చారు. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడం ద్వారా కూడా డిప్రెషన్ ప్రమాదాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

నిద్రతో రోగనిరోధక శక్తి మెరుగు

ప్రతి రోజు ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్ర.. డిప్రెషన్ ప్రమాదాన్ని 22 శాతం తగ్గించినట్టు అధ్యయనం పేర్కొంది. పగటిపూట నేర్చుకున్న వాటిని గుర్తుంచుకోవడానికి నిద్ర సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పైగా నిద్రలో వచ్చే కలలు భావోద్వేగాల నియంత్రణకు సహాయపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. మంచి నిద్రతో ప్రశాంత జీవనం అలవడి మానసికస్థితి మెరుగవుతుంది. దీనితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వ్యక్తుల్లోనూ మానసిక ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉంటాయని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సర్వే సైతం వెల్లడిస్తోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం సరదాగా గడిపితే మానసిక స్థితిని అదుపులో ఉంచుకోవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా గడిపిన 65 ఏళ్లు పైబడిన వ్యక్తుల్లో డిప్రెషన్ సమస్యలు చాలా వరకు తగ్గాయి. నిత్యం గార్డెనింగ్, అల్లికలు, పెయింటింగ్, ఆటల వంటి అలవాట్లను కూడా మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్సగా సూచిస్తున్నారు.

ఆరోగ్యకర డైట్‌తో ఎన్నో ఉపయోగాలు



ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, గింజలతో సహా ఆరోగ్యకర ఆహారం తీసుకునే వారిలో నిరాశ, నిస్పృహలు తగ్గుతున్నాయి. ఇలాంటి సంతులిత డైట్ రక్తపోటు, మధుమేహం, గుండెపోటు, ఇతర స్ట్రోక్‌లను తగ్గించడానికి సహాయపడుతుంది. ప్రతిరోజు సలాడ్ తినే వృద్ధుల్లో జ్ఞాపకశక్తి దెబ్బతినకుండా ఉంటుంది. ఇక కళాశాలల విద్యార్థుల్లో డ్రిపెషన్ స్కోరు పెరుగుతోందని, అలాగే రిఫైన్డ్ కార్బోహైడ్రేట్లు, ప్రాసెస్డ్ ఆహారం, చక్కెర పదార్థాలు, శీతల పానీయాలు ఎక్కువగా తీసుకోవడంతో కూడా మానసిక సమస్యలు పెరుగుతున్నట్లు పరిశోధన తేల్చింది. మద్యపానం, ధూమపానం, 30 నిమిషాలు ఏకబిగిన మొబైల్, ఇతరత్రా స్క్రీన్ల ముందు గడిపినా మానసిక ఆరోగ్యంపై వ్యతిరేక ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడిపే యువత విషయంలోనూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వారికి ఒకరోజు సోషల్ మీడియాకు విరామం ప్రకటించాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత జీవన శైలి మార్పు పైనే మానసిక స్థితి ఆధారపడుతుందని పరిశోధన ద్వారా వెల్లడైంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 23 : అక్టోబర్ : 2023

కావేరి సమస్యను ప్రధాని తీర్చాలి: శివు



మండ్య: కావేరి నది నీటి పంపిణీ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకుని రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రెండు రాష్ట్రాల మధ్య సమస్య వచ్చినప్పుడు ప్రధాని జోక్యం చేసుకుని పరిష్కరించాలని అన్నారు. ఆదివారం ఆయన మద్దూరు ఓ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు సీఎంలు కూర్చొని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మాకు తాగడానికి నీరు లేనప్పుడు తమిళనాడుకు నీరు ఇవ్వాలని ఆదేశించడం సరికాదన్నారు. తాను రాజకీయాల్లోకి రాబోనని, సినిమా రంగంలోనే ఉంటానని చెప్పారు.

న్యూస్‌రీల్

జింక అడ్డు రావడంతో..



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

యశవంతపుర: అడ్డం వచ్చిన జింకను తప్పించబోయిన కారు ప్రమాదానికి గురైన ఘటన చిక్కమగళూరు జిల్లా కళస సమీపంలోని సంపిఖాన్ వద్ద జరిగింది. ఆదివారం మంగళూరుకు చెందిన కుటుంబం హొరనాడు అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకొని తిరుగు ప్రయాణమైంది. సంపిఖాన్ వద్ద వేగంగా వెళ్తుండగా ఒక జింక అడ్డు రావడంతో డ్రైవర్ అదుపుతప్పగా కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారులో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి

మైసూరు: బ్యారికేడ్‌కు బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు, మరో వ్యక్తి మరణించారు. ఈ ఘటన జిల్లాలోని హుణసూరు–మైసూరు రహదారి సోమనహళ్లి వద్ద జరిగింది. కొడగుజిల్లా కుశాలనగరకు చెందిన ప్రసన్న, పిరియాపట్టణ తాలూకా హుణసవాడి సర్కిల్ కు చెందిన శేఖర్‌లు స్నేహితులు. వీరిద్దరూ శనివారం రాత్రి మైసూరు దసరా ఉత్సవాలను వీక్షించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రసన్న అక్కడికక్కడే మరణించాడు. శేఖర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. హుణసూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడవ ప్రపంచ యుద్ధాన్ని నివారించాలి



సీఐటీయూ కార్యకర్తల ప్రదర్శన

గౌరిబిదనూరు: మూడవ ప్రపంచ యుద్ధం జరగకుండా ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని ఇజ్రాయెల్, పాలస్తీనా పోరాటాన్ని ఆపాలని, కోట్లాది మనుషుల ప్రాణాలను రక్షించాలని సీఐటీయు నాయకులు డిమాండు చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా పట్టణంలో ఎంజీ సర్కిల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. 1939 నుంచి 1944 వరకు జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, మళ్లీ అలాంటి పరిస్థితి రాకుండా ఇజ్రాయెల్ దాడులను ఐరాస నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ దాడుల్లో అమాయక మహిళలు, పిల్లలు వందలాదిగా చనిపోతున్నారని వాపోయారు. ఇతర దేశాలు కూడా యుద్ధంలో పాల్గొంటే అధిక ప్రాణనష్టం జరుగుతుందని, దీనిని నివారించాలని కోరారు.

పండుగ వేళ అన్నదాత ఆత్మహత్య

మైసూరు: పండుగ వేళ అప్పుల బాధతో రైతు ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన కేఆర్ నగరం తాలూకా దెగ్గనహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రామేగౌడ అనే రైతు వ్యవసాయం కోసం తిప్పూరు సహకార బ్యాంకు నుంచి రూ. 2.5 లక్షలు, కెనరా బ్యాంకు నుంచి రూ. 50 వేలు, ఇతరత్రా చోట్ల నుంచి రూ. 2 లక్షలను అప్పులు చేశాడు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి కూడా రూ. 2–3 లక్షలకు పైగా రుణాలు చేశాడు. సకాలంలో వర్షాలు పడకపోవడం, సాగు చేసిన పంటలు నష్టం వాటిల్లడంతో ఆవేదనకు లోనై ఆత్మహత్య చేసుకున్నాడు. కేఆర్ నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.2.43 కోట్ల డ్రగ్స్ సీజ్

- నైజీరియన్ అరెస్టు



ఎండీఎంఏ డ్రగ్స్, మొబైల్

బనశంకరి: డ్రగ్స్ అమ్ముతున్న నైజీరియన్ పౌరున్ని ఆదివారం బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి రూ.2 కోట్ల 43 లక్షలు విలువచేసే మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. నైజీరియన్ విక్టర్ దొడ్డనాగమంగల వీరభద్రస్వామిలేఔట్‌లో అద్దె ఇంట్లో డ్రగ్స్ నిల్వ చేసినట్లు తెలిసి దాడులు జరిపారు. ఇందులో రూ.2.43 కోట్లు విలువచేసే ఎండీఎంఏ, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పెడ్లర్ మెస్సో నుంచి ఢిల్లీ నుంచి డ్రగ్స్ తెప్పించుకుని వాటిని ప్యాకెట్లుగా చేసి అధిక ధరకు విక్రయించేవాడు. మంగళూరు, కేరళలో అమ్మేవాడు, బంట్వాళ తాలూకా విట్లలో ఇతని అనుచరుడు హసన్ సాదిక్‌ను అరెస్ట్‌చేశారు. ఇతని వద్ద నుంచి రూ.రూ.2.50 లక్షల విలువచేసే 50 గ్రాములు ఎండీఎంఏ ,మారుతి 800 కారు, మొబైల్ ను సీజ్ చేసి విచారణ చేపట్టారు.

సంబరాలకు స్వాగతం



రూపుదిద్దుకుంటున్న ఓ శకటం

- మైసూరులో మిన్నంటిన దసరా శోభ
- మంగళవారం జంబూసవారీ మహోవేడుక
- ఆకట్టుకున్న వైమానిక ప్రదర్శన



అబ్బురపరిచిన విమాన విన్యాసాలు



ఆదివారం మైసూరు ప్యాలెస్ ముందు జంబూసవారీ రిహార్సల్స్



రాజప్రాసాదం ముందు సందడి

మైసూరు: అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహా వేడుకకు కౌంట్‌డౌన్ ఆరంభమైంది. మైసూరు దసరా రోజున నిర్వహించే చారిత్రక జంబూ సవారి సంరంభానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం గజరాజులు, సాయుధ బలగాలు, కళా బృందాలతో పతాకస్థాయిలో రిహార్సల్స్‌ను నిర్వహించారు. ఈ ఊరేగింపును చూడడానికి దేశవిదేశాల నుంచి ఐదు లక్షలకు మంది పైగా పర్యాటకులు రావచ్చని అంచనా. 24వ తేదీ.. మంగళవారం వివిధ పూజలు నిర్వహించి సీఎం సిద్దరామయ్య, గవర్నర్ గెహ్లాట్, రాజ ప్రముఖుల ఆధ్వర్యంలో దసరా జంబూసవారీని నిర్వహిస్తారు.

జంబూసవారీ ఇలా..

- కన్నడ నాడు వారసత్వ, సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరిగే జంబూసవారీ కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.
- మంగళవారం మధ్యాహ్నం 1.46 గంటల నుంచి 2.08 గంటల వరకు శుభ మకర లగ్నంలో మైసూరు ప్యాలెస్ ఆవరణలో బలరామ మార్గం వద్ద జంబూ సవారీ ఆరంభమవుతుంది.
- సీఎం సిద్ధరామయ్య నందిధ్వజానికి సంప్రదాయ పూజ చేసి ఈ ప్రారంభిస్తారు.
- సాయంత్రం 4.40 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శుభ మీన లగ్నమందు విజయదశమి ఊరేగింపు జరుగుతుంది.
- కెప్టెన్ అభిమన్యు ఏనుగుపై బంగారు అంబారీలో చాముండేశ్వరి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రముఖులు పుష్పార్చన గావిస్తారు. 21 సార్లు ఫిరంగులను పేల్చి గౌరవ వందనం చేస్తారు.
- జిల్లాలు, శాఖలకు చెందిన మొత్తం 49 శకటాలు ఊరేగింపులో పాల్గొంటాయి. జానపద కళాకారుల బృందాల ప్రదర్శన సరేసరి. కేఆర్ సర్కిల్, సయ్యాజీ రావ్‌రోడ్డు ద్వారా బన్నిమంటపం పంజిన కవాతు మైదానం వరకు ఊరేగింపు జరుగుతుంది.

సాయంత్రం కాగడాల ప్రదర్శన

సాయంత్రం ఏడు గంటలకు బన్నిమంటపం మైదానంలో కాగడాల ప్రదర్శన, పోలీసు బృందాల ద్వారా సాహస ప్రదర్శనలు జరుగుతాయి. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పాల్గొని గౌరవ వందనం స్వీకరిస్తారు. ఇదే సమయంలో మంగళవారం ఉదయం మైసూరు ప్యాలెస్‌లో రాజవంశస్తుల ప్రైవేటు దర్బార్ కూడా జరగనుంది. యదువీర్ ఉత్తర పూజ, విజయ యాత్ర నిర్వహించి శమీ వృక్షానికి పూజలు చేయనున్నారు.

అలరించిన ఎయిర్ షో

నాలుగేళ్ల తర్వాత మైసూరు దసరా మహోత్సవంలో ఎయిర్ షో సాధన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బన్నిమంటపంలోని పంజిన కవాతు మైదానంపై వైమానిక ప్రదర్శన జరిగింది. వేలాది మంది వీక్షించి మురిసిపోయారు. సూర్యకిరణ్ విమానాలు భారీ రొద పెడుతూ విన్యాసాలు సాగించాయి. సుమారు ఒక గంట పాటు జరిగింది. సోమవారం కూడా వైమానిక ప్రదర్శన జరగనుంది.



సెలవులు పొడిగింపు

చారిత్రక జంబూ సవారి ఊరేగింపును చూసేందుకు వేలాది మంది పర్యాటకులు మైసూరుకు తరలివస్తున్నారు. దీంతో దసరా సెలవును మంగళవారం వరకు పాఠశాల విద్యా శాఖ పొడిగించింది. వరుస సెలవులు, దసరా ఉత్సవాల వల్ల నగరంలోని రెస్టారెంట్లు, వసతి గృహాలు, హోటళ్లు, పర్యాటకులతో నిండిపోయాయి. మరోవైపు రాష్ట్రంలో ఎక్కువమంది మంగళవారమే దసరా పండుగ జరుపుకోనున్నారు.



ఆదివారం జరిగిన డాగ్ షోలో ఓ పోటీదారు



యక్షగాన అభినయం



యువ దసరాలో నృత్యోల్లాసం



వైమానిక విన్యాసాలను తిలకిస్తున్న జనసందోహం



యువ దసరాలో మల్లకంబ విన్యాసం

మహిళ హత్య?



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుమకూరు: జిల్లాలోని శిర తాలూకా తావరెకెరె గ్రామం నుంచి మద్దక్కనహళ్లికి వెళ్లే దారిలో మహిళ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. శిరా తాలూకా బడకనహళ్లి గ్రామానికి చెందిన పల్లవి (33)గా గుర్తించారు. హంతకులు హత్య చేసి పొలంలో మృతదేహాన్ని పడేసి వెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతదేహంపై అక్కడక్కడ గాయాలున్నాయి. జిల్లా ఎస్పీ వీకే అశోక్, తావరెకెరె పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

నిఘా హెచ్చరికలు.. భద్రత కట్టుదిట్టం

మైసూరు: ఉగ్రవాదులు జంబూసవారీలో అలజడి సృష్టించే ప్రమాదం ఉందని పోలీసు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. నకిలీ పాస్‌పోర్టుతో సుమారు 70 మంది అక్రమంగా దేశంలోకి ప్రవేశించినట్లు కేంద్ర నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. ఒకవైపు క్రికెట్ మ్యాచ్‌లు, మరోవైపు దసరా ఉత్సవాల నేపథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. ఆదివారం డీజీపీ అలోక్ మోహన్ పోలీసు అధికారులతో భద్రత గురించి సమావేశం జరిపారు. మైసూరులో 1,568 మంది పోలీసులు, 30 కేఎస్ఆర్‌పీ ప్లాటూన్లు మోహరించారు.

కలర్‌ఫుల్ ప్రోగామ్స్‌కు తెర..

నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవం సందర్భంగా ప్యాలెస్‌తో పాటు వివిధచోట్ల 11 వేదికలపై జరిగిన సాంస్కృతిక సంరంభానికి ఆదివారం రాత్రి తెరపడింది. రైతు దసరా, యువ దసరా, యోగాసనాల పోటీలు తదితర పలు కార్యక్రమాలు ముగిశాయి. యువ దసరా చివరి రోజుమహారాజ కాలేజీ మైదానంలో గాయకుడు బెన్ని దయాళ్ తన సుమధుర గళంతో ఆకట్టుకున్నాడు. మహరాజ కాలేజీ విద్యార్థుల బృందం అంబేడ్కర్ జీవితంపై నృత్యం అలరించింది. ఛాయదేవి బీఎడ్ కాలేజీ విద్యార్థుల బృందం బాలకృష్ణుని చిలిపి ఆటలు ప్రదర్శించారు. మైసూరు వర్సిటీ యోగా విద్యార్థులు ఏకదంతాయ వక్రతుండాయా పాటకు యోగసనాలు ప్రదర్శించారు.

ప్రేమపాశం.. తండ్రి కర్కశత్వం

- ప్రేమికునితో వెళ్లిపోయిందని కూతురి హత్య
- బెంగళూరులో మరో దారుణం



బనశంకరి: సిలికాన్ సిటీలో మరో పరువు హత్య చోటుచేసుకుంది. మామ ఇంట్లో ఉన్న అమ్మాయి ప్రేమించిన యువకునితో వెళ్లిపోయింది. ఇది సహించకలేక తండ్రి ఆమెను నరికి చంపాడు. ఈ ఘోరం బెంగళూరులోని పరప్పన అగ్రహార పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నాగనాథపురలో నివాసం ఉండే మామ ఇంట్లో పల్లవి (17) అనే బాలిక ఉంటూ చదువుకునేది. స్థానికంగా ఉండే యువకునితో ఆమె ప్రేమలో పడింది. ఇటీవల ఆమె అతనితో వెళ్లిపోయింది. మైసూరు జిల్లా హెచ్‌డీ.కోటెలో నివసించే ఆమె తండ్రి గణేశ్‌కు విషయం తెలిసి బెంగళూరుకు వచ్చాడు. మీకిద్దరికీ పెళ్లిచేసి బాగా చూసుకుంటామని నమ్మబలికి కూతురిని రప్పించాడు. కొడవలితో నరకడంతో బాలిక అక్కడికక్కడే మృత్యువాత పడింది. అగ్రహార పోలీసులు కేసు నమోదుచేసి కిరాతక తండ్రిని అరెస్ట్‌చేశారు. ఇటీవల దేవనహళ్లి వద్ద కూతురిని తండ్రి ఇదేరీతిలో నరికి చంపడం తెలిసిందే.

కుమార్తె నిర్వాకంతో తండ్రి ఆత్మహత్య

అల్లారుముద్దుగా పెంచిన కుమార్తె ఓ యువకున్ని ప్రేమించి ఇంటినుంచి పారిపోవడంతో ఆవేదన చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు శివార్లలో ఆనేకల్‌లో చోటుచేసుకుంది. అనేకల్ తాలూకా నారాయణపురలో గోపాల్ కుటుంబం నివసిస్తోంది. వీరి కుమార్తె ఒక యువకున్ని ప్రేమించి రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో విరక్తి చెందిన గోపాల్ అనేకల్ చెరువు ఆవరణలో చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఆదివారం ఉదయం వాకింగ్ కి వచ్చిన వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆనేకల్ పోలీసులు పరిశీలించి అతడి జేబులో ఉన్న పర్సు ఇతర వివరాలను బట్టి భార్యకు సమాచారం అందించారు. మృతదేహానికి శవపరీక్షలనిమిత్తం అనేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నవరాత్రుల సందర్భంగా ఆదివారం రాత్రి మంగళూరు కుద్రోళిలోని గోకర్ణనాథ ఆలయంలో భక్తజన సందోహం

పోలీసులమంటూ వ్యాపారి కిడ్నాప్

కృష్ణరాజపురం: సిలికాన్ సిటీలో దుండగులు.. పోలీసులమంటూ బెదిరించి మొబైల్ షాప్ యజమానిని కిడ్నాప్ చేసి రూ. 5లక్షలను డిమాండ్ చేశారు. వివరాలు... బెంగళూరు ఎస్పీ రోడ్‌లో కాలు సింగ్ అనే వ్యక్తి మొబైల్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కొందరు అతన్ని పట్టుకుని.. మేం పోలీసులం, నీవు డ్రగ్స్ విక్రయిస్తున్నావు, రూ. 5 లక్షలు ఇస్తే వదిలేస్తామని నిర్బంధించారు. మహమ్మద్ వసీం అనే నేరగాడు, అతని అనుచరులు వ్యాపారిని అపహరించారు. తాను అలాంటి పని చేయలేదని, డబ్బులు ఇవ్వనని కాలుసింగ్ తేల్చి చెప్పాడు. అతని వద్ద డబ్బులు లేవని తెలుసుకున్న వసీం ముఠా వదిలిపెట్టి వెళ్లిపోయింది. తరువాత బాధితుడు వీవీ పురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీబీకి సమాచారం అందించిన తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం ఐదు మంది నిందితులను అరెస్టు చేశారు.

బాలికపై హత్యాచారం.. దోషికి మరణశిక్ష

యశవంతపుర: మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో కామాంధునికి మరణశిక్ష పడింది. వివరాలు ఇలా.. ధారవాడ జిల్లా హుబ్లీ తాలూకా కురడికెరి గ్రామానిని చెందిన శెట్లప్ప బసప్ప వడ్డర్ దోషి. ఇతడు శిగ్గావి పోలీసుస్టేషన్ పరిధిలో 2019లో పెళ్లికి వెళ్లాడు. అక్కడ ఒక బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్ల అత్యాచారం చేసి, ఆపై గొంతు పిసికి చంపి వెళ్లిపోయాడు. పోలీసులు విచారించి వడ్డర్‌ను అరెస్టు చేశారు. ధారవాడ జిల్లా కోర్టులో కేసు విచారణ సాగుతోంది. శనివారం జడ్జి నింగనగౌడ పాటిల్ తీర్పు వెలురించారు. దోషికి మరణశిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

పబ్ బయట రచ్చ రచ్చ

శివాజీనగర: ఐటీ సిటీలోని చర్చి స్ట్రీట్‌లో ఉన్న బర్గర్ సైనర్ పబ్‌లో యువతీ–యువకుల గొడవ చెలరేగింది. అర్ధనగ్నంగా కొట్టుకోగా ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. శనివారం రాత్రి పబ్ నుంచి కాలేజీ యువకులు, యువతులు పార్టీ ముగించుకొని వెళ్లేటప్పుడు కొందరు యువకులు దురుసుగా ప్రవర్తించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట మొదలైంది. యువతులు కూడా ఇందులో పాల్గొన్నారు. మద్యం మత్తులో రోడ్డు మీదే రెండు గుంపులు కొట్టుకున్నాయి. ఓ యువకుడు పక్కన గడ్డి మీద పడిపోయాడు. యువతీ యువకుల చెలగాటం వీడియోలపై సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తమైంది. అర్ధరాత్రి వరకు చిందులేసింది చాలక రోడ్లపై అసభ్యంగా కొట్టుకుంటారా? అని పలువురు ప్రశ్నించారు.

కొండెక్కుతున్న ఉల్లి ధరలు

- ధరలు పెరిగే సమయంలో రైతులకు నష్టాలు
- ఉత్పత్తి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు
- ఎండిపోతున్న ఉల్లిపంట
- ఒక పాకెట్ ఉల్లి ధర రూ.2000 నుంచి రూ.2500
- త్వరలో కేజీ రూ.100 ?


పెట్టుబడి కూడా కష్టమే


పొలంలో ఎండిపోయిన ఉల్లి పంట

సాక్షి బళ్లారి: మార్కెట్‌లో రోజు రోజుకు ఉల్లి ధరలు పెరిగిపోతున్నప్పటికీ రైతులకు మాత్రం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలోని అత్యధికంగా ఉల్లి సాగుచేసే చిత్ర దుర్గం జిల్లాలో ఈసారి ఉల్లి రైతులకు కష్టాలు కన్నీళ్లే మిగులుతున్నాయి. దేశంలో మహారాష్ట్ర తర్వాత కర్ణాటకలో ఉల్లి సాగు అంతే స్థాయిలో ప్రతి ఏటా జరిగేవి. ఈసారి తీవ్ర వర్షాభావం పరిస్థితుల వల్ల మహారాష్ట్రలో ఉల్లిసాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టడంతో పాటు కర్ణాటకలో కూడా ఉల్లి సాగు తక్కువే. చిత్రదుర్గం జిల్లాలో ప్రతి ఏటా వర్షాధారిత భూములతో పాటు నీటిపారుదల వసతి గల భూముల్లో దాదాపు 2లక్షల ఎకరాల్లో ఉల్లిసాగు జరిగేది. ఈసారి కేవలం లక్ష ఎకరాల్లోపే చిత్ర దుర్గం జిల్లాలో పలు గ్రామాల్లో ఉల్లిసాగు చేశారు. ఈసారి సగానికిపైగా ఉల్లి దిగుబడి తగ్గిపోయింది. అయితే పెట్టిన పంట కూడా చేతిక అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఉల్లి ధర మరింత పెరిగేందుకు దారులు ఏర్పడుతున్నాయి. అయితే ప్రతి ఏటా ఒక ఎకరాకు ఉల్లిగడ్డలు 150 బస్తాలు అంటే 75 క్వింటాళ్లు దిగుబడి వచ్చేదని ఈసారి కేవలం 30 బస్తాలు అంటే 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని చిత్రదుర్గం జిల్లా రైతులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంత్ సాక్షికి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కూడా ఒక ఎకరాకు 15 క్వింటాళ్ల పైబడి దిగుబడి రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఉల్లి కోతలు ప్రారంభమైనాయని ధరలు పెరుగుతున్నప్పటికీ పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఒక ఎకరాకు రూ.50 వేలకుపైగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతులకు 15 క్వింటాళ్లే దిగుబడి రావడంతో రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ప్రస్తుతం ఉల్లిపంట పూర్తిగా దెబ్బతినడంతో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులే పేర్కొంటున్నారు. ప్రస్తుతం కిలో ఉల్లి రూ.50ల నుంచి రూ.60ల వరకు ధర పలుకుతోందని మరో నెల ల్లోపు కిలో ఉల్లి రూ.100లైనా పెరిగే అవకాశం ఉందని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

వైభవంగా చండికా హోమం


హోమం చేస్తున్న శ్రీ పాదంగల్

రాయచూరు రూరల్ : మంత్రాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండికా హోమం నిర్వహించారు. మంత్రాలయ రాఘవేంద్ర స్వాముల మఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ ఆధ్వర్యంలో లోక కళ్యాణ కోసం చండికా హోమం జరిపారు. హోమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

పరిశీలకుడిగా మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: తెలంగాణలో నవంబర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా మంత్రి బోసురాజును నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

గుట్కా గోడౌన్‌లో దోపిడీ

- లక్షల విలువ చేసే సరుకు అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మాలూరు: గుట్కా రహస్యంగా దాచిన గోడౌన్‌లో దుండగులు వాచ్‌మెన్ కాళ్ల చేతులు బంధించి లక్షల విలువ చేసే పాన్ మసాల సామగ్రిని అపహరించుకుని వెళ్లిన ఘటన తాలూకాలోని ఎట్టికోడి గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. హీరాలాల్ అనే వ్యక్తి ఎట్టికోడి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తికి చెందిన భూమిలో గోడౌన్ బాడుగకు తీసుకుని పాన్ మసాల, ఆర్ఎండి మసాల ప్యాకెట్‌లను విక్రయించడానికి దాచాడు. రాత్రి నలుగురైదుగురు దోపిడీ దొంగలు గోడౌన్‌లో పడుకున్న వాచ్‌మెన్ కాళ్లు చేతులు కట్టివేసి పిస్తోల్‌తో బెదిరించి గోడౌన్‌లో ఉన్న రూ. 20 లక్షలకు పైగా విలువ చేసే పాన్ మసాలా, ఆర్ఎండీ మసాల ప్యాకెట్లు, నగదును అపహరించుకుని వెళ్లారు. ఉదయం విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ ఎం నారాయణ్, ఏఎస్పీ వీబీ భాస్కర్, డీఎస్పీ టి మల్లేష్, ఎస్ఐ వసంత్‌కుమార్‌లు పరిశీలన జరిపారు.

కేంద్ర విధానాలపై ఆందోళన


ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కేంద్ర సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐఎంల్ రెడ్‌స్టార్ ఆందోళన చేపట్టారు. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ ముందు ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు హుచ్చరెడ్డి మాట్లాడారు. దశాబ్దం నుంచి బీజేపీ పాలన కొనసాగించిన చెప్పుకోలేని అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల మాట తప్పారని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల నగదు వేస్తామని అబద్ధాలతో కాలం గడిపారన్నారు. మోదీ మాటలను నమ్మకూడదని అన్నారు. ఆందోళనలో అమరేష్, మల్లయ్య, లక్ష్మణ, హనీఫ్, నారాయణ, అజీజ్, అడవిరావ్, వెంకటేష్, అదేశ్, నిరంజన్ కుమార్, నిసర్గ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర అలంకరణ



కెజీఎఫ్: శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగరంలోని గణేష పురంలో ఉన్న గంగమ్మ దేవి ఆలయంలో ఆదివారం అర్ధనారీశ్వర అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం, వేద మంత్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

హెల్త్ సెంటర్ ప్రారంభం

హొసపేటె: తాలూకాలోని సీతారామతండాలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్. ఎల్ఆర్.శంకర్ నాయక్ ప్రారంభించారు. తండా గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గోవింద్‌నాయక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గురుదత్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్.భాస్కర్‌రెడ్డి, పరిపాలన వైద్యాధికారి డాక్టర్.వినోద్‌కుమార్ పీడీఓ మన్సూర్, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులా ?

- యాదగిరిలో దుశ్చర్య


దాడికి గురైన శరణగౌడ

రాయచూరు రూరల్ : కళ్యాణ కర్ణాటక అక్రమాలకు నిలయంగా మారింది. యాదగిరి జిల్లాలో అక్రమాలపై ప్రశ్నించిన వారిపై మారణాయుధాలతో దాడులు జరిపిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇసుక అక్రమ రవాణా విషయంపై ప్రశ్నించిన వ్యక్తిని కిడ్నాప్ చేసి మారణాయుధాలతో దాడి చేశారు. యాదగిరి జిల్లా శహపూర్ తాలూకా విభూతిహళ్లిలో కృష్ణానది నుండి బసురెడ్డి గ్రామ పంచాయతీ సభ్యుడు విజయ్ రాథోడ్ అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయంపై రాజు, శరణగౌడ అనే వ్యక్తులు ప్రశ్నించారు. దీంతో వారిని కారులో కిడ్నాప్ చేసి మారణాయుధాలతో దాడి చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణ బసప్ప మద్దతుతోనే దౌర్జన్యాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గాయపడిన శరణగౌడను కలబుర్గి ఆస్పత్రికి తరలించారు.

అక్రమాలను అరికట్టండి ఎంపీ లేఖ :
యాదగిరి జిల్లాలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శరణు ప్రకాష్ పాటిల్, యాదగిరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణ బసప్పలకు ప్రత్యేక లేఖలు రాశారు. కృష్ణ, తుంగభద్ర నదీ తీరాల్లో అక్రమంగా ఇసుక రావాణా, అక్రమ మద్యం, రేషన్ బియ్యం తరలిస్తున్నారని ఆ లేఖలో రాశారు.

అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ


నగరేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకరణ


చిన్నమార్కెట్ శాంభవిదేవికి దుర్గాదేవి అలంకారం


చిన్న దుర్గమ్మకు దుర్గాదేవి అలంకరణ


మారెమ్మకు గాజుల అలంకరణ

బళ్లారి అర్బన్: విజయ దశమి సందర్భంగా బళ్లారి నగరంలో 8వ రోజు ఆదివారం అమ్మవారి ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణలు గావించి అమ్మలగన్న అమ్మ కరుణించమ్మా దుర్గమ్మ అంటూ పూజలు చేశారు. పటేల్‌నగర్ చిన్నదుర్గమ్మకు దుర్గాదేవి అలంకరణ, మిల్లర్‌పేట్ మల్నాడు దుర్గామ్మ దుర్గాదేవి అలంకరణ, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి దుర్గాదేవి అలంకరణ, నగరేశ్వరి ఆలయంలో పార్వతి దేవికి దుర్గాదేవి అలంకరణ, అవంబావి సీతారామ ఆశ్రమంలో దుర్గాదేవి అలంకరణ, బెంకి మారెమ్మకు దుర్గాదేవి, చిన్నమార్కెట్ శాంభవి దేవికి దుర్గదేవి, ఏళ్లమక్కళ తాయి ఆలయంలో, ఫైర్ ఆఫీస్ ఆదిశక్తి ఆలయంలో, దేవి నగర్ రేణుకా యల్లమ్మ ఆవరణంలో, తులజ యల్లమ్మ ఆలయంలో, కొల్లపూర్ మహాలక్ష్మీ ఆలయంలో, సంతోషి మాత ఆలయం, దుర్గా భవాని తదితర ఆలయాల్లో దుర్గాష్టమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించి, పలు ఆలయాల్లో అన్నదానాలు చేశారు.

వైభవంగా శరవన్నవరాత్రి పూజలు


కాళికాదేవికి విశేష అలంకరణ


వేంకటేశ్వర స్వామి ఊరేగింపు


హోమం నిర్వహిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: జిల్లాలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నగరంలోని కిల్లే బ్రహన్మఠం వెండి అంబా భవాని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కందగడ్డ మారెమ్మ దేవి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కోటలోని కాళికా దేవి ఆలయంలో దేవిని విశేషంగా తీర్చిదిద్దారు. శనివారం రాత్రి పల్లకి సేవలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు. నగరేశ్వరాలయం, ఉప్పార వాడి లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని ఊరేగించారు. మదాపూర్ మారికాంబ ఆలయంలో శాంతమల్ల శివాచార్యులు చండీ హోమం నిర్వహించారు.

- సంఘ్ ర్యాలీ


దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం ధార్వాడలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ర్యాలీ

ఆలయాల్లో ఉత్సవ శోభ


కనకదుర్గమ్మకు బంగారు ఆభరణాల అలంకరణ


అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


బన్నిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న కాలనీ వాసులు

- కనకదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

బళ్లారి అర్బన్: బళ్లారిలో శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కనక దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. విజయదశమి సందర్భంగా 9 రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయం రాజగోపురంతో పాటు నాలుగు గోపురాలను విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు ఈఓ హనుమంతప్ప, ధర్మకర్త రాజశేఖర్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం దేవి పురాణం, సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామాలు, ప్రవచనాలు, సాంస్కృతిక, భక్తి గీతాలను ఆలపించారు.

బన్నిచెట్టుకు ప్రత్యేక పూజలు
బళ్లారి అర్బన్: నగరంలోని 20 వార్డు ఇంటూరి నగర్ శ్రీ దత్తాత్రేయ దేవస్థానం సమీపంలోని పార్కులో వెలసిన బన్నిచెట్టుకు అక్కడి కాలనీ వాసులు ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రముఖులు పంపాపతి, యర్రిస్వామి, నారాయణ స్వామి, గణేష్, గోపాల్, వీరణ్ణగౌడ, హనుమంతు, రఘు, మంజు, నాగేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో...
బళ్లారిటౌన్: నగరంలోని రైల్వే కాలనీ చౌడేశ్వరి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో చౌడేశ్వరి దేవికి ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు జరిపారు. తెల్లవారుజామున ప్రత్యేక పంచామృతాభిషేకం జరిపి రజితకవచ అలంకారం చేపట్టారు. 10 గంటల నుంచి అమ్మవారిని వీరభద్ర వీరతాండవంతో అమ్మవారి భజన, ఆనంద నృత్యం, ఖడ్గ పద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కుష్మాండ బలిగావించి అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సమాజం నేతలు శ్రీ దేవనంద, బీరే ధనుంజయ, ఆలయం ధర్మకర్త నాగభూషణ్, పల్ల పరశురాము, బడిగింజల చంద్రశేఖర్, చింత చంద్రశేఖర్, నరమాల శ్రీనివాస్, బీరే శీన, వెంకటేష్, బాలరాజు, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ పేరుతో రూ. 2.55 కోట్లు హాంఫట్

- ఎఫ్ఐఆర్ నమోదు

హొసపేటె: గత అసెంబ్లీ ఎన్నికల్లో శివమూర్తి అనే వ్యక్తికి హగరి బొమ్మనహళ్లి ఎస్సీ రిజర్వ్‌డ్ టికెట్ ఇస్తానని నలుగురు సభ్యుల బృందం మోసం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు ఈ విషయమై సీఎంకు లేఖ రాయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు కూడా వేశారు. కుందాపూర్‌కు చెందిన హిందూ ఉద్యమకారిణి చైత్ర కేసు తరహాలోనే బీజేపీ టిక్కెట్ మోసానికి సంబంధించిన మరో ఉదంతం వెలుగులోకి వచ్చి ఎఫ్ఐఆర్ నమోదైంది. టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ కోట్లకు కోట్లు మోసం చేసిన కేసు ఇది. రిటైర్డ్ ఇంజనీర్ కొట్టూరు వాసి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హగరిబొమ్మనహళ్లి ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజక వర్గం టికెట్ ఇస్తానని నలుగురు సభ్యుల బృందం శివమూర్తిని మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. నిందితులు రేవణ్ణ సిద్ధప్ప దీనిపై శివమూర్తి స్పందిస్తూ... పార్టీ కార్యక్రమాలకు రూ. 65 లక్షలు ఖర్చు చేశానని అలాగే టిక్కెట్లు ఇప్పిస్తామంటూ మొత్తం రూ.1.90 కోట్లు రాబట్టుకొన్నారని ఇలా మొత్తం రూ.2.55 కోట్లు మోసం చేశారని ఆరోపించారు. ఫిర్యాదుదారుడు శివమూర్తి ఎఫ్ఐఆర్ ఫైల్‌ను ఈనెల 19న కొట్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనలు అలవరచుకోవాలి

కంప్లి: ఆధ్యాత్మిక చింతనల ద్వారా ప్రశాంతత చేకూరుతుందని సండూరు శ్రీ ప్రభుదేవర సంస్థాన విరక్తి మఠపు పరమపూజ్య ప్రభు మహాస్వామి తెలిపారు. నవరాత్రి సందర్భంగా శ్రీ చిదానందవధూత విరచిత దేవి చరిత్రపై నాలుగవ రోజు మాట్లాడారు. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో విద్యా సంస్థ ప్రారంభానికి మెట్రి గోణి బసప్ప రెండు ఎకరాల భూమిని ఈ ప్రాంతంలో విద్యా ప్రగతి అందించారు. ఈ నేపథ్యంలో గుల్బర్గా విభాగ కనకగురు పీఠ తింధణి పరమపూజ్య శ్రీసిద్ధరామనందపురి స్వామిని తాలూకా కురుబర సంఘం పదాధికారులు కలిసి విద్యా సంస్థ ప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు.

రూ. 3.5 కోట్లతో జలజీవన్ మిషన్

శ్రీనివాసపురం: తాలూకాలోని అన్ని గ్రామాలకు రూ. 3.5 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకం అమలు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే జీకె వెంకటశివారెడ్డి తెలిపారు. ఆదివారం తాలూకాలోని రోణూరు, కొళతూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పనులను ప్రారంభించి మాట్లాడారు. పథకంలో భాగంగా ఇంటింటికి కొళాయి కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. 3 నెలల అవధిలో పనులను పూర్తవుతాయన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇంటి ముంగిటికే నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి మెహర్‌తాజ్, మణి, ఎస్ ఎం శ్రీనివాస్, నారాయణగౌడ, చంద్రప్ప, జయరాం, జయరామేగౌడ, నంజుండేగౌడ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో పండుగ సందడి

- అమాంతం పెరిగిన ధరలు

కోలారు: విజయదశమి పురస్కరించుకుని నగరంలోని మార్కెట్లు కిటకిటలాడాయి. నగరంలోని పాత బస్టాండు, ఎంజి రోడ్డు, కేఎస్ ఆర్టీసీ బస్టాండు, శారదా టాకీస్ రోడ్డులో పూలు, పండ్ల దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. యధావిధిగా పండుగకు ముందు పూలు పండ్ల ధరలు భారీగా పెరిగాయి. కనకాంబరాలు ఏకంగా కిలో రూ. 2 వేల విక్రయిస్తుండగా మల్లెలు, కాగడాలు కిలో రూ. 1000, చేమంతులు కిలో రూ. 250 రూలు, బంతిపూలు కిలో 100 రూలకు విక్రయిస్తుండగా, ఊటిరోజా కిలో రూ. 200 విక్రయిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రజలు శక్తిమేర కొనుగోలు చేస్తున్నారు. ఇక అరటిపండ్లు కిలో 100, దానిమ్మ కిలో రూ. 200, ఆపిల్ కిలో రూ. 250, ద్రాక్ష కిలో రూ. 120, ఐదు కిలోల బూడిద గుమ్మడి రూ 100 నుంచి 120 వరకు విక్రయిస్తున్నారు.

గంగావతిలో దుర్గాష్టమి పూజలు


మేగోట దుర్గాదేవికి విశేష అలంకరణ

గంగావతి: దుర్గాష్టమిని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మేగోట దుర్గాదేవి దేవస్థానంలో ఉదయాన్నే విశేష అభిషేకాలు సహస్ర కుంకుమార్చన, మహామంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గంగావతి నగరంలోని గ్రామ దుర్గాదేవికి విశేష పూజలు చేశారు.

హెచ్చెల్సీలో మృతదేహం

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి క్రాస్ సమీపంలో ఉన్న తుంగభద్ర హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచ్ కాలువలో గుర్తు తెలియని 40 సంవత్సరాల వ్యక్తి శవాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివ, సిబ్బంది శవాన్ని పరిశీలించారు. తెలుపు రంగు చొక్కా, చెడ్డి మాత్రమే ఉంది. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుండి బ్రాంచ్ కాలువలోకి వచ్చిందని గుర్తించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు జరిపించారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. ఇటీవల బళ్లారి నగరానికి చెందిన యువకున్ని కొందరు హత్య చేసి ఇదే మాదిరిగా కాలువలో మృతదేహాన్ని పడేయడం తెలిసిందే. ఈ మృతదేహం కూడా బళ్లారి ప్రాంతవాసిది కావచ్చని అనుమానాలున్నాయి.

రెండు కార్లు ఢీ
కూడేరు: ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని జల్లిపల్లి-ఉదిరిపికొండ గ్రామాల మధ్య అనంతపురం-బళ్లారి ప్రధాన ర హదారిపై ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కార్లలో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటక రాష్ట్రం హొసపేటె నుంచి అనంతపురం వైపు, అలాగే అనంతపురం నుంచి బళ్లారి వైపు వెళ్లే కార్లు ప్రమాదానికి గురయ్యాయి.

నీటి నిర్వహణ ముఖ్యం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు నీరు విడుదల చేసి నీటి నిర్వహణ చేయాలని కలబుర్గి ప్రాంతీయ కమిషనర్ క్రిష్ణ బాజ్‌పేయి పేర్కొన్నారు. ఆదివారం ఎడమ కాలువ 104వ మైలులో ఆయకట్టు చివరి భూములకు నీరందించాలంటే గేజ్ సామర్థ్యాన్ని ఐదు అడుగులు పెంచారు. డిస్ట్రిబ్యూటరీలో నీటిగేజ్ ఇంజినీర్లు సక్రమంగా కాలువలపై నిర్వహణ చేయాలని అధికారులకు సూచించారు. రెండురోజులు ఐదు అడుగుల నీరు విడుదలకు తోడు ఐదు రోజుల్లో గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నింపాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదేశించారు. ఎమ్మెల్యే హంపయ్య నాయక్ సిరివార, గణేకల్ ప్రాంత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ నిఖిల్, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రత్యంగిర హోమం


ప్రత్యంగిర దేవికి పూజలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో శరన్నవ రాత్రి ఉత్సవాలలో ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. తిమ్మాపుర పేట బాల మారెమ్మ దేవాలయంలో శారదాంబ శిష్య బృందం గురూజీ నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యంగిర దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. హోమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు.

ఆత్మతృప్తి, మానవత్వం ముఖ్యం


సన్మానోత్సవం దృశ్యం

మండ్య: ప్రస్తుత సమాజంలో శ్రీమంతులను, అధికారాన్ని సామాన్య ప్రజలు పూజిస్తున్నారని, ప్రజల్లోని ఈ భావన మారాలని విశ్రాంత లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే అన్నారు. మానస సంస్థ, డి.కరడి గౌడ ఆధ్వర్యంలో మద్దూరు తాలూకాలోని వళగెరెహళ్లి గ్రామంలో స్వాతంత్ర్య పోరాటయోధుడు డి.కరడిగౌడ పదో పుణ్యస్మరణ, అవార్డుల స్వీకారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం ఉండాలంటే మనిషికి ఆత్మతృప్తి ఉండాలని, దురాశ ఉండకూడదని హితవు పలికారు. మనిషిగా పుట్టిన తర్వాత మానవత్వంతో బతకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ నటుడు శివరాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

త్వరలో 20 వేల ఉపాధ్యాయుల నియామకం

హుబ్లీ: హైకోర్టులో కేసు పరిష్కారమైన నేపథ్యంలో త్వరలో 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపడుతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు. ఈమేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ...మూడు నాలుగేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా చూసుకుంటామన్నారు. అదే విధంగా 600 పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు.

దొంగల అరెస్ట్

హుబ్లీ: బెళగావిలోని ఓ దుకాణంలో రూ.50 వేల నగదు చోరీ చేసి పరారైన నలుగురిని హుబ్లీ ధార్వాడ పోలీసులు పాత గబ్బూరులో అరెస్ట్ చేసి బెళగావి పోలీసులకు అప్పగించారు. బెళగావిలోని ఓ దుకాణంలో యజమాని దృష్టి మళ్లించి రూ.50 వేల నగదు చోరీ చేసి పరారయ్యారు. ఆదివారం వీరు బెళగావి నుంచి హుబ్లీకి వైపు వస్తున్నారని తెలుసుకున్న బెళగావి పోలీసులు హుబ్లీ ధార్వాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు గాపుగాచి పట్టుకున్నారు.